# కథాదీపిక

మాస్టర్ కె. పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2004

ప్రతులు : 1,000

వెల : రూ॥ **40-00**

ప్రాప్తిస్థానము :

జగద్గురు మందిరము

(ది వరల్డ్ టీచర్ టెంపుల్)

'రాధామాధవమ్', 14-38-2, ముప్పిడి కోలనీ,

విశాఖపట్నం - 530 002.

ముద్రణ :

ఎక్సేలియన్ ప్రింటింగ్ స్కూల్

విశాఖపట్నం - 530 016.

☏ 2747320, 2751329.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"**, డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## *సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్*

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు.

శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడి పించుచున్నది. భగవధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

## తొలిపలుకు

సూక్ష్మమగు విషయములను శ్రోతలకు, పాఠకులకు సులభముగ నందించుటకు కథలను వివరించుట పరిపాటి. యోగ సాధకులకు స్ఫూర్తి నిచ్చు కథలు కోకొల్లలుగ నుండగ పరమగురువు లందించిన కొన్ని కథలు హిమాలయపు ఉత్తర ప్రాంతములో ఎక్కువ ప్రాముఖ్యముగ నున్నవి. అవి, అనుయాయులకు వారొసంగిన కథలు. సాధక బృందములు ఈ కథలను తరచు జ్ఞప్తికి తెచ్చుకొనుచు స్ఫూర్తిమంతులై ముందుకు సాగు చుందురు. ఇట్టి కథలు అరువది వరకు 'నావాణి' దర్శన మాస పత్రికయందు ప్రచురించుట జరిగినది. వానిని పాఠకుల కోరిక మేరకు ఒక పుస్తకముగ ప్రచురించుటకు 'ధనిష్ఠ' సంకల్పించినది.

ఇందు వివరింపబడిన కథలన్నియు సాధకులకు దారి చూపు దీపికల వంటివి. అందుచే ఈ పుస్తకమునకు "కథాదీపిక" అను నామకరణము మాస్టర్ పార్వతీకుమార్‌గారు గావించినారు.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి 60వ జన్మదిన సంవత్సర సంకేతముగా ఈ 60 కథలను ధనిష్ఠ ప్రచురించి పాఠకులకు అందించుచున్నది.

## పరిచయము

వేదవ్యాస మహర్షి వేదములను వర్గీకరించి విష్ణు పురాణ మును 18 పురాణములుగ విశదీకరించి, బ్రహ్మసూత్రముల నందించి "జయము" అను పేర మహాభారతమును పంచమ వేదముగ తీర్చిదిద్ది మానవజాతికి కలియుగమున మహత్తర జ్ఞానమందించిన మహర్షి. అతడు ద్వైపాయన కృష్ణుడు.

అట్టి మహర్షి యజ్ఞార్థము శతాబ్దముపైన జీవించి తాను నిర్వర్తించిన మహా జ్ఞానయజ్ఞమును పునః పరిశీలించి వ్యాకులత చెందెను. మహత్తర జ్ఞానమును మహాద్భుతముగ వ్యాఖ్యానించి వివరించిన పిమ్మట సామాన్యులకది అవగాహన యగునా? అని సందేహము కలిగెను. సామాన్యజీవులకు వలసినది ఈశ్వరాను భూతితో కూడిన సుఖజీవనము. పండిత గోష్ఠులు, సంవాదములు, చర్చలు, తర్కములు కావు. బహుళమగు జన సామాన్యమునకు తాను రచించి అందించిన జ్ఞానము అవగాహన కాదేమోయని చింతించుచుండెను.

కర్మ సూక్ష్మములు, ధర్మ సూక్ష్మములు సామాన్యులెరిగి జీవించినచో వారి సుఖజీవనముల కంతరాయము కలుగదు. అట్లు వివరించుటకు తానేమిచేయవలెను అని వ్యాకుల పడుచున్న వేదవ్యాసునికి దైవయోగమున నారదుని దర్శనమయ్యెను.

నారదుడు దేవర్షి. భక్తి జ్ఞాన వైరాగ్య యోగముల నౌపాసన పట్టిన దిట్ట. ఆకాశమార్గమున చరించుచు, వీణా తంత్రులను మ్రోయించుచు సతతము నారాయణ మంత్రమును ఆలా పించుచు విహరించెడి దివ్యమూర్తి. అతడు చరించు తావుల యందు దశ దిశలు ప్రకాశింపగలవు. అట్టి నారదుడు వేదవ్యాసుని వ్యాకులతను గమనించి అతని ఆశ్రమము చేరినాడు. వేద వ్యాసుని హృదయ పూర్వకముగ ప్రశంసించినాడు. వేదవ్యాసుడు నారదుని పూజించి, తనకు కలిగిన కొఱతను, కలతను వివరించి పరిష్కారము కోరెను. నారద మహర్షి కరుణతో యిట్లనెను.

“ధర్మచయము నంతటిని తెలిపితివి. సూక్ష్మ విషయము లను వివరించితివి. ధర్మము దైవమే. ధర్మపర్ణము లెన్ని చెప్పిననూ శ్రోతల కనుభూతి కలుగదు. రుచి కలుగదు. ఆచరించు బుద్ధి కలుగదు. పోషకమగు ఆహారము రుచిగ కూడ నుండవలెను. అపుడే సామాన్యుడు భుజించును. కేవలము పోషకమని భుజించడు. రుచిలేని భోజనమువలె దైవ ప్రస్తుతి లేని ధర్మములు సామాన్యుల నాకర్షింపవు. కావున విష్ణు కథలు తెలుపుచు ధర్మము నందింపుము.

అపుడు నీ కొఱత, కలత తీరును. సామాన్యులకు పరిష్కారము దొరకును.''

కథలనుండి ధర్మసూత్రములను, కర్మసూత్రములను 'యోగ సూత్రములను అందించుట వేదవ్యాస మహర్షి మొదలిడెను. మునుపదే కార్యము వాల్మీకి మహర్షి నారదు నుపదేశమున యొనర్చెను. కథలనుండి సాధనా సూత్రములను తెలుపుట బోధకుల నైపుణ్యము. అట్టి బోధనల నెన్నియో పరమగురువులు గావించినారు. అందలి సూత్రములను గ్రహించి నూతనముగ కథలల్లుట మరల జరిగినది. పర్యవసానమే "కథాదీపిక''.

ఇందలి సాధనా సూత్రములను బుద్ధిమంతులగు యోగ సాధకులు గ్రహించి వలసిన స్ఫూర్తిని పొందుదురు గాక!

\- పార్వతీకుమార్

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ఊహ – తృప్తి | .... | 15 |
| 2. | క్రొత్త సరదా | .... | 16 |
| 3. | తెలివి – చావు | .... | 17 |
| 4. | విద్యార్థి | .... | 19 |
| 5. | గురు ప్రసాదము | .... | 21 |
| 6. | లోకం తీరు | .... | 24 |
| 7. | లోకాలోకము | .... | 27 |
| 8. | వేషధారణ | .... | 30 |
| 9. | ఏడుపు – నవ్వు | .... | 32 |
| 10. | మెఱపు – పిడుగు | .... | 33 |
| 11. | మాయ | .... | 36 |
| 12. | లోకం తీరు | .... | 38 |
| 13. | ఉన్నతాసనము | .... | 40 |
| 14. | విచిత్ర అనుభవము | .... | 41 |
| 15. | పెద్ద – చిన్న | .... | 45 |
| 16. | అంతర్యామి | .... | 47 |
| 17. | నమ్మకము | .... | 49 |
| 18. | కోతులు !!! | .... | 51 |
| 19. | ఆవశ్యకత | .... | 50 |

| | | | |
|---|---|---|---|
| 20. | అవగాహనము – అంగీకారము | .... | 54 |
| 21. | సాన్నిధ్యము | .... | 56 |
| 22. | చివరకు మిగిలేది ! | .... | 58 |
| 23. | బుద్ధ మార్గము | .... | 60 |
| 24. | తీర్పు | .... | 62 |
| 25. | నిర్వాణ సోపానము | .... | 65 |
| 26. | సహజీవనం | .... | 69 |
| 27. | బుద్ధుని క్రమశిక్షణము | .... | 72 |
| 28. | కులపతిత్వం | .... | 74 |
| 29. | హెచ్చరిక! | .... | 81 |
| 30. | మంచి – చెడు | .... | 83 |
| 31. | దైవ సందేశము | .... | 86 |
| 32. | పొట్టు గింజ | .... | 88 |
| 33. | గంగాస్నానం | .... | 90 |
| 34. | దైవప్రేమ | .... | 94 |
| 35. | అర్హత – అనుగ్రహం | .... | 96 |
| 36. | బంగారం | .... | 100 |
| 37. | వినయ నయనము | .... | 102 |
| 38. | గుండ్రాయి | .... | 105 |
| 39. | కోతిమూకలు | .... | 108 |
| 40. | జరిగిన కథ | .... | 111 |

| | | | |
|---|---|---|---|
| 41. | చేదు నిజం | .... | 123 |
| 42. | రేపటి భయం | .... | 126 |
| 43. | జ్ఞాన పర్యవసానం | .... | 129 |
| 44. | తెలుపు – నలుపు | .... | 131 |
| 45. | మూర్ఖత | .... | 133 |
| 46. | అమ్మకం – నమ్మకం | .... | 136 |
| 47. | పూర్వాపరాలు | .... | 138 |
| 48. | అస్మి | .... | 142 |
| 49. | సదాచారము – సాన్నిధ్యము | .... | 146 |
| 50. | వా ద న | .... | 148 |
| 51. | లేనిది లేదు | .... | 150 |
| 52. | సత్యం – శివం – సుందరం | .... | 152 |
| 53. | బుద్ధుని మౌనము | .... | 155 |
| 54. | అత్యావశ్యకత | .... | 159 |
| 55. | శుద్ధి – సిద్ధి | .... | 161 |
| 56. | మహిమ | .... | 163 |
| 57. | నిష్క్రమణ | .... | 164 |
| 58. | బుద్ధ – మైత్రేయులు | .... | 170 |
| 59. | నైష్ఠికుని మరణము | .... | 176 |
| 60. | కరదీపిక | .... | 179 |

# కథాదీపిక

# 1

## ఊహా - తృప్తి

నక్క ఒకటి ప్రొద్దున్నే నిద్రలేచి ఉదయకాంతిలో తన నీడను చూచింది. “ఆహా! ఈ రోజెంత సుదినము. భగవంతుడు నాకు ఒక పెద్ద దున్నపోతును ఆహారముగా ప్రసాదించి నట్లున్నాడు” అని అనుకొని ఉత్సాహంతో వడివడిగా అడుగులు వేస్తూ మరణించి పడియున్న దున్నపోతుకోసం వెదుకుతూ పోయింది. క్రమశః సూర్యుడు మధ్యాహ్న సమయానికి నడినెత్తికి రాసాగేడు.

ఎండ వలన, తిరుగుట వలన నక్కకి ఆకలి పెరిగింది. అప్పుడు మరొక్కసారి తన నీడను చూచుకొంది. “నిజానికి ఒక ఎలుక చాలు ఈ రోజుకి” అని ఎలుకను తిని, తృప్తి పడింది.



## 2

# క్రొత్త సరదా

**ఒ**క రోజు రాత్రి నాకు ఒక క్రొత్త సరదా తోచింది. దాని గురించి ఆలోచిస్తే అట్టి ఆనందాన్ని అనుభవించాలని అనిపించింది. మనసులో ఒక ప్రశ్న వేసుకున్నాను. వెంటనే లోపలినుండి ఒక దేవత వచ్చింది. “ఈ సరదా అనుభవించటం మంచిదే” అన్నది. అనుభవించ బోయాను. ఈ లోపల నా లోనించి ఒక దెయ్యం వచ్చింది. “ఈ సరదా అనుభవించటం పాపం. ముమ్మాటికీ యిది పాపమే” అని చెప్పింది.

“కాదు పుణ్యమే” అన్నది దేవత.

“కాదు పాపమే” అన్నది దెయ్యం.

“కాదు పుణ్యమే” అన్నది దేవత.

ఆ రోజు నుంచి దేవత, దెయ్యం ఆ సరదాను గూర్చి పోట్లాడుకుంటూనే వున్నారు, యిప్పటికి కూడా. అది యీనాటికీ తేలలేదు.

# 3

## తెలివి - చావు

**మూ**డు చీమలు నిద్రపోతున్న ఒక మనిషి పక్కపై సమావేశం అయ్యాయి. ప్రతి చీమ మరియొక చీమకు తనదైన మతపరంగా నమస్కరించుకున్నాయి. మూడు మతాల గురించి చర్చించుకున్నాయి. చర్చ ఆకలి వేసేవరకూ కొనసాగింది. అందు మొదటి చీమ మనిషి పొట్టపై ఆహారంకోసం వెదుకులాడింది. "మనమున్న పీఠభూమి మీద ఎక్కడా తినడానికి ఒక గింజ కూడా దొరికేట్టు లేదు. బోలెడు చెట్లున్నాయి కానీ, ఒక్క పండు కూడా కనిపించటం లేదు. మనం యిప్పుడేం చేయాలో తోచటం లేదు" అని చెప్పింది. వాటిలో రెండవ చీమ "భోజనం సంగతి అలా వుంచు, ఈ పీఠభూమిపై మొలకలవలె చెట్లు మొలిచేయి. భూమి మృదువుగా వుంది. చెట్లు పెరిగి వున్నాయి. అయినా ఫలాలు లేవు. పైగా భూమి పైకి- క్రిందికీ బాగా కదులుతూ వుంది. ఇది ఒక అద్భుతమైన ప్రదేశమై వుండాలి" అన్నది.

మూడవ చీమ "స్నేహితులారా! మనమంతా ఒక దేవుడి చీమ తలపై వున్నట్లుగా నాకు అనిపించుచున్నది. ఎందుకంటే, ఈ కదులుతున్న భూప్రదేశానికి ఆద్యంతాలు కనిపించటం లేదు. మొత్తము రూపము మనకు తెలియటం లేదు. కావున యిది దేవుని చీమ విశ్వరూపమే అయి ఉండాలి. యుగాంతము కాబో తున్నది కదా! అందుచే మనలను ఉద్ధరించుటకు ఆ దైవమే ఈ కదిలే మృదువైన పీఠభూమి ఏర్పరచినాడేమో! భగవద్భక్తులం కాబట్టి మన ముగ్గురిని ఆ భగవంతుడే రక్షించుకొంటున్నాడు" అని గర్వంగా ప్రకటించింది.

మూడు మతముల చీమలూ అమందానందాన్ని పొందు తున్నాయి. ఇంతలో నిద్రిస్తున్న మనిషి నిదురలో బోర్లా తిరిగేడు. మూడు చీమలూ పొట్టకి–నేలకీ మధ్యపడి మరణించేయి.



# 4

# విద్యార్థి

సముద్రములో ఒక చేప మరొక చేపతో ఇలా అంటున్నది. "మన సముద్రములాగే ఇంకొక సముద్ర మున్నది. ఆ సముద్రములో కూడ మనలాగే చేపలు నివసిస్తూ వున్నాయి. కాకపోతే ఆ సముద్రములోని నీరు, అందులోని చేపలు మనకన్నా స్వరూప స్వభావాలలో భిన్నముగా వుంటాయి."

"అంతా పచ్చి అబద్ధము. ఇది కేవలము ఊహ మాత్రమే. ఇటువంటి ఊహల్లోను, మూఢనమ్మకాల్లోను జీవిస్తూ, మన వాళ్ళంతా పాడైపోతున్నారు. మన సముద్రముదాటి ఒక్క అంగుళము బైటికి వెళ్తే మనము మరణిస్తాము. ఎక్కడో ఇంకొక సముద్ర మున్నదని, అక్కడ కూడా యింకా చేపలు వున్నాయని భావించటం వెట్టి" అని యింకొక చేప వాదించింది.

"మనకి కనబడినదే సత్యము, మనకి తెలిసినదే సత్యము అనుకోవటము పరిమితజ్ఞానము. మనకు తెలియనిది, మనకు

పెద్దలచే తెలుపబడినది, బొత్తిగా నిరాకరించవలసిన అవసరము లేదేమో! నిరాకరించక, పరిశీలించుట వివేకవంతుల లక్షణము. నిరాకరణ బుద్ధితో కూడ పరిశీలించుట మంచిది కాదు. నేర్చుకొన వలెను, తెలుసుకొనవలెను అనే బుద్ధితో పరిశీలించుట మంచిది. నీలాగే ఇదివరకు ఒక కప్ప కూడా వాదించింది. ఒక తెలిసిన కప్ప బావిలో వున్న ఇంకొక కప్పకు ఆకాశము చాలా పెద్దదని, దానికి అవధులు లేవని తెలిపింది. బావిలోని కప్ప "నేను ముమ్మాటికీ నమ్మను. బావిలోంచి మనకు కనపడే ఆకాశమే మొత్తము ఆకాశము. అంతకు మించి ఆకాశము లేదు" అని వాదించింది. మొదటి కప్ప, రెండవ కప్పను బావి అంచువరకు తీసుకువెళ్ళి ఆకాశమును చూపించింది. అప్పుడు రెండవ కప్ప నిర్ఘాంతపోయింది, అవాక్కయ్యింది.

కాబట్టి చిత్తశుద్ధితో, పరిశీలనా బుద్ధితో, వినయ ముతో పెద్దలు తెలిపిన విషయాన్ని అన్వేషించుట వలన, తెలిసిన దానికన్న మరికొంత తెలుస్తూనే వుంటుంది. మనో వికాసము కలుగుతూనే వుంటుంది. పరిమితత్త్వము తొలగుతూనే వుంటుంది. ఇట్లు అన్వేషించువాడే విద్యార్థి. జ్ఞానముయొక్క ప్రయోజన మిదియే."

# 5

# గురు ప్రసాదము

సద్గురు బోధలు విన్న ఒక శిష్యుడు సత్కార్యాలు చెయ్యటము ప్రారంభించాడు. అందులోని ఆనందం పొందటం ప్రారంభించాడు. క్రమశః కీర్తి ప్రతిష్ఠలు రావడం మొదలైనవి. తరతరాల నుంచి తనకు సంక్రమించిన బంగారము కూడా సత్కార్యాలకై విరివిగా వినియోగించాడు. తన గురువు సంతృప్తి చెందుతాడని బాగా భావన చెందుతూ వుండేవాడు. గురు ప్రశంసకై ఎదురుచూస్తూ వున్నాడు. ఒకనాడు సద్గురువు తన అనుయాయుల ద్వారా శిష్యులకు ఒక రాతిముక్కను పంపించాడు. వచ్చిన అగంతకుడు శిష్యునికి ఆ రాతిముక్కను ఇచ్చాడు. అదేమిటి అని శిష్యుడు ప్రశ్నించాడు. గురువుగారు అతని కిమ్మన్నారని అగంతకుడు తెలిపాడు. ఇచ్చిన రాతిముక్కను అటు, ఇటూ పరిశీలించి దీని విశేష మేమైనా గురువు గారు తెలిపారా? అని ప్రశ్నించాడు. దానికి వచ్చినవాడు ఆ రాతి ముక్క వేరే గ్రహానికి సంబంధించినదని, అది నీకు, నీవు చేసిన

సత్కార్యములకు బహుమతిగ సద్గురువు పంపించాడని తెలిపి వచ్చిన వాడు తిరిగి వెళ్ళాడు.

శిష్యుడు రాతిముక్కను పదే పదే చూడసాగాడు. తాను ఒనరించిన దానధర్మాలకు, సత్కార్యాలకు తనకు గురువు దగ్గర నుంచి లభించింది ఇదా అని బాధపడ్డాడు. సమస్తమైన సంపదను పణంగాపెట్టి, కుటుంబ బంగారాన్ని కూడా దానధర్మాలకి వినియో గించానే, దానికి నే కోరిన ఫలితమిదా? అని దుఃఖితుడు అయినాడు. ప్రతిరోజు ఉదయం ఆ రాతి ముఖం చూడగానే అతనికి కోపం ప్రకోపించేది. తనకి బుద్ధివికాసం కలుగుతుందని, ఆత్మజ్ఞానా నికి మార్గము ఏర్పడుతుందని, గురువు హృదయములో చోటు కలుగుతుందని ఎంతో భావించాడు. కాని ఫలితము, ఈ రాతిముక్క!

ఒకనాడు ఉదయం ఆ రాతిముక్కను చూడగానే విపరీత మైన కోపం, ఆ తరువాత దుఃఖము కలిగి దానిని తన నివాసం ప్రక్కనే ప్రవహిస్తున్న ఒక సెలయేటిలోకి బలంకొద్దీ విసిరాడు.

రాతిముక్కను విసిరిన ముహూర్తకాలంలో సద్గురువు సాక్షాత్కరించాడు. శిష్యుడిని ఆశీర్వదిస్తూ "నీకిచ్చిన రాతిముక్క పదిలంగా వుంచుకున్నావా?" అని చిరునవ్వుతో ప్రశ్నించాడు. "ఆ రాతిముక్క అత్యంత దూరమైన గ్రహము నుండి నీ కొరకు తెప్పించాను. దానిని శ్రద్ధగా ఒక్కమారు చూచినచో, కామధేనువువలె సమస్తమైన సంపదలను నీకందిస్తుంది. అది కోరేది శ్రద్ధావీక్షణమే. దాని కారణంగా నీవు అపరిమితముగా దానధర్మాలు చేసి అమితా

నందభరితుడ వవుతావని అందించాను” అని తెలిపాడు సద్గురువు. శిష్యునికి తెలివి తప్పినంత పని అయినది. తెల్ల మొహము వేస్తూ గురువు కన్నుల లోనికి చూడలేక ముఖం దింపేసుకున్నాడు. ఒక ముహూర్తకాలము తరువాత ముఖమెత్తి చూస్తే సద్గురువు అక్కడ లేడు.

నిరాశ నిస్పృహలతో, ఆతృతతో, సెలయేటివైపుకి పరుగెత్తాడు. అక్కడ నీటిలో పడి వున్న రాయికోసం వెతికాడు. ఇప్పటికీ వెతుకుతూనే వున్నాడు. నేటికీ గురుప్రసాదం కోసము ఎదురు చూస్తూ వున్నాడు.

# 6

# లోకం తీరు

పెట్టె పట్టుకొని యువకుడు ఒకడు గబగబా రాజమండ్రిలో గోదావరి రైలు ఎక్కాడు. ప్రక్కన ఉన్న ప్రయాణీకుడు 'ఎంతదాకా ప్రయాణము?' అని అడిగాడు. 'హైదరాబాదు వరకు' అని చెప్పాడు యువకుడు. 'మీ ప్రయాణం ఎంతవరకు?' అని యువకుడు తోటి ప్రయాణీకుని అడిగాడు. 'నేనూ హైదరాబాదుకే' అని ప్రయాణీకుడు బదులిచ్చాడు. పెట్టెను బెర్త్ క్రింద భద్రపరచి యువకుడు పై బెర్త్ మీదకు వెళ్ళి పడుకొన్నాడు. రైలు గోదావరి నది దాటి, నిడదవోలు చేరింది. 'తొమ్మిది గంటలు అవుతోంది, ఇక లైట్లు ఆర్పి పడుకోండి' అని అరిచాడొక ముసలాయన. లైట్లార్పి అందరూ నిద్రపోవుటకు ప్రయత్నించారు....

తెల్లవారుజామున నాలుగు గంటల ముప్పది నిముషము లైనది. అటెండరు అందర్నీ నిద్ర లేపాడు. "బీబీ నగరు దాటింది, హైదరాబాదు వచ్చేస్తున్నాము, లెమ్మన్నాడు" కళ్ళు నులుముకుంటూ

ఒక్కొక్కరు నిద్ర లేచారు. వారి వారి సామాన్లు భద్రముగా వున్నాయో లేదో చూసుకున్నారు. యువకుడుకూడా పై బెర్త్ నుంచి దిగి క్రింద కూర్చొని తన పెట్టె పెట్టిన చోటులో చెయ్యిపెట్టి తడిమాడు. చోటు ఖాళీగా వున్నది! వంగి చూశాడు. పెట్టె లేదు !

'నా పెట్టె పోయింది'. అని అరిచాడు. ప్రయాణీకులకు ఒక్కసారి నిద్రమత్తు ఎగిరిపోయింది. పెట్టె పోయిన విషయము అందరినీ ఆకర్షించింది. "పెట్టెకు చైన్ వేసి తాళము వెయ్యలేదా!" అన్నాడొక ప్రయాణీకుడు, 'లేదు' అన్నాడు యువకుడు. అదే తెలివి తక్కువ, అన్నాడు మరియొక ప్రయాణీకుడు. 'పెట్టెలో డబ్బుందా? ఉంటే ఏ మాత్రమున్నది?' అన్నాడు మరియొక ప్రయాణీకుడు. 'పదివేల రూపాయల వరకు వున్నాయి' అన్నాడు యువకుడు. 'మూర్ఖత్వం కాకపోతే డబ్బులున్న పెట్టె క్రిందపెట్టి పైన పడుకుంటా రటయ్యా?' అన్నాడు ఒక ముసలాయన. నాలాగ పెట్టె బెర్త్ మీద పెట్టుకొని పడుకోవచ్చు కదా!' అన్నాడొక పొట్టాయన. 'ఈ రోజుల్లో పిల్లలకి అంతా అశ్రద్ధే! పైగా చెప్తే వినిపించుకోరు' అన్నది ఒక పిల్లల తల్లి. ఇక అందరూ కలసి పోయినపెట్టె గురించి బాహా బాహీగా విపరీత ధోరణిలో చర్చిస్తూ వచ్చారు. ఈ లోపల రైలు హైదరాబాదుకి చేరింది. అందరూ దిగి ఎవరి దారిన వాళ్ళు వెళ్లి పోయారు. యువకుడు చేతులు ఝాడించుకుంటూ రైలు దిగాడు. అతని బుఱ్ఱలో ఒక సమాధానము లేని ప్రశ్న నిలిచింది. ఇలా ఆలోచించుకుంటూ నడచిపోయాడు.

“పెట్టె పోతే పోయింది. తనను తెలివితక్కువ వాడన్నారు, శ్రద్ధ లేని వాడన్నారు, మూర్ఖుడు అన్నారు. నా గురించి స్వతంత్రించి ఇష్ట మొచ్చినట్లు మాట్లాడుకున్నారు. అసలు వీళ్ళకి నా గురించి ఏం తెలుసు? పోనీ అదీ సర్దిపుచ్చుకుంటాను, పెట్టె దొంగిలించిన వాడి గురించి ఒక్క మాట గూడ అనరేమి? పెట్టె పోగొట్టుకొన్న వాడిని ఇన్ని మాటలన్నారేమిటి?”

ప్రక్కనే కుంటుకుంటూ ఒక ముసలాయన ముసలావిడతో ‘ఇది వింత ప్రపంచం!’ అన్నాడు. యువకుడికి సమాధానం దొరికంది. ‘అవును, ఇది వింత ప్రపంచం!!’ అనుకున్నాడు.



# 7

## లోకాలోకము

**నా**గరిక ప్రపంచంలోకి అమాయకు డొకడు ప్రవేశించాడు. నగరంలోని వింతలూ విశేషాలూ చూస్తూ ఆశ్చర్యపడుతూ, ఆనందిస్తూ సాగిపోతున్నాడు. నాగరికుల ప్రవర్తన ఆశ్చర్యముగా వున్నది. వాళ్ళ భాష అసలే అర్థము కావటము లేదు. మధ్యాహ్నం పన్నెండు గంటలయ్యింది. అందరూ ఒక పెద్ద పాలరాతి భవనము లోనికి ప్రవేశిస్తున్నారు. దేవాలయము అయివుంటుంది అనుకుంటూ అమాయకుడు కూడా లోపలికి ప్రవేశించాడు. లోపల అడ్డముగా బల్లల చుట్టూ చేరి ఆహార పదార్థములు తింటున్నారు. ఆ విశాలమైన గదిలో కొంతమంది సంగీతకచేరీ చేస్తున్నారు. సంగీతం వింటూ మాట్లాడుకుంటూ వడ్డించిన పదార్థము లందరూ తింటున్నారు. అమాయకుడు కూడా సంగీతం వింటూ ఒక టేబుల్ దగ్గర కూర్చున్నాడు. ఇంతలో కుచ్చుటోపీ పెట్టుకున్న ఒక సర్వరు చల్లని మంచినీళ్లు అందిస్తూ ఏమి తింటారని ప్రశ్నించాడు. అమాయకుడికా భాష అర్థంకాలేదు. ప్రక్కవాళ్ళు తింటున్నవైపు యధాలాపంగా చూశాడు. సర్వరు సలాంకొట్టి వెళ్ళిపోయాడు. అమాయకుడు "ఈ

ఊరి రాజుగారు ఏదో పెద్ద విందు ఏర్పాటు చేసినట్లున్నారు. ఈ రోజు అందరికీ మర్యాదలు చేస్తున్నారు. పానీయాలు అందిస్తున్నారు. విందుభోజనం పెడ్తున్నారు. సంగతకచేరీ కూడా ఏర్పాటు చేశారు అని అనుకున్నాడు. ఇంతలో కుచ్చుటోపీ వాడు ఆహార పదార్థము లను తీసుకొచ్చి అమాయకుడున్న టేబుల్ మీద ఉంచి వినయంగా సలాం చేస్తూ వెళ్ళిపోయాడు.

"ఆహా! ఈ రాజభటులు ఎంత వినయముగా వున్నారు. ఎంతో మర్యాద చేస్తున్నారు. చల్లని పానీయముతోపాటు వేడివేడి విందు భోజనము పంపిస్తున్నారు. ఈ భోజనశాల అంతా గూడా చల్లనిగాలి మెల్లగా వీస్తూవుంది కూడ" అని ఆనందపడుతూ ఆకలితోవున్న పొట్టకు ఆహారాన్ని అందించాడు అమాయకుడు. భోజనము పూర్తి అయ్యేసరికి కుచ్చుటోపీ వాడు పళ్ళెంలో ఒక కాగితము, కిళ్ళీ పెట్టాడు. అది తాంబూలముగా భావించి అమాయ కుడు నోట్లో పెట్టుకుని దాని క్రిందవున్న కాగితము వదిలేసి చిరునవ్వుతో బైటికిసాగాడు.

గేటు దాటుతుంటే ఒక బుఱ్ఱమీసాల వాడు, ఆజానుబాహువు అడ్డువచ్చి నమస్కరించి "అయ్యా! తమరు భోజనానికి పైకము చెల్లించటము మరిచారు" అని అన్నాడు. అమాయకుడికి అర్థం కాలేదు. చిరునవ్వుతో ధన్యవాదాలు చెప్పి ముందుకు సాగిపోయాడు. బుఱ్ఱమీసాలవాడు అడ్డువచ్చి గట్టి చప్పట్లు కొట్టాడు. నలుగురు మనుష్యులు వెంటనే అక్కడికి వచ్చారు. వాళ్ళుకూడా రాజభటుల వేషములో వున్నారు. వాళ్ళు బేరర్స్ అని అమాయకుడికి తెలియదు. ఆ నలుగురు ఆమాయకుడిని తలావైపు చేతులు పట్టుకొని

తీసుకువెళ్తూ వుంటే 'ఓహో ఏమి రాచమర్యాద' అని అమాయకుడు భావించాడు.

కోర్టులో అమాయకుడిని నిలబెట్టి నల్లకోటు వాడొకడు జడ్జికి విషయము వివరించాడు. ఉన్నత స్థానములో కూర్చున్న జడ్జిని చూసి అతడే రాజనుకున్నాడు అమాయకుడు. నల్లకోటువాడు చెప్పిన విషయాన్ని విని జడ్జి అమాయకుడిని సమాధానము కోరాడు. రాజుగారు తన్ను కుశలప్రశ్నలు వేస్తున్నాడని అమాయకుడు భావించాడు. తన భాషలో తనకు మర్యాదలు బాగానే జరిగాయని, తానెంతో కృతజ్ఞుడననీ నమస్కరిస్తూ విన్నవించాడు. జడ్జికి అమాయ కుడి భాష అర్థం కాలేదు. ఇతడెవరో విదేశీయుడని, ఇచ్చటి పరిస్థితులు తెలియనివాడని గ్రహించాడు. కాని న్యాయవాది చట్ట పరంగా శిక్ష విధించాలని కోరాడు. న్యాయమూర్తి అమాయకుడికి గుండు కొట్టించి గాడిద మీద ఊరేగించమని నిర్ణయము చేశాడు.

అమాయకుడికి గుండు కొట్టించి గాడిద మీద ఊరేగిస్తుంటే అమితానందం కలిగింది. అతని దేశంలో దైవభక్తుల కా విధంగా మర్యాద చేస్తూ ఉంటారు. ఊరేగింపబడుతూ వుంటే వూళ్ళో ప్రజలంతా వీధుల్లోచేరి నవ్వుతూ కేరింతలు చేశారు. అమాయకుడు అమితానందం పొందాడు. "ఆహా! ఈ రాజు, ఈ రాజభటులు నగరిలోని ప్రజలు ఎంత సంస్కారవంతులో, అతిథిగా వీరు నాకొన రించిన మర్యాదలు అత్యద్భుతముగా నున్నవి. అన్నిటికి మించి నన్నొక మహా భక్తునిగ గూడ గుర్తించారు. ఏమి వీరి ఔదార్యము" అని తన్మయత్వం చెందాడు. అతని లోకం వేరు. అతని ఆనందం వేరు. అది ఈ లోకం వారికి అందదు.

# 8

## వేషధారణ

**స**త్యము, అసత్యము అన్నదమ్ములు. ఒకరోజు సాయం కాలము వారిద్దరూ నదికి స్నానానికి వెళ్ళారు. తమ దుస్తులను నది ఒడ్డున విడిచి నదిలో స్నానానికి ఉపక్రమించారు. అసత్యము, సత్యము కన్నా ముందు స్నానము ముగించుకొని గబగబా నది ఒడ్డుకు చేరి సత్యము దుస్తుల్ని ధరించి పారిపోయాడు. సత్యము నది స్నానము యథావిధిగా చేసుకొని నది ఒడ్డునకు చేరి తన దుస్తుల కొరకు వెతుక్కున్నాడు. అవి కనపడలేదు. తన సోదరుడు అసత్యము దుస్తులు మాత్రమే వున్నవి. తనవి లేవు. పరిస్థితిని అవగాహన చేసుకుని అసత్యము దుస్తులనే సత్యము ధరించి సంఘములోనికి ప్రవేశించాడు.

అప్పటి నుండి అసత్యము, సత్యము దుస్తులని ధరించి సంఘములో పెద్దవాడుగ చెలామణి అవుతూ వస్తున్నాడు. సత్యము సిగ్గుతో, వినయముతో గుర్తింపులేక సంఘములో జీవిస్తూ వున్నాడు. వేషధారణము బట్టి అసత్యమును సంఘము మిక్కుటముగా

ప్రశంసించటము, పూజించటమూ జరుగుతున్నది. దైవ సమానుడుగా కీర్తింపబడుతున్నాడు. వేలాది జనం అసత్యము ధరించిన సత్య వేషధారణకు అమ్ముడుపోయారు. సత్యము మౌనముగా ఉండి పోయాడు. కొద్దిమంది సామాన్యులు మాత్రము వేషమునుబట్టి కాక, ముఖవర్చస్సును బట్టి సత్యాన్ని గుర్తిస్తూ వున్నారు.

సత్యాన్వేషి అయిన ఒక యువకుడు యథార్థాన్ని గమనించి సత్యాన్ని ఆశ్రయించి ఇలా ప్రశ్నించాడు. అసత్యానికి ఆదరణము, సత్యానికి నిరాదరణము కలుగుతోంది. కేవలము వేషధారణను బట్టి అసత్యము సంఘాన్ని ఆకర్షిస్తూ వుంటే సత్యము ఎందుకలా మౌనము వహించి యున్నది? సత్యం చిరునవ్వుతో ఇలా అన్నాడు. "ప్రపంచమే అసత్యము. ప్రపంచంలో జీవించే వారికి సత్యము నందుకన్నా అసత్యము నందు ఆకర్షణ ఎక్కువ. కావున అసత్యానిదే పై చేయిగా వుంటుంది. గొప్పదనము కోరుకునే వారు, గొప్పదనాన్ని ఆరాధించే వారు అసత్యానికి ఆకర్షితు లవుతారు. మంచితనాన్ని ఆరాధించే వారు, ప్రశాంతముగా జీవింప కోరుకునే వారు సత్యానికి ఆకర్షింపబడుతారు. అసత్యారాధకులకు ఎన్ని వున్నా అంతశ్శాంతి వుండదు. సత్యారాధకులకు ఏమీ లేకున్న మనశ్శాంతి వుంటుంది. ఎక్కడ మనశ్శాంతి వుందో, అక్కడ సత్యం వుంటుంది. ఎక్కడ అసత్య ముంటుందో, అక్కడ మనశ్శాంతి వుండదు" అని బోధించి సత్యము ముందుకు సాగిపోయాడు.

9

# ఏడుపు - నవ్వు

**ఒ**క శుభోదయాన ఒక నక్క, ఒక మొసలి ఒకదానికొకటి ఎదురుపడ్డాయి. ఒకర్నొకరు కుశల ప్రశ్నలు వేసుకున్నాయి. “జీవితమెలా వుంది మిత్రమా?” అని నక్క మొసలి నడిగింది. మొసలి ఇలా అన్నది “ఏం చెప్పమంటావు? జీవితంలో కష్టము, సుఖము ఎవరికైనా తప్పవు. కష్టము వచ్చినపుడు, దుఃఖము వచ్చినప్పుడు నేను కంట తడిపెడితే అందరూ మొసలి కన్నీరు అని నన్ను చూచి నవ్వుతారే తప్ప కష్టంలో వున్నానని ఎవరూ గుర్తించటం లేదు. నా ఏడుపు ప్రపంచానికి నవ్వులాటగ తయారైనది” అని వాపోయినది. అప్పుడు నక్క ఇలా అన్నది.

“నిండు పౌర్ణమి వేళలో ఆనందం పట్టలేక నేను బిగ్గరగా నవ్వితే, పల్లె, పట్టణములలో ప్రజలంతా నక్క ఏడుస్తోందంటారు. నీ ఏడుపు వారికి నవ్వులాటగా వున్నట్టే, నా నవ్వు వారికి ఏడుపుగా అనిపిస్తుంది. నిజానికి ఈ మానవులకి సత్యాన్ని గ్రహించే దృష్టి లేదు.”

అలా సరిపుచ్చుకొని రెండు మృగాలు వారి వారి జీవితాల్లోకి ఆ రోజుకి ఉపక్రమించాయి.

# 10

## మెఱుపు - పిడుగు

**అ**హర్నిశలు కృషిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న ఒక రైతు తన పొలమునకు దగ్గరలో క్రొత్తగా నిర్మాణమవుతున్న ఒక మందిరాన్ని చూశాడు. ఎవరి మందిరము కడుతున్నారు? అని అడిగాడు. మా గురువుగారి మందిరము కడుతున్నాము అని అక్కడివారు తెలిపారు. రైతు తన దారిన ఇంటికి వెళ్ళాడు.

రైతు దినచర్యలో రోజూ సూర్యోదయమును చూడటము, ఆ వెలుగుకు నమస్కరించు కోవటము, పశువులకు గడ్డి వేయటము, పాలు తెచ్చుకోవటము, పొలమునకు వెళ్ళటము, పంటభూమిని తల్లిగా ప్రార్థించటము, పంట పండించటము, సంఘమున ఒక సామాన్య జీవిగ తన వంతు కర్తవ్యమును నిర్వర్తించటము, కుటుంబ పోషణము చేసుకొనటముగ సాగిపోతున్నది. సూర్యాస్తమయములో మరల సూర్యునికి నమస్కారము చేయటము, నిద్రించేటప్పుడు దీపమునకు నమస్కరించటము కూడా జరుగుతూ వుంటుంది.

కొన్నాళ్ళ తర్వాత రైతు పొలమునకు వెళ్ళే దారిలో మందిరము

నిర్మాణము పూర్తి అయినట్లుగ గమనించాడు. మందిరము దగ్గర గుమిగూడిన వారిలో ఎక్కువమంది వారి గురువు గారి మహత్తును గురించి చర్చించుకుంటుంటే అది అతని చెవిన పడింది. వాటిని మననము చేసుకుంటూ నిత్యకృత్యమైన, భూమి సాగుబడికి వెళ్ళి పోయాడు. మనస్సులో గురు మహత్తు గుర్తుకు వస్తూవుంది.

మరికొన్నాళ్ళకు అదే మార్గములో వస్తూవుంటే గురు మందిరము లోనికి ప్రవేశించాలని ఆసక్తి కలిగింది. లోపలికి ప్రవేశించాడు. గర్భాలయములో అత్యంత ఆకర్షణీయముగ ఏర్పరచిన పాలరాతి విగ్రహము నిలువెత్తున గోచరించింది. పరిమళములతో కూడిన పుష్పములతో అలంకరింపబడి యున్నది. విగ్రహాన్ని పాదముల నుండి శిరస్సు వరకు శ్రద్ధాభక్తులతో పరికిస్తూ వచ్చాడు రైతు. విగ్రహము యొక్క ముఖము చూచు క్షణములో గురు ముఖము నుండి చిరునవ్వు ఒక మెఱపువలె ఉద్భవించి రైతు భృకుటిని తాకింది. రైతు పరవశుడై అలా నిలబడిపోయాడు. ఎంత సమయము గడిచిందో రైతుకు తెలియదు. నెమ్మదిగ కన్నులు తెరిచాడు. శరీర మంతా దూదిపింజవలె తేలిపోతోంది. పరిసరమంతా కాంతి వంతముగ గోచరించింది. పరవశము చెందాడు. పరమానందము పొందాడు.

ఇంతలో ఆ మందిరాన్ని పర్యవేక్షిస్తున్న ఒక గురుస్వామి గడ్డాలు మీసాలతో ప్రత్యేక వేషధారణ కలిగి అక్కడికి వచ్చాడు. మెడలో, చేతిలో జపమాల ధరించి యున్నాడు. రైతును పలుకరించాడు. కుశల ప్రశ్నలు అయిన తరువాత రైతు గురుస్వామితో ఇలా అన్నాడు. "నేనొక పామరుడిని. సూర్యుని వెలుగుకి, భూమికి

నాకు తోచిన రీతిలో నమస్కరిస్తూ వుంటాను. కుటుంబానికి, సంఘానికి నావంతు సేవలను అందించుకుంటూ జీవిస్తూ వున్నాను. ఇంతకన్న నాకేమీ తెలియదు. మీరేదైనా నాకు తెలుపవలసింది వుంటే తెలపండి.”

గురుస్వామి నవ్వుతూ “నీ జీవితము చాలా భాగము వృథా అయిపోయినది. మానవుడికి జ్ఞానము ప్రధానము. భార్య, పిల్లలు, సంపద, సంఘము, ఇవి అన్నీ బంధ కారణములు. వీటిని త్యజించి మోక్ష మార్గమువైపు మరలుటయే మానవ జీవితానికి పరమార్థము. నీవు నే నుపదేశించే గురు మంత్రాన్ని అందుకుని సర్వమును త్యజించు. నీకు మోక్షము లభిస్తుంది. నీలాంటి పామరుల నుద్ధరించుటకే నేను, మావారు ఇక్కడికి వచ్చాము.” ఈ విధంగా గురుస్వామి మాట్లాడుతూ వుంటే భవనముపై ఒక పిడుగు పడింది. భవనము కూలినది. గురుస్వామి అతని అనుచరులు మరణించారు. గురుమూర్తి విగ్రహము మాత్రము చెదరక ముఖము నుండి చిరునవ్వు కాంతులు వెదజల్లుతూ వున్నది. రెప్పపాటులో జరిగిన ఈ సంఘటనకు రైతు విస్తుపోయాడు.

“నీకు మెఱపుతో కూడిన వెలుగును, వారి పాలిటి ఆశనిపాతమైన పిడుగును!” అని వినిపించింది. నవ్వుతూ వున్న గురుమూర్తికి నమస్కరించి రైతు సాగిపోయాడు. అప్పటి నుండి ఆ సద్గురువు రైతు హృదయమే మందిరముగ నివసించ సాగాడు.



# 11

# మాయ

**సుం**దరమైన ఉద్యానవనములోకి ఒక బాలుడు ప్రవేశించాడు. అమితానందముతో గంతులు వేస్తూ ఉప్పొంగిపోతున్నాడు. అదే సమయములో మరొక వృద్ధుడు కూడా ఉద్యానవనంలో ప్రవేశించాడు. అతడు కూడా అకారణముగా ఆనందముగా వున్నాడు. తాతను చూసిన కుఱ్ఱవాడు ఇలా అన్నాడు.

"ఆయాను తప్పించుకొని ఎలాగైతేనేం ఈ వనంలోకి రాగలిగాను. ఆయా కళ్లు కప్పిరావటము చాలా కష్టమైనది సుమా! ఈ వనంలో ఆయా బెడద నాకు లేదు. హాయిగా ఆనందంగా వుంది. నీకుకూడా నీ ఆయాను తప్పించుకొని ఈ వనంలోకి వచ్చావా తాతా? అని అమాయకంగా ప్రశ్నించాడు."

తాత నవ్వుతూ "అవును బాబూ! నేను కూడా తప్పించుకొని వచ్చిన వాడినే. నీ ఆయా కన్న నా ఆయాకు తెలివితేటలు ఎక్కువ. లోకానుభవము ఎక్కువ. ఒక పట్టాన తప్పించుకు రావటము కష్టము. కాని ఏదో విధముగా దాన్ని మోసముచేసి తరచూ ఇక్కడికి చేరుకుంటూ వుంటాను."

“ఏమి లాభము తాతా? ఏదో విధముగా ఆయా మళ్లీ నన్ను, నిన్ను పట్టుకెళ్ళిపోతుంది కదా! వనంలో ఎంతో సేపు హాయిగా వుండనివ్వదు. ఆ చుట్టు ప్రక్కల పొదల్లో మన గురించి వెతుక్కుంటూనే వుంటుంది. ఏ క్షణములోనైనా పట్టుకుపోవచ్చు” అన్నాడు పిల్లవాడు.

“ఇక్కడున్నంతసేపు ఆయాని మరచి ఆనందముగా వుందాము. ఆయా పట్టుకుపోతే మళ్ళీ ఎలాగో అలా తప్పించుకొని ఇక్కడకు చేరుకుంటూ వుందాము. అది మనలను పట్టుకుపోవటము, దాన్ని తప్పించుకొని మన మీ ఆనందవనములోకి రావటము జరుగుతూనే వుంటుంది. మళ్ళీ ఇక్కడ కలుస్తూనే వుంటాము” అన్నాడు తాత.

“ఇంతకీ నీ వెవరవు తాతా? అని అడిగాడు పిల్లవాడు” నన్నందరూ దేవదూత అని పిలుస్తూ వుంటారు. కాని నేను నేనే. నీవెవరవు? అని ప్రశ్నించాడు పిల్లవాడిని” నవ్వుతూ నేను కూడా నేనే. నాకు నీలాగా ఇంకో బిరుదు, పేరు కూడా లేదు” అన్నాడు.

తాత సంతోషించి పిల్లవాడిని ఎత్తుకొని ముద్దాడాడు. “మంచి మనుమడివి దొరికావు నాకు. నీ కోసము నేను తరచూ ఈ వనమునకు వస్తూవుంటాను సుమా” అన్నాడు.

“నేను కూడా ఎలాగో అలా ఆయాను తప్పించుకుని వస్తూ వుంటాలే” అన్నాడు. పిల్లవాడు.

అప్పటినుంచి ఆ తాతా మనుమళ్ళు వనములో కలుసు కుంటూనే వున్నారు. ఆయాలు పెట్టే తిప్పలు వారిని క్రమశః ఇబ్బంది పెట్టటము మానేశాయి.

# 12

## లోకం తీరు

**ఒ**క గ్రామములో ఒక తండ్రి, కొడుకు వారికొక గాడిద వున్నాయి. తండ్రి వయస్సు 50 యేళ్ళు. కొడుకు వయస్సు 10 యేళ్ళు. వారిద్దరు ఒక రోజున మరొక గ్రామము వెళ్ళడానికి సంకల్పించారు. కొంత దూరము తండ్రి, కొడుకు, గాడిద నడుచు కుంటూ వెళ్ళారు. తండ్రి అలసట చూసి కొడుకు, తండ్రిని గాడిద నెక్కమన్నాడు. అలాగేనని తండ్రి గాడిదనెక్కి కొడుకు ముందు నడుస్తూ వుంటే, ముందుకు సాగారు. అలా కొంతదూరం నడిచేసరికి దారిన ఎదురొచ్చేవాళ్ళు "బుద్ధి లేదుటయ్యా! చిన్న పిల్లవాడిని నడిపిస్తూ నువ్వు గాడిదమీద వూరేగుతావా? పసివాడిని నడిపిస్తావా?" అని తిట్టిపోశారు.

తిట్లకు సిగ్గుపడి తండ్రి గాడిద మీదనుంచి దిగి, కొడుకును గాడిద నెక్కించాడు. ప్రయాణము ముందుకు సాగుతూ వుంది. ఎండ వేడెక్కసాగింది. తండ్రికి కాళ్ళు పీకుతూ వుండగా నడక నెమ్మదయ్యింది. దారిన ఎదురు వచ్చేవాళ్ళు పిల్లవాడితో "నీకు

బుద్ధిలేదు. నాన్నగారిని కష్టపెడతావా? నవ్వు చిన్న పిల్లవాడివేగా! చకచక నడుస్తూ వెళ్ళవలసిన దూరము ఇంతలోనే అయిపోతుంది. పెద్దవాళ్ళయందు గౌరవము నేర్చుకో అని కోప్పడ్డారు" పిల్లవాడు వెంటనే గాడిద మీదనుంచి దిగిపోయాడు.

తండ్రీ కొడుకులు లోకం మాటలకు స్పందించి దీర్ఘంగా ఆలోచించి ఇద్దరూ గాడిదెక్కారు. గాడిద బరువుగా అడుగులేస్తూ ముందుకు సాగింది. మళ్ళీ దారిన పోయేవాళ్ళు ఈ దృశ్యాన్ని చూచి "ఎంత గాడిదైనా అదికూడ ప్రాణియే కదా! ఇద్దరు గాడిదలు దాని మీదెక్కితే అది ఏమైపోతుంది? మనుష్యులై పుట్టారు. ఏం లాభము. జంతువు కష్టము ఆలోచించవద్దా?" అని తిట్టిపోశారు. తండ్రి, కొడుకు ఉసూరుమంటూ గాడిద మీదనుంచి దిగారు. గాడిద కాస్త ఊపిరి పీల్చుకుంది. లోకము మెచ్చుకోలు కోసము తండ్రీ కొడుకు కలసి గాడిద రెండు జతల కాళ్లు ఎత్తి పట్టుకొని, భుజము మీద వేసుకొని ముందుకుసాగి గ్రామములో ప్రవేశించారు. గ్రామములోని వారంతా ఈ వింతదృశ్యము చూసి పగలబడి నవ్వుతూ, వెక్కిరిస్తూ అవహేళన చేశారు.

తండ్రీ కొడుకులకు ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఏం చేస్తే లోకం మెచ్చుకుంటుందో ఆనాటినుంచి ఈనాటిదాకా వారి కర్థం కాలేదు.



# 13

# ఉన్నతాసనము

**కా**శీలో పండితుడొకడు విశ్వనాథుని సేవిస్తూ తాదాత్మ్య ముతో జీవిస్తూ వుండేవాడు. పాటలీపుత్రములో ఒక విశిష్టమైన పండితు డున్నాడని కాశీలో అందరూ ప్రశంసిస్తూ వుంటే ఆ మహా పండితుడిని ఒకసారి దర్శించాలని కాశీ పండితుడు సంకల్పించాడు. హుటాహుటిని పాటలీపుత్రం చేరి, మహాపండితుని దర్శనార్థం ఆయన ఆశ్రమానికి చేరుకున్నాడు.

మహా పండితుడు ఒక రాజ సింహాసనము లాంటి ఉన్నతాసనముపై ఆసీనుడై వున్నాడు. జనము బారులుగా ఏర్పడి మహా పండితుడి పాదములను స్పర్శించి వారి సమస్యలను తెలిపి పరిష్కారము లందుకొని తిరిగి వెళ్ళిపోతున్నారు. కొంతమంది వెలువైన కానుక లందిస్తుంటే మహా పండితుడు వికసించిన వదన ముతో అందుకుంటున్నాడు. కొందరిని ఆశీర్వదిస్తున్నాడు. మరికొంద రిని వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నాడు. ఇంకొందరిని కోప్పడుతున్నాడు. ఆశ్రమ వాతావరణమంతా హడావుడిగా వుంది.

మధ్యాహ్నము పన్నెండు గంటలకి అంతా సద్దుమణిగారు. కాశీ పండితుడు మహా పండితుడిని దర్శించి తన ప్రవర చెప్పుకొని పాదాల దగ్గర కూర్చున్నాడు. మహా పండితుడు చిరునవ్వుతో "తమరు పండితులు, నాతో సమానముగ ఈ ప్రక్కన వున్న ఉన్నతాసనముపై ఆసీనులు కండి" అని సెలవిచ్చాడు. 'నాకు నేల మీద వుండటమే అలవాటు. ఉన్నతాసనము తమబోటి వారికే చెల్లు, నన్నిలా పాదాలచెంత కూర్చోనివ్వండి' అని సవినయముగా కాశీ పండితుడు సమాధానము చెప్పాడు.

"తామెందుకు ఉన్నతాసనము మీద ఆసీనులు కారో తెలుప గలరా?" అని ప్రశ్నింపగా కాశీ పండితుడిలా అన్నాడు. "నేలమీద వుంటే పడటానికి అవకాశము తక్కువ. ఒకవేళ పడినా అంత పెద్ద దెబ్బలు తగులవు. ఎంత ఎత్తైన ఆసనముమీద కూర్చుంటే, పడటానికి అంత ఎక్కువ అవకాశముంటుంది. దెబ్బలుకూడ ఎముకలు విరిగేటంత తగులవచ్చు. ఏదో భయస్తుడిని, నన్నిలా కూచోనివ్వండి" అన్నాడు.

ఆ మాటలు కిరణాలవలె దూసుకొని మహా పండితుడి హృదయాన్ని తాకాయి. వెంటనే ఆసనాన్ని, అహంకారాన్ని విసర్జించి కాశీ పండితుడి సమీపములో కూర్చున్నాడు. నమస్కరిస్తూ "కాశీ నా కన్ను తెరిపించింది" అని సవినయముగా పండితుడి పాదాలు స్పృశించాడు.

# 14

## విచిత్ర అనుభవము

**“ఒ**కరోజు సాయంత్రము నేను వ్యాహ్యాళికై సముద్రతీరంలోని ఇసుకలో నడుస్తూ వుండగా కంబళి ధరించి చేతికఱ్ఱ పట్టుకొని తలపై తెల్లని ముసుగు పాగాగా ధరించిన ఒక వ్యక్తి ఎదురయ్యాడు. చిరునవ్వుతో పలుకరించాడు. అలా కొంతదూరం కలసి నడిచాము. అతని మాట, నడక ఒక చల్లని, తెలియని హాయి కలిగించింది. మీరు ఎక్కడ వుంటున్నారు? అని ఆయనని ప్రశ్నించాను. దానికి సమాధానముగా ఆయన నవ్వుతూ “నేను ఒక యాత్రికుడిని. అలా తిరుగుతూ వుంటాను. యాత్రలో భాగముగా ఈ తీరము చేరాను. మీరు తటస్థ పడ్డారు. పలుకరించారు. కాబట్టి మీతో నడుస్తూ, మాట్లాడుతూ వున్నాను” అని గంభీరముగా చెప్పాడు. ఈ రాత్రికి మీ బస ఎక్కడ? అని నే నడిగాను. ఆయన చిరునవ్వుతో మౌనము వహించాడు. మళ్ళీ అడిగాను. “ఈ భూమియే నా శయ్యము. ఆకాశమే నా కప్పు. ఈ రెండింటి మధ్య వుంటాను. పగలైనా, రాత్రైనా” అని సమాధానము ఇచ్చాడాయన.

"నేనొక గృహస్థును. భార్య, పిల్లలు వున్నారు. ఇల్లు వున్నది, తగు మాత్రము సౌకర్యము లున్నవి. ఈ రాత్రికి మాతో కలసి భోజనము చేయండి, మా ఇంట్లో విశ్రమించండి, అని కోరాను." ఆయన సమ్మతిస్తున్నట్లుగా తల వూపాడు. ఇంటికి చేరాము. నా భార్యకు, పిల్లలకు పరిచయము చేశాను. ఆ సమయములో ఆయన పేరు తెలుసుకోవాలని ఆయన నడిగాడను. ఆయన నవ్వుతూ ఈ పూట వుండి రేపు వెళ్ళిపోయే వాణ్ణి, పేరు తెలియటము వలన ఏమి ఉపయోగము? పేరు తెలియక పోవటము వలన ఏమి నష్టము? అని ఆయన సూటిగా, మృదువుగా ప్రశ్నించాడు. మే మెవరము ఆయన సమాధానానికి అసంతృప్తి చెందలేదు. సందేహ పడలేదు. ఆయన చెప్పినది నిజమే కదా! అనిపించింది. మే మాయన చుట్టూ చేరాము. ఎన్నెన్నో విషయాలు కథలు కథలుగా ఆయన చెప్తూ వచ్చారు. తన జీవనయాత్రలో జరిగిన సంఘటనలు తెలుపుతూ వచ్చారు. నా పిల్లలు, భార్య బాగా ప్రొద్దు పోయేదాక అంటే తెల్లవారుజామున 3 గంటల వరకు అన్నీ వింటూ వచ్చాము. మా అందరికి నిదుర వచ్చింది. పడుకుందామని ఆయన సలహా ఇచ్చారు. అందరము పడుకున్నాము. ప్రొద్దున్నే లేచేసరికి ఆయన లేరు, ఎటో వెళ్ళిపోయారు. ఇది జరిగి పది సంవత్సరము లవుతోంది. ఆయన భౌతికముగా వెళ్ళిపోయినప్పటికి మా అందరి హృదయాలలో పూర్తిగ నిలచిపోయాడు. ఇప్పటికీ ఇంటి ప్రహరీలోని పూలచెట్ల దగ్గర, పండ్ల చెట్ల దగ్గర తిరుగుతూ వున్నట్లు అప్పుడప్పుడు మా కనిపిస్తూ

వుంటుంది. ఆయన గుర్తు వచ్చినప్పుడల్లా మాకు ఒక తెలియని తృప్తి, తీయని భావన కలుగుతూ వుంటుంది. మళ్ళీ చూస్తామన్న ఆశ కూడ లేదు. ఎందుకంటే ఆయన ఎవరో, ఎక్కడవుంటారో కూడా తెలియదు. "మీకు ఆయన గురించి ఏమైనా తెలుసా?" అని ప్రశ్నించాడొక గృహస్థు ఒక స్వామీజీని. స్వామీజీ నవ్వుతూ, కెరటమల్లే స్పృశించి మిగిలినాడు కదా ! అంతర్యామి అయిన భగవంతుడే ఆ రూపములో వచ్చాడనుకో. ఊరు, పేరు అంతర్యామికి లేవు కదా ! అలానే ఆయన కూడ. ఆయనను నిర్వచించటము అంత సబబు కాదు.



# 15

## పెద్ద - చిన్న

**పి**చ్చుక ఒక గ్రద్దను చూసి “శుభోదయం సోదరా.” అన్నది. గ్రద్దకు కోపము వచ్చినది. “నీకు నాకు చాలా తారతమ్య మున్నది. పెద్ద చిన్న లేకుండా సంబోధిస్తావేమిటి?” అన్నది గ్రద్ద. “నీవూ పక్షివే, నేనూ పక్షినే. మన మిద్దరము ఒకే జాతివాళ్ళము. ఇద్దరము ఎగుర గలము. ఇద్దరము ఆహారము కోసము తిరుగుతాము. రాత్రి వేళ గూడు చేరుతాము. మనిద్దరి దినచర్య ఒకటే. అందుకని మనము సోదరులము” అన్నది పిచ్చుక. గ్రద్ద ఇలా అన్నది. “నేను నీకన్న ఎక్కువ ఎత్తులో ఎక్కువ దూరము తిరుగుతాను. నీకన్న చాలా పెద్దవాడిని. నాతో నువ్వు పోల్చుకోక.” దానికి పిచ్చుక ఇలా సమాధానము చెప్పినది. “ఎక్కువ ఎత్తులో ఎగిరినా, ఎక్కువ దూరము తిరిగినా ఆహారము కోసమే కదా! నిజానికి నిన్ను చూస్తే నాకు జాలి కలుగుతోంది. పొట్ట కోసము నువ్వు చాలా శ్రమపడుతూ వుంటావు. నాకు భగవంతుడి దయవలన అంత శ్రమ లేకుండానే జీవితము గడిచిపోతోంది” అని చెప్పింది పిచ్చుక. “ఆహారము కోసమే ఎగురుతున్నా నేను చూస్తున్నంత ప్రకృతి దృశ్యాలు నీవు

చూడలేవు కదా! కొండలు, వాగులు, నదులు, సముద్రాలు సైతము చూచి వస్తూ వుంటాను. నీకా అదృష్టము లేదు. ఈ చుట్టప్రక్కల నాలుగు వీధులు తిరుగుతూ వుంటావు" అన్నది గ్రద్ద. 'కావాలంటే నేనుకూడా చూడగలను' అన్నది పిచ్చుక. "ఎలా చూస్తావు" అన్నది గ్రద్ద. 'నువ్వేం చూశావో అవి అన్నీ నీతో పాటుగా చూస్తాను. నీతో సమానముగా చూస్తాను. నీకన్న తక్కువ శ్రమతో చూస్తాను' అని చెప్పింది పిచ్చుక. 'ఎట్లా చూస్తావో నేనూ చూస్తాను'. అంటూ ఆకాశంలోకి లేచింది గ్రద్ద. చట్టుక్కున ఎగురుతున్న గ్రద్ద వీపెక్కింది పిచ్చుక.

గ్రద్ద కొండలు, వాగులు, నదులు, సముద్రాలు అన్నీ తిరుగుతూ పిచ్చుక వస్తోందేమోనని చూసుకుంటోంది. పిచ్చుక ఎక్కడా కనపడలేదు. గ్రద్ద తనలో తాను నవ్వుకుంటూ పిచ్చిపిచ్చిగా మాట్లాడింది. "అర్భకపు పిచ్చుక! నా సంగతి దానికిపుడు అర్థమయ్యి వుంటుంది" అని అనుకుంది. పిచ్చుక మాత్రము హాయిగా గ్రద్ద మీద కూచుని అన్నీ చూచి గ్రద్దతో పాటు భూమికి దిగింది.

"ఏం ఇక్కడే వున్నావు? నాతోపాటు సమానముగ చూస్తానన్నావుగా?" అని ప్రశ్నించింది గ్రద్ద. అన్నీ చూశాను అన్నది పిచ్చుక. అంతేకాదు చూచినవన్నీ వివరించింది కూడ. గ్రద్ద ఆశ్చర్యపోయింది. ఇదంతా గమనిస్తున్న తాబేలు గ్రద్దతో ఇట్లా అన్నది. "పిచ్చుక నీకన్న బుద్ధిలో పెద్ద. నీవు శరీర బలములో పెద్ద. నీ సోదరుడిగ దానిని అంగీకరించవలసిందే" అని జరిగిన దంతా చెప్పింది. గ్రద్ద ఒక్క క్షణం నిర్ఘాంతపోయి పిచ్చుక తెలివికి సంతోషపడి తన రెక్కలతో పిచ్చుకను బుజ్జగించింది.

# 16

## అంతర్యామి

గాలియంత్ర మొకటి బావిలోని నీరును వెలుపలికి తెచ్చి, పంట పొలములకు, జీవులకు చాలకాలముగ నీరందించుచున్నది. క్రమశః జీవులు గాలియంత్ర మాధారముగ పొలములను పండించుకొనుచు, పాడిపంటలను అభివృద్ధి గావించుకొనుచున్నారు. అహర్నిశము యంత్రము తిరుగుచునే యుండుటచే నీరెప్పుడును పంటపొలములకు, జంతువులకు, మనుష్యులకు అందుబాటులో ఉంటూ వచ్చినది. పరిసరప్రాంతము అభివృద్ధి చెందుచూ వచ్చినది. జీవులు క్రమశః గాలియంత్రమును గౌరవించుట, పూజించుట, సంవత్సరమున కొకమారు గాలియంత్రము కేంద్రముగ ఉత్సవము జరుపుట మొదలిడినారు. “ఈ నీరు మనకు లభ్యమగుటకు ఈ యంత్రమే కారణము. కావున దానిని పూజింపవలెను. మన కృతజ్ఞతను తెలుపవలెను. ఇది సంస్కారము” అని భావించుచు, యంత్రమును ఒక దేవతగా పూజింపసాగిరి. క్రమశః అచట కొబ్బరికాయలు కొట్టుట, అగరువత్తులు వెలిగించుట, పూజలు, అభిషేకములు, హోమములు చేయుట కూడ ప్రారంభమైనది.

మరికొంత కాలము గడచినది. జీవులలో తెలివి పెరిగినది. వారిట్లు భావించసాగిరి, “నీరు కారణముగ మన జీవనమున సమృద్ధి ఏర్పడినది. గాలియంత్రము కారణముగ నీరు అందింపబడు చున్నది. గాలియంత్రము కనుగొనినవాడు కారణముగ గాలియంత్ర మేర్పడినది కదా! కావున గాలియంత్రము కన్న దానిని కనుగొన్న శాస్త్రజ్ఞుడు పెద్ద దేవునిగా మనము తెలియవలెను. అతని కాంస్య విగ్రహము ప్రతిష్ఠ గావించి, అతనికి కూడ ఇట్టి పూజాది కార్య క్రమములను చేయవలెను. అతడే పుట్టకున్నచో మనకీ యంత్ర ముండెడిది కాదు కదా! కావున అతని పుట్టినరోజు మన కత్యంత పర్వదినము, అతనిని మనము మిక్కుటముగ పూజింప వలెను. అది మన సంస్కారమునకు చిహ్నము.” ఇట్లు భావించి వారందరూ కాంస్య విగ్రహమును రూపొందించి, ప్రతిష్ఠ గావించి, ఆ శాస్త్రజ్ఞుని పుట్టినరోజునాడు అతివైభవముగ విగ్రహము నావిష్కరించి, ఉత్సవము జరుపుటకు నిర్ణయించుకొనిరి.

గాలియంత్రమును, శాస్త్రజ్ఞుని విగ్రహమును శక్తికొలది అలంకరించిరి. ఈ సంరంభమును తిలకించుచున్న గాలిదేవుడు చిరునవ్వుతో ఉత్సవ ప్రారంభ సమయమునకు స్తంభించెను. యంత్ర మాగినది. నీటి పారుదల కూడ ఆగినది. గ్రామస్థులు నిశ్చేష్టు లైనారు. శాస్త్రజ్ఞుని విగ్రహము నుండి ఈ మాటలు వినబడినవి. “గాలియే వీచనిచో యంత్రము విలువ ఏమున్నది? నా విలువ ఏమున్నది? మీ విలువ ఏమున్నది? గాలి స్తంభించిన సమస్తము స్తంభించును, నశించును. అంతర్యామిగా నున్న గాలిని గుర్తించుట మిన్నయైన సంస్కారము.”

# 17

# నమ్మకము

**అ**న్వేషకు డొకడు గౌతమబుద్ధుని గూర్చి విన్నాడు. అతనిని దర్శించి ఉపదేశాన్ని పొంది సత్యాన్వేషణలో ముందుకు సాగాలను కొన్నాడు. ప్రయాణము చేసి, ప్రయాస కోర్చి గౌతమబుద్ధుని కలిశాడు. బుద్ధుడు చిరునవ్వుతో ఆహ్వానించి భోజన వసతుల నేర్పాటు చేశాడు. మరునాడు అన్వేషకుడు ఉదయాన్నే బుద్ధుని దర్శించి ఇలా అన్నాడు. “మిమ్ములను గూర్చి ఎంతో విన్నాను. దైవ స్వరూపులని, మార్గదర్శకులని తెలిసి మీ వద్దకు వచ్చాను. మీపై నమ్మకము స్థిరపడటానికి, ఏదైనా ఒక అద్భుతాన్ని చూపండి.”

ఇలా కోరిన వెంటనే బుద్ధుడు గంభీరుడైనాడు. వచ్చినవానితో వాతావరణమును పరికించి చూడమన్నాడు. అతడు చూస్తూ వుండగానే ఆహ్లాదకరమైన ప్రభాత సమయము మిట్ట మధ్యాహ్నపు వేడిని, వెలుగును సంతరించుకొన్నది. పంచభూతము లన్నియు బుద్ధునితో సహకరిస్తాయని అన్వేషకుడు గమనించాడు. బుద్ధుని

పాదములపై పడి "మీరు మహాత్ములు, మీరు నడిపిన మార్గమున నడచుటకు నాకు విశ్వాస మేర్పడినది. నన్ను నడిపించండి." అని వేడుకొన్నాడు.

బుద్ధుడు మరింత గంభీరుడై "నీవు నమ్మినది నా మహత్మ్యములు గాని నన్ను కాదు. కావున నీవు నన్నుసరించి నడువలేవు. ప్రస్తుతము నీవు నడువవలసిన మార్గము ఇచ్చటి నుండి బైటికి" అని చేతితో బైటికి దారి చూపించాడు.



# 18

## కోతులు !!!

**త**న దగ్గర విద్య నభ్యసించిన శిష్యులకు ఒకనాడు బుద్ధుడీ కథను వివరించాడు. :

"కోతుల వ్యాపారి ఒకడుండేవాడు. అతడు కోతులకు ఆటలు పాటలు నేర్పి, వాటిని ప్రజలకమ్ముకొంటూ పొట్ట పోసుకొనేవాడు. అతడొకసారి విదేశాల్లో కోతులను బాగా అమ్మవచ్చని తన దగ్గర ఉన్న కోతులన్నిటినీ తీసుకొని ఒక ఓడ నెక్కాడు. ఓడలో ప్రయాణం చేస్తున్నవారికి, ఓడ నడిపేవారికి కోతులను చూడగానే ఉత్సాహం కలిగింది. వర్తకుడు కూడా కోతులచేత ఆటలు పాటలు కావించి అందరినీ ఆనందపరచసాగాడు. అందరూ వర్తకుణ్ణి మెచ్చుకుంటూ వచ్చారు. "కోతులచేత ఏ పనైనా చేయించవచ్చు, సరియైన శిక్షణ యివ్వట మొకటే కావాలి" అని చెపుతూ కోతులకు గాలివాటుకు తెరచాప ఎత్తటం క్రొత్తగా నేర్పాడు. అది కారణంగా ఓడ నడిపే వారికి కొంత శ్రమ తగ్గింది. కోతులకు కూడా తెరచాప ఎత్తటం క్రొత్తకాబట్టి ఉత్సాహంగా చేస్తూ వచ్చాయి.

నడి సముద్రంలో ఓడ ప్రయాణం సాగుతూవుంటే ఆకస్మాత్తుగా ఉరుములు, మెఱపులు, గాలితో ఒక తుఫాను వచ్చింది. ఓడను, ఓడలో ఉన్నవారిని సంరక్షించడానికి ఓడ నడిపేవారు త్వరితముగా తెరచాపలను దించేశారు. కాని, క్రొత్తగా తెరచాపను ఎత్తడం నేర్చుకొన్న ఔత్సాహిక కోతులు వెంటనే సామూహికంగా తెరచాపను పైకెత్తేశాయి. పెనుగాలి ధాటికి ఓడ బోల్తా పడింది. అందరూ నడి సముద్రంలో మునిగిపోయారు.”

విద్య అత్యంత ఉపయోగకరమగు విషయము. అది సందర్భోచితముగ వినియోగించవలెను. కోతులకు స్థిరబుద్ధి తక్కువ. స్థిరబుద్ధి లేనివారు కోతులు. వారికి విద్య నేర్పినచో అహంభావులై ఉచితము కానిచోట విద్యా ప్రదర్శనము చేయుచు, తాము నశించుటయే కాక, ఇతరుల నాశనమునకు కూడ కారణ మగుదురు. సంస్కారము లేనివానికి బోధకుడు సంస్కారముల యందు శిక్షణ నీయవలెనే గాని, విలువైన విద్యలు బోధించరాదు. బోధించినచో తాను, తన శిష్యవర్గము, వారి అనుయాయులు, అందరును వర్తకుడు- కోతులు - ప్రయాణీకులవలె మునుగుదురు. విద్యా ప్రదర్శన మెవరు చేసినను, వారు కోతులే! విద్య వినయము నొసగవలెను కాని, ప్రదర్శన కొరకు వినియోగింప రాదు. నిజముగ తెలిసినవారు ‘నాకు తెలుసు’ అనరు. నిజముగ తెలియనివారు ‘నాకు తెలుసు’ అనరు. తెలిసీ, తెలియనివారు మాత్రమే తెలుసు అనుకొందురు. వీరు తెలియనివారికన్న తెలియనివారు- కోతులు!!!

## 19

# ఆవశ్యకత

**బు**ద్ధుని దేవదత్తు డిట్లడిగెను :

"కార్యమునకు నిజమైన మొదలు ఏది?"

"అత్యంత అవసరమే నిజమగు కార్యమునకు మొదలై ఉండవలెను. దీనినే కర్తవ్యమని కూడ అందురు. కర్తవ్యము లేనిచోట ఆలోచనయే అవసరము లేదు. కర్తవ్యము కారణముగా భావనము, సంభాషణము, కర్మము, కార్యము కనబడుచున్నవి. కర్తవ్యము లేనిచోట నేనుగ నుండుటయే. భావన కూడ అనావశ్యకము. నిజమగు కార్యమునకు ఇట్టి అత్యంత ఆవశ్యకత ఉన్నదో లేదో గమనించు చుండుము." అని బుద్ధుడు బదులిడెను.

ఆనాటి నుండి దేవదత్తుడు ఆవశ్యకమేదో, అనావశ్యక మేదో తెలియక ఈనాటివరకు తిరుగాడుచునే యున్నాడు. కర్మములు గైకొని చీకటి దారులలో వెలుగునకై పరిశ్రమించుచూ ఉన్నాడు.

# 20

## అవగాహనము - అంగీకారము

**బు**ద్ధు డొకనాడు ఒక రాజగృహమున కరిగెను. రాజసభ మంత్రి సామంతుల చేతను, మణిమయ ఆసనాదుల చేతను మహా వైభవముగ నున్నది. రాజు బుద్ధుని ఆడంబరముగా ఆహ్వానించి, రాజ సింహాసనముపై కూర్చుండబెట్టెను. తన మంత్రులను, సామంత రాజులను, అధికారులను, మిత్రులను సగర్వముగా పరిచయము గావించెను. వారందరూ తనవారని, తన ననుసరించు వారని, తనకు సహకరించువారని, తన మేలు కోరువారని తెలిపెను. బుద్ధుడు మారు మాటాడలేదు.

సభానంతరము రాజు బుద్ధుని తన ఆంతరంగిక భవనమునకు గొనిపోయెను. బుద్ధునికి సపర్యలు చేయుచు, రాజు బుద్ధునికి తన వారిపై గల అవగాహనను తెలుపమని వేడుకొనెను.

బుద్ధు డిట్లనెను : “రాజా! నీయం దంగీకారము కలవారంద రును నీవారు కారు. నిన్నవగాహన చేసుకొనినవారే నీ వారు.

నిన్నవగాహన చేసుకొని, నీతో సహకరించువారు నీకు నిజమైన అనుయాయులు. అవగాహన లేక నిన్నంగీకరించువారు నీ అనుయాయులు కారు. వారు అవకాశము దొరికినపుడు నిన్ను నిరాకరింతురు. అవకాశమును బట్టి నీ కెదురుకూడ నిలుతురు. నీ పరివారమున నిన్నవగాహన చేసుకొనినవారే నీవారు. వారి వలననే నీ క్షేమము పరిరక్షింపబడుచున్నది. కేవలము నిన్నంగీకరించినవారు నీవారు కాదు సుమా! వారు విధిలేక నిన్నంగీకరించిరి కాని, నిన్ను ప్రేమించిన వారు కారు. ఇరు తెగలయందు నీవు సమాన దృష్టిని ప్రదర్శించుచు, మొదటి వర్గము వారిని అంతరంగమున విశ్వసించి, జీవించుము. ఇది రాజనీతి.



## 21

# సాన్నిధ్యము

**బు**ద్ధిమంతుడొకడు తన గ్రామమునకు విచ్చేసిన సాధు నొకని కనెను. ఆ సాధువు మౌని. మాటాడడు, మరియు అతనికి అక్షర జ్ఞానము లేదు. అనగా వ్రాయుట రాదు. అనగా మాట, రాత లేనివాడు. అతనిని బుద్ధిమంతుడైన పృచ్ఛకుడు ఒక ప్రశ్న వేసెను. దానికి సాధువు తల ఊపెను. ఆ తరువాత పృచ్ఛకుడు రెండు ప్రశ్నలు వేసెను. సాధువు రెండుసార్లు తల ఊపెను. అటుపై పృచ్ఛకుడు ప్రశ్నల వర్షము కురిపింప అన్నిటికిని సాధువు తల ఊపుచుండెను. ఇట్లు వారి మధ్య మూడు సంవత్సరములు గడచినవి. అపుడు పృచ్ఛకుడు "అయినచో మీ అనుభవమున సమస్తమూ సంభవమే అని తెలుపుచున్నారు. అది ఎట్లు?" అని ప్రశ్నించెను.

సాధువు వినమ్రుడై మరింత తల ఊపుచు ముందుకు వంగెను. శిరస్సుతో భూమిని తాకెను. అట్టి కదలికతో అతని

పైవలువ జారిపోయెను. సాధువు వక్షస్థలము గోచరించెను. అది తేజోమయమై, ప్రకాశవంతమై, బంగారు కాంతు లీనుచున్నది! వక్షస్థల మధ్యమున వరద అభయ ముద్రలతో, వజ్రకాంతితో పృచ్ఛకునకు బుద్ధ భగవానుడు గోచరించినాడు!! పృచ్ఛకునకు ఉత్తేజము, ఉత్థానము కలిగినది, అతడి మేధస్సున సమస్తమూ పరిష్కరించబడినది!!!

## 22

# చివరకు మిగేలిది!

**బౌ**ద్ధ సన్యాసి యొకడు వటవృక్షము క్రింద ప్రశాంతముగ ధ్యాన మొనర్చు చుండెను. అతని వదనము కాంతిమంతముగ నున్నది. అదే ప్రదేశమున గొల్లవాడొకడు గొఱ్ఱెలను మేపుచు, ఎండ తీవ్రతకు తట్టుకొనలేక చెట్టునీడకై ఆ వటవృక్షమును చేరెను. అచట కూర్చుండియున్న సన్యాసిని చూచి, మహాత్మా! తామే విషయము గూర్చి భావించుచున్నారు? అని ప్రశ్నించెను. సన్యాసి నవ్వెను. "దైవమును గూర్చి భావించుచున్నాను" అని తెలిపెను. "నే నేమి భావించుచున్నానో తెలియునా మీకు?" అని గొల్లవా డడిగెను. సన్యాసి నవ్వెను. "దైవమును గూర్చియే అయి ఉండును" అని సన్యాసి పలికెను.

"పొరపడిరి. ఈ గొఱ్ఱెల ఉన్ని ఎప్పుడు సంతలో అమ్ముకొని లాభము గణింతునా అని భావించుచున్నాను." అని గొల్లవాడు పలికెను.

"అదియును దైవమును గూర్చిన భావనయే! నీ దైవము కాలక్రమమున నిన్ను సంతకు గొనిపోవును. గొర్రెల నుండి వచ్చిన ఉన్ని సంతలో అమ్మకము జరుగును. నీ దైవము నీకు లాభమును కూర్చును. అట్లు పొందిన లాభమును నీకు బహు కొంచెము తినిపించి, మొత్తమంతయు ఋణ అనుబంధ వశమున నీవారను వారందరకును తినిపించును. ఇంకను మిగిలిన దొంగలెత్తుకొని పోగలరు. నీదనుకొనిన సమస్తమూ దొంగిలింప బడును. అపుడు నీవును నావలె ఇచటికి చేరి, దైవమును మాత్రమే భావించగలవు. ఇపుడు నేను దైవమును భావించు మార్గము సూటియైనది, దైవమును చేర్చునది. నీ భావనా మార్గము కూడ దైవమును చేర్చునదియే. కాని అది డొంక తిరుగుడు మార్గము. ప్రయాణమును త్వరితగతిని పూర్తిచేసుకొని త్వరితముగా ఇచటికి రమ్ము." అని పలికెను.

# 23

## బుద్ధ మార్గము

**జి**జ్ఞాసుడొకడు బుద్ధుని సమీపించి ఇట్లని విన్నవించెను. "మీరు నడచిన మార్గమున నడచి మీ వలెనె దైవమును దర్శించ వలెనని అభిలషించుచున్నాను. నాపై దయవుంచి నన్ను నడిపించండి." బుద్ధుడిలా అన్నాడు. "నీయందు సంసిద్ధత వున్నచో తప్పక నడిపింతును. నా మార్గము భయంకరమైన ఒంటరితనముతో కూడినది. మిట్ట మధ్యాహ్నపు వేసవి మండుటెండలో నడిచినంత తీవ్రమైన వేదన నీ శరీరమున కేర్పడును. అది తట్టుకొని ఒంటరిగ నడువగలవా?"

"కటిక చీకటిలో అర్ధరాత్రి సమయమున, భయంకరమైన అరణ్యమునందు, కౄర మృగముల మార్గములో భయపడకుండ సాగిపోగలవా?"

"అట్లు పగలు రాత్రి ఒంటరిగ సాగినట్లైనచో నీకు ఉషోదయము కలుగును. ఉషోదయ కాంతులలో కిరణరూపమున

నా మార్గ మగుపించ గలదు. దాని ననుసరించుము. అప్పుడు నీ, నా నిజస్వరూపము తెలియగలదు.”

జిజ్ఞాసు విట్లు ప్రార్థించెను. “మీరు తెలిపిన మార్గమున ఒంటరిగ నడుచుటకు నేను సిద్ధము. నాకు మీ ఆశీర్వచనము, అనుగ్రహము, సాన్నిధ్యము మార్గమున ఎడతెరపి లేక కలిగింపుడు. ఆ బలముతో ముందుకు సాగగలను.”

బుద్ధు డాశీర్వదించగ, జిజ్ఞాసు తక్షణమే మార్గమున ప్రవేశించెను. అతడు వేసవి మండుటెండలో నడచెను. కటిక చీకటిలో అరణ్యమున ప్రయాణము సాగించెను. మార్గమందలి వేదనను, భయమును తట్టుకొనెను. తెల్లవారినది, ఉషోదయ అరుణకాంతులు అతనిపై ప్రసరించినవి. జిజ్ఞాసునకు ఆనందోత్సాహ ములు కలిగినవి. చిందులు వేసినాడు. ఇంతలో అమితమైన కోతుల గుంపులు అతనిని చుట్టుముట్టినవి. అతడాశ్చర్యపడి బుద్ధుని తలచి నాడు. అంతర్ముఖముగ బుద్ధుడు దర్శనమిచ్చి చిరునవ్వుతో ఇట్లనెను. “కోతులు చుట్టును చేరుట సహజము. ఇటుపై మార్గమును నీవుగ నడువ వలెను. నీకు శుభమగుగాక ! అట్లు తెలిపి బుద్ధుడు అదృశ్యమయ్యెను.

(ఈ కథలోని అంతర్యమును పాఠకుడు శ్రద్ధాభక్తులతో ఆవిష్కరించుకొనుటకు ప్రయత్నించుకొనవలెను.)

# 24

# తీర్పు

**అ**క్బర్ చక్రవర్తి న్యాయకోవిదుడు, ధర్మవేత్త, సహనశీలి. గురుపరంపరాగతమైన జ్ఞానం తెలిసినవాడు.

ఒక రోజున రాజసభా మందిరంలోకి ప్రవేశించటానికి ముందుగా తనదైన ఏకాంత గృహంలో మౌనంగా కూర్చున్నాడు. న్యాయవేత్త భగవంతుడే, ధర్మకోవిదుడు దైవమే, తాను కేవలం వాహికయే యని చక్రవర్తి విశ్వాసం. ఆనాడు సభలో తాను ధర్మపర మైన తీర్పులు చెప్పవలసియున్నది. తన నుండి అధర్మ నిర్ణయం రాకూడదని చక్రవర్తి తపన. అందుకే ఏకాంత గృహంలో దైవప్రార్థన.

అక్బరు చక్రవర్తి తానున్న గదిని నలుమూలలా పరికించి చూశాడు. అది విశాలమైన గది. పెద్దపెద్ద కిటికీలు. వాటికి రంగులతోను, రమ్యమైన దృశ్యములతోను ఏర్పాటు చేయబడ్డ గాజుతలుపు లున్నాయి. కిటికీ తలుపులన్నీ దాదాపు దగ్గరగా మూసి వున్నాయి. దక్షిణం కిటికీ తలుపు తెరచివున్నది. ఎత్తైన, విశాలమైన ఆ గదిలో ఒక రమ్యమైన సీతాకోకచిలుక అక్బరు

దృష్టిని ఆకర్షించింది. ఆ చిలుక కిటికీ గుండా బయటకు పోవటానికి సర్వ ప్రయత్నాలు చేస్తోంది. కిటికీ తలుపులనుండి అవతల ప్రపంచం కనబడుతుండటం చేత బయటకు వెళ్ళే ప్రయత్నం చేస్తూవుంది. కానీ గాజుతలుపులు అడ్డం వస్తున్నాయి. అన్ని దిక్కులకు ఆరాటంతో ఎగురసాగింది. కాని ఫలితం శూన్యం.

సీతాకోక చిలుక పరిస్థితి గమనించిన చక్రవర్తి తన ఆసనం మీదనుండి మెల్లగా లేచాడు. చిఱునవ్వుతో తన మృదువైన హస్తాల లోకి చిలుకను అందుకొన్నాడు. తన హృదయానికి దీటైన మృదుత్వం తన హస్తాలలో నున్నప్పటికీ సీతాకోకచిలుక గిజగిజ లాడింది. చిఱునవ్వుతో చక్రవర్తి చిలుకను దక్షిణ దిక్కునగల కిటికీగుండా బయటకు వదిలాడు. అమితానందంతో సీతాకోక చిలుక అనంత మైన ప్రపంచంలోనికి ఎగిరిపోయింది. చక్రవర్తి హృదయం ఆనందంతో పొంగింది. హృదయాకాశం నుండి "దాక్షిణ్యం" అనే శబ్దం వినిపించింది. శబ్దం వింటూ చక్రవర్తి కనులు మూసు కొన్నాడు. అతని కనులు చెమర్చినాయి. మెల్లగా అడుగులు వేసుకుంటూ రాజసభకు చేరాడు.

సభాస్థలి కేతెంచిన చక్రవర్తి సభలోనివారి నందరినీ పలకరింపుగ చూశాడు. అందరూ లేచి చక్రవర్తికి నమస్కరించారు. వందిమాగధులు స్తోత్రపఠనం చేశారు. సభలోని వారందరూ జయజయ ధ్వనులు గావించారు. సభాకార్యక్రమం ప్రారంభమైంది.

న్యాయపాలకుడు చక్రవర్తిని ఉద్దేశించి "మహారాజా! సభలో ఈనాడు మీ తీర్పునకై ఒకే విచారణ యున్నది. వాద ప్రతివాదములు విని తాము తీర్పు నీయవలెను" అని ప్రార్థించాడు.

అక్బరు చక్రవర్తి అంగీకారంగా తలవూపారు. సభలోకి ఒక సామాన్యుడు ప్రవేశపెట్టబడినాడు. అతడు అనేక విధములైన చట్టవిరుద్ధములగు కార్యము లొనర్చినాడని వాది రాజ్యాంగ తరఫున పేర్కొని వివరించినాడు. ఆ పౌరుడు సామాన్యుడు గనుక అతని తరఫున వాదించటానికి ప్రతివాది ఎవరనూ లేరు. చక్రవర్తి అతని కన్నులలోనికి సూటిగా చూసి “పై ఆరోపణ విషయములో నీవేమైనా వివరించ దలుచుకున్నావా? నీ సమాధానమేమి? అని అడిగెను. పౌరుడు చక్రవర్తి ప్రశ్నకు గజగజ వణకిపోయెను. చక్రవర్తి తన గంభీరవదనమును మార్పు చేసుకొని చిఱునవ్వుతో “నీకెట్టి భయము లేదు. నీవధర్మము ఆచరించనిచో నీకేవిధమగు శిక్ష పడదు. నిర్భయుడవై నీకు తెలిసినది పలుకుము” అని అనెను. పౌరుడు కొంత స్వస్థతను చేకూర్చుకొని ఇట్లనెను: “ప్రభూ! నాకు తెలిసి నే నేపాపము చేయలేదు. ఏ ధర్మమును ఉల్లంఘించలేదు. మానవతా దృక్పథంతోనే జీవించుచున్నాను. నాకు ధర్మమే తెలుసునుగాని, చట్టములు తెలియవు. చట్టముల నుల్లంఘించితినని కూడ నాకు తెలియదు. నేనొక సామాన్యుడను. రాజ్యాంగ చట్టములు మాకు బోధపడవు. ధర్మము విషయమున ఎట్టి పొరపాటు చేయలేదని త్రికరణశుద్ధిగా చెప్పగలను. చట్ట విషయములు మాత్రం నాకు తెలియవు. మీరు ధర్మ స్వరూపులు, మాకు ప్రభువులు. మీ నిర్ణయ మును నేను శిరసా వహిస్తాను.” సామాన్యుడు ఈ విధంగా పలికి అక్బరు చక్రవర్తికి నమస్కరించాడు.

# 25

## నిర్వాణ సోపానము

**త్యా**గము వలన అమృతత్వము సిద్ధించునని గౌతమబుద్ధుడు అనర్గళముగ ప్రవచించెను. స్ఫూర్తి చెందిన శ్రోత ఒకడు త్యాగమను గుణమును దీక్షగ స్వీకరించెను. క్రమశః తనకున్నది త్యాగము చేయుట మొదలిడెను. అడిగినవారికి లేదనకుండా ఇచ్చుచుండెను. కాలక్రమమున అతడు యశమును బడసెను.

యశమును కొంతకాలము అనుభవించిన పిదప త్యాగికి యశముపై మోహము విడెను. త్యాగము కొనసాగెను. నిర్మలు డయ్యెను. సామాన్యు డయ్యెను. సంఘము గుర్తింపునకు దూర మయ్యెను.

కాలక్రమమున బుద్ధుని మరల కలిసెను. తాను ప్రచోదన మందిన తీరు తెలిపి, తా నొనర్చిన త్యాగమును గూడ తెలిపెను. బుద్ధుడు ఆశీఃపూర్వకముగ స్పర్శించి, **"మనస్సున గూడ త్యాగ భావము ప్రవేశ పెట్టుము. భావములపై పట్టు, వస్తువులపై పట్టు వంటిదే. నీయందుగల దృక్పథములన్ని త్యాగము చేయుము. నీకు శుభమగును."** అని పలికెను.

త్యాగి తన దృక్పథములను పరిశీలించసాగెను. తనకెన్నియో దృక్పథము లున్నవని తెలుసుకొని ఆశ్చర్యపడెను. తన దృక్పథముతో సమస్తమును అవగాహన చేసుకొనుట వలన తన అవగాహనే తనకు దృశ్యముగ నున్నదని తెలిసెను. క్రమశః తన దృక్పథమును విస ర్జించుట మొదలిడెను. ధన, కనక, వస్తు త్యాగము చాలా సులభ మని, దృక్పథ త్యాగము అంతకన్నా వందరెట్లు కష్టమని, కష్టతరమని తెలిపెను. త్యాగి, తన దీక్షను పెంచెను. మంచి – చెడులను నిర్ణ యించుట మానెను. జీవులు వారి వారి స్వభావము లకు వశులై ప్రవర్తించు చున్నారనియు, అవశులనియు తెలిసెను.

దృక్పథ త్యాగము నుండియే ఈ అవశత్వము మరియు అలసత్వము నశించునని తెలిసి, క్రమశః తనయందలి దృక్పథము లన్నింటినీ ఒకదాని తరువాత ఒకటి త్యజించెను. ఇట్లుండవలెనని, ఇట్లుండ రాదని తన మనస్సున నిర్ణయించుట మాని, అప్రయత్న ముగ ద్వంద్వములను దాటి ధర్మమున నిలచెను. అవశులైన జీవుల యందు కరుణ, దయ కలిగెను. తన నుండి అపారముగ కరుణ, దయ జీవులయందు కలుగుట తన కాశ్చర్యమైనది. అది ప్రేమగా మార్పు చెందినది. తన స్వభావమున దూషణ, భూషణ ములు తనకు తెలియకయే అదృశ్యమయ్యెను. స్వభావమను చెరనుండి మేల్కాంచిన త్యాగి, స్వతంత్రు డయ్యెను. అందరికీ ప్రీతిపాత్రు డయ్యెను. అన్ని స్వభావముల వారికీ ఇష్టుడయ్యెను. ఐనప్పటికీ సామాన్యునివలె, సామాన్యులతో సామాన్యముగ జీవించు చుండెను. అతని మనస్సున అమృతత్వ భావము అవిష్కరింపబడినది.

'త్యాగేనైకేన అమృతత్త్వ మానశుః' అను బుద్ధుని సూక్తి మరల మనసున మెదిలెను. అమృతత్త్వ మెట్లు కలుగును? అను భావన అతనిని వేధించు చుండెను.

కాలగతిని మరల బుద్ధుని దర్శన మయ్యెను. నమస్కరించి, తనయందు తా ననుభవించిన మార్పులు తెలియజేసి తరువాతి దీక్ష నొసగమని ప్రార్థించెను. "**ద్రవ్య యజ్ఞ మొనర్చితివి. మానసిక యజ్ఞము కూడా ఒనర్చితివి. ఇప్పుడు నీకు నీవు మాత్రము మిగిలియున్నావు. దానిని 'నేను' యందు త్యాగము చేయుము. అమృతత్త్వము బడయగలవు.**" అని బుద్ధుడు పలికెను.

త్యాగి తన భావమును దైవీ భావమున సమర్పించుట సాధనగా నేర్పరచుకొనెను. నిర్మలు డగుటచే దైవీభావము నిలచెను. తానుండక దైవముండు ఘడియలు కొన్ని జరిగినవి. అప్పుడప్పుడు దైవముండును. దైవ ముండునపుడు 'తా' నుండడు! 'తా' నున్నపుడు దైవముండడు! దైవ రుచి కాలక్రమమున బాగుగా నేర్పడగా అప్పుడప్పుడు తా నుండుట, ఎప్పుడూ దైవముండుటగా భాసించెను. దైవమే తానుగ నున్నాడని, తా నమృతుడనని తెలుసుకొనెను. ఆ తెలియుట మెఱపువలె, సహస్ర సూర్యుల కాంతివలె భాసించెను. హృదయము పొంగెను. దివ్యత్వమును, అమృతత్త్వమును పొందెను. బుద్ధుడు ప్రసన్నవదనుడై, దేదీప్యకాంతితో దర్శన మిచ్చి "**నీవు లేక నే నుండుటయే అమృతత్త్వము. నీవుండుట అహంకార తత్త్వము. నీవు నే నైతివి. ఇదియే నిర్వాణము.**" అని పలికెను.

చక్రవర్తికి హృదయమునుండి మరల వాణి "దాక్షిణ్యం" అని ఉద్బోధించింది. చక్రవర్తి మౌనం వహించాడు. ధర్మమా? చట్టమా? ఏది విలువైనది? ధర్మమే అని తనకు తెలుసును. అట్టైన చట్టముతో పని ఏమి? సంఘశ్రేయస్సుకు ఉపకరణములే కదా చట్టములు! వానిని నిర్వర్తింపకున్నచో రాజ్యాంగ మేది? ప్రభుత్వ మేది, పాలన ఏది? అంత మాత్రం చట్టమే అవలంబించినచో ఒకానొకప్పుడు అది ధర్మవిరుద్ధం కావచ్చును. ఈ విచారణమున తన తీర్పు ధర్మం వైపునకే మ్రొగ్గుచున్నది. కాని చక్రవర్తిగా తానే చట్టమును నిరాకరించిన ప్రజ లాదరింపరు. చక్రవర్తి చిరుదర హాసంతో యిట్లనెను : "ఈ పౌరుడి విషయమున తీర్పు రాజపురోహి తులకు, ధర్మాధర్మ నిర్ణేతలగు మంత్రులకు అప్పజెప్పుచున్నాను. రేపు మరల సభలో వారు తీర్పు చెప్పెదరుగాక! ఈ విషయమున వారి తీర్పే నా తీర్పు!"

మరునాడు సభ ప్రారంభం కాగా రాజపురోహితులు యిట్లనిరి: "మహారాజా! ఈ పౌరుడి ప్రవర్తనం పరిపూర్ణంగా పరిశీలించితిమి. ఇతను నిరపరాధి యని మా అభిప్రాయం. ఈతనిని క్షమించి వదిలి పెట్టుడు." చక్రవర్తి ఆనందంగా పౌరునికి విముక్తి నొసగెను. పౌరుడు మహదానందంతో చక్రవర్తికి నమస్కరించి వెడలిపోయెను.

అక్బరు చక్రవర్తి కనులు మూసుకొని అమితానందంతో ఆకాశంలో ఎగురుతున్న రంగురంగుల సీతాకోక చిలుకలను చూసెను. హృదయాకాశమున "ధన్యోస్మి! ధన్యోస్మి!!" అని వినిపించెను.

# 26

## సహజీవనం

"**సో**మయాజిగారు పోయిన ఝాములోనే ఆయన భార్య కూడా కాలం చేసిందిట. అదృష్టవంతురాలు, భర్త ననుసరించింది. నేను కూడా అట్లాగే మీతో పాటు పోవాలి. మీరు లేని నాకు జీవితం ఎందుకు?" అన్నది భార్య. అలాగే అన్నాడు భర్త.

"మీరు జపం, తపం, ధ్యానం, మానవసేవ- ఇత్యాది కార్యక్రమాల్లో మునిగి చాలా పుణ్యం సంపాదించుకుంటున్నారు. నాకు ఇల్లు, పిల్లలు, పనివాళ్ళు, పాలవాళ్ళు మిగిలారు. మీతో పాటు సత్కార్యాలు చేసే అవకాశం నాకు లేదు. ఇది నా ఖర్మ." అన్నది భార్య. "నే చేసే దాంట్లో సగం నీకు వస్తుందిట, నీవు భాగస్వామివి కదా! సగం పుణ్యం నీకెప్పుడూ వుంటుంది. అయినా పుణ్య పాపాల విషయం ఎందుకు మనకి? నీవు చేసేదీ కర్తవ్యమే. నేను చేసేదీ కర్తవ్యమే. ఫలాసక్తి లేకుండా నీవు, నేను అన్నిటియందు పాలుపంచుకుందాం. నాతో పాటే నీవు" అన్నాడు భర్త.

భర్త ప్రశాంతమైన మనసుతో భార్య బాధ్యతల్లో పాలుపంచుకుంటూనే వున్నాడు. భార్య భర్త కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని వున్నప్పటికీ చిన్నచిన్న విషయాలు ఆమెకు అడ్డంగా అనిపిస్తూ వున్నాయి. మీతోపాటే నేను అని అంటూ వుంటుంది కాని భర్త అడిగిన ప్రతిసారి "నాకెక్కడ కుదురుతుంది? మీరు వెళ్ళిరండి" అని అంటుంది. "మీతోపాటే అంటుంటావుగా, అందుకు అడగటం నా విధి" అంటాడు భర్త. "రావాలనే వుంటుంది. కాని, ఎక్కడ కుదురుతుంది? మీకేం మీరు మగమహారాజులు. నాకట్లా కుదరదు" అంటుంది భార్య.

అదొక అర్ధరాత్రి సమయం. భర్త హృదయంలో దేవుని గంట మ్రోగింది. భార్యను లేపాడు. "నేను వెళుతున్నా, నీవు వస్తావా?" అని ప్రశ్నించాడు. "ఇప్పుడా? ఇంత అర్ధాంతరంగానా? నావల్ల కాదు" అన్నది భార్య. కొంత కాలం గడించింది. భర్త గుండెల్లో మళ్ళా గంట మ్రోగింది. "నాకు పిలుపు వస్తోంది! నీవు వస్తావా?" అన్నాడు భర్త. ఇంకా కొంతకాలం వుండాలి. పిల్లలు వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు బ్రతకాలి. వారికి పెళ్ళిళ్ళు కావాలి" అన్నది భార్య.

కొన్నేళ్ళు గడిచాయి. పిల్లల పెళ్ళిళ్ళు అయ్యాయి. వాళ్ళు స్వతంత్రంగా జీవిస్తున్నారు. మరలా భర్త గుండెల్లో గంట మ్రోగింది. భార్యకు యిచ్చిన మాట ప్రకారం భార్యను అడిగాడు. "మనవణ్ణి చూడరూ? వంశోద్ధారకుడిని చూసి పోదాం, అమ్మాయికి కూడా రెండు పురుళ్ళు పోసి పోదాం" అన్నది భార్య. భర్త నవ్వుకున్నాడు. భార్య పడుకుంది.

షష్ఠిపూర్తి అయింది. పూజలు, క్రతువులు, సన్మానాలు, సభలు అయినాయి. పిల్లాజెల్ల అందరూ వచ్చి వెళ్ళారు. ఆ రాత్రి మరలా భర్తకు గంట వినిపించింది. భార్యను లేపాడు. "గంట కొట్టింది! నే వెళ్ళాలి. నీవు వస్తావా?" అని అడిగాడు. "ఉత్తరాయణం రానిద్దురూ" అన్నది భార్య. భర్త వినలేదు. శరీరం విసర్జించాడు. ప్రొద్దున్నే లేచిన భార్య భర్త శరీరాన్ని చూసి లేడని తెలిసి ఆ ఘాతానికి మూర్ఛపోయింది. మూర్ఛలో కలవచ్చింది. కలలో భర్త కనిపించాడు. "నాతోపాటే నంటావు కాని, రావు. నీపాట్లు నీవు వదల్లేవు. ఇంతకీ నీకు గంట మ్రోగితేనే నీవు వస్తావు కాని, నాకు గంట మ్రోగితే నీవెట్లా రాగలవు? నీకు గంట మ్రోగినప్పుడే నీవు రా!" అని చెప్పి అదృశ్యమైనాడు. భార్యకు తెలివి వచ్చింది. పిల్లలు భర్త దేహం చుట్టూ చేరారు. దహన సంస్కారానికి దేహాన్ని పరిశుద్ధి చేసి తీసుకెళ్ళారు. భార్యకు పట్టరాని దుఃఖం వచ్చింది. భర్త పటం దగ్గర కూర్చొని కళ్ళు మూసుకుంది. "ఎప్పటి ధోరణే అనుకున్నాను గాని, నిజంగా వెళ్ళిపోతారనుకోలేదు. మీతోపాటే నేను, నాకిక్కడ యిప్పుడేమీ అక్కరలేదు" అని హృదయంలో మొరపెట్టుకుంది. గుండెల్లో గంట మ్రోగింది. భార్య శరీరం వదిలి భర్త ప్రక్కకు చేరింది. "మీతోపాటే నేను" అన్నది. "ఔను! నాతో పాటే నీవు" అన్నాడు భర్త.

"సావిత్రీ – సత్యవంతులు" అన్నాడు ప్రక్కనే వున్న ధర్మదేవత. "అదే కథగాని కొంత తికమకగా వున్నది" అన్నాడు చిత్రగుప్తుడు. "కలియుగం కదా!" అన్నాడు ధర్మదేవత.

# 27

## బుద్ధుని క్రమశిక్షణము

ఒకరోజు సాయం సమయంలో శిష్యులు బుద్ధుని చుట్టూ చేరి "స్వామీ! తమ ఉత్తమోత్తమమైన స్థితికి ప్రధాన కారణమేమిటి?" అని అడిగారు. శిక్షణ, క్రమమైన శిక్షణ, క్రమశిక్షణ. ఇదియే నా అభివృద్ధికి పునాదిరాయి. అధిభౌతికము, అధిదైవికము, ఆధ్యాత్మికము అను స్థితులకు క్రమశిక్షణమే ప్రాణం. అది ఎన్నటికినీ విడువదగినది కాదు. దేహమునకు, ఇంద్రియములకు, మనస్సునకు హింస కలుగ జేయక శిక్షణ నివ్వాలి. అహింస అను విషయము తనయందు కూడా పాటింపబడవలెను. ఇది తెలియకముందు నన్ను నేను హింసించుకొంటిని.

హింసించక శిక్షణ నీయవలెనే కాని, యించుకైననూ హింస పనికిరాదు. హింసించుట శిక్షణ కాదు. శిక్షణమున హింసలేదు. శిక్షణమున స్ఫూర్తి నిచ్చుట, ఉత్సాహపరచుట, ఆచరించి చూపుట యుండును. అలసత్వమునకు, నిర్లక్ష్యమునకు, విముఖతకు శిక్షణము తావియ్యదు. సత్యము, ధర్మములకు సంబంధించిన

విషయములలో నిశితత్వముండును. క్రమశిక్షణ నుండియే శిష్యత్వ మునకు అర్హత కలిగియుండును. అంగీకరింపబడిన శిష్యు నకు ధీరత్వము, తృప్తి, సంసిద్ధత, దాక్షిణ్యము అను నాలుగు సద్గుణములు ఉపాసనా గుణములుగా అందింపబడును. శ్రమ కోర్చుట, హఠాత్పరిణామములకు కలత చెందకుండుట అటుపైన నేర్పు గుణములు. వాజ్నియమము లొసగి ఒక విషయమును ఒక వాక్యములో సమగ్రముగా తెలుపుమనుట, అదే విషయమును వంద వాక్యములుగా తెలుపుమనుట క్రీడాప్రాయముగ నేర్పబడును. అతి చిన్న విషయములను శ్రద్ధతో పరిశీలించుట ఆపై శిక్షణ. తానొక పదమును మనస్సున ఉచ్చరించి అదియేమో ఇతరులను చెప్ప మనుట... ఇట్లు చైతన్యము గంభీర మగుచున్నకొలది శిక్షణ యొక్క లోతులు పెరుగుచుండును.

శిక్షణమున శిష్యుడు సింహమువలె గంభీరుడై, చేతన వలన కాంతివంతుడై యున్న సమయమున మాయ తెర తొలగింపబడును. దైవము దర్శన మొసగును. అది కారణముగా బాధ్యత వేయివంతులు పెరుగును.

## 28

# కులపతిత్వం

శ్రీరాముడు రాజ్యపాలన చేస్తున్న రోజులవి. రామరాజ్య మంటే అంతా సుభిక్షమే. సామాన్య ప్రజలు సైతం ధర్మసూత్రము లెరిగి ఆచరించిన కాలమది. అదే రాజ్యంలో ఒకానొక సన్యాసి సత్యాన్వేషకుడై జీవిస్తూ వుండేవాడు. అతనిది సాధుస్వభావం. దేహపోషణార్థం రోజూ ఒక మూడు గడపలవద్ద భిక్ష నర్థించేవాడు. లభించిన దానితో ఒకపూట భోజనం మాత్రం చేస్తూ తన తపస్సు కొనసాగించే వాడు. ఊరికి దూరంగా జీవించేవాడు. వేపచెట్టునీడన ఒక చిన్న ఆచ్ఛాదనం నిర్మించుకొని, అందులో బస చేసేవాడు.

ఒకానొక రోజున ఎక్కడనుంచి వచ్చిందో తెలియదు కాని, ఒక కుక్కపిల్ల అతని కుటీరం ముందు తచ్చాడుతూ ఆకలికి అరస్తూ వుంది. భిక్షాటనం ముగించి తిరిగి వచ్చిన సాధువు దాని ఆకలిని గమనించి తను పొందిన భిక్షాటనలోని ఆహారం దానికి పెట్ట సాగాడు. అప్పటి నుండి కుక్క అక్కడే జీవించసాగింది. ప్రతిరోజూ సాధువు తను భిక్షాటనలో పొందిన ఆహారం దానికి పెట్టి తాను తినసాగాడు. ఇట్లు రోజులు గడుస్తున్నాయి.

ఒకరోజు సాధువు వూరిలోకి వెళ్ళి భిక్షాటన చేయగా అసలేమీ భిక్ష లభించ లేదు. అది వేసవి కాలం. సాధువు మండుటెండలో వట్టి చేతులతో తన కుటీరానికి తిరిగివచ్చాడు. ఎండ కారణంగాను, భిక్ష దొరకక పోవటంతోను శరీరం, మనస్సు నిస్పృహ చెంది యున్నాయి. కుటీరానికి రాగానే కుక్క అడ్డుగా పడుకొని వుంది. శ్రమచేత ఓర్పు కోల్పోయిన సాధువు కుక్కను గద్దించాడు. అదిలేచి ప్రక్కకు జరిగింది. ఆహారానికి అలవాటు పడ్డ కుక్క ఆకలితో అరవసాగింది. సాధువుకు తపస్సు భంగమైనది. ఒక ప్రక్క తాను శ్రమపడి యున్నాడు. ఆహారం లేదు. మనసు చికాకుగా వుంది. దైవీ భావంతో మనసును జతపరచి చికాకు నుండి తనను తాను ఉద్ధరించుకుందా మనుకొంటే కుక్క అరుస్తోంది. ఆకలికే అరుస్తోంది. తన తపస్సుకు అంతరాయం కలిగిస్తోంది. పైగా తన దగ్గరకే వచ్చి అరుస్తోంది. సాధువుకు ఒళ్ళుమండింది. కోపంతో కుక్కడొక్కలో ఒక తన్ను తన్నాడు. కుక్క దూరానికి ఎగిరిపడింది. నొప్పితో మూలుగుతూ వెళ్ళిపోయింది.

* * *

శ్రీరాముడు తన సభలో ఆసీనుడై యున్నాడు. పురోహిత మంత్రి పరివేష్ఠితుడై యున్నాడు. ధర్మాధర్మాలను విచారించి నేరస్థులను తగినరీతిలో శిక్షిస్తూ వున్నాడు. ఆ రోజు సభ పూర్తి అవుతున్న సందర్భములో బయట గంట మ్రోగింది. అది ధర్మాన్ని కోరేవారు కొట్టవలసిన గంట. సేవకుడు బయటకు వెళ్ళి గంట ఎవరు మ్రోగించారో అని పరిశీలించాడు. అక్కడ ఒక కుక్క వున్నది! రాజ సేవకుడు దానిని అదిలించి పంపివేశాడు. మరల

ముహూర్తకాలంలో గంట మ్రోగింది. మరలా సేవకుడు అదిలించి పంపేశాడు. మూడవ మారు గంట మ్రోగింది.

శ్రీరాముడు సేవకుని ప్రశ్నించాడు. ఎవరు గంట మ్రోగిస్తున్నారు? అని అడిగాడు. సేవకుడు "మహారాజా! ఒక కుక్క అదేపనిగా గంట మ్రోగిస్తోంది. అదిలించినా పోవటం లేదు." శ్రీరాముడు లక్ష్మణుని వెళ్ళి కుక్కకు ఏమి కావాలో కనుగొనమని కోరినాడు. లక్ష్మణుడు బయటకు వెళ్ళి తిరిగి వచ్చి "ప్రభూ! ఆ కుక్క న్యాయం కోరుతున్నది. మనుజ భాషలో మాట్లాడుచున్నది కూడా! సభాసదు లందరూ ఆశ్చర్యపడినారు. శ్రీరాముడు లక్ష్మణు నుద్దేశించి 'కుక్కను ఆప్యాయతతో లోనికి కొనిరమ్ము. ఆ జీవికి కలిగిన ఆపద ఏమిటో పరిశీలించి న్యాయం చేకూర్చుదాం" అన్నాడు.

కుక్క లోపలికి కొనిరాబడినది. శ్రీరాముడు కుక్కకేం కావాలో ప్రశ్నించాడు. కుక్క "ప్రభూ! మీరు ధర్మమూర్తులు. మీరు నాకు న్యాయం చేకూర్చవలెను. మీ రాజ్యంలో సుఖశాంతులతో జీవిస్తున్న నాకు అన్యాయం జరిగింది. ఒక సాధువు ఆకలితో నున్న నన్ను డొక్కలో తన్నాడు. న్యాయ విచారణ జరిపి అతనిని తగురీతిన శిక్షించవలెను" అని పలికింది. శ్రీరామునితో సహా సభికులందరూ ఆశ్చర్య పడ్డారు. రాముడు సాధువును గొనిరావలసినదిగా ఆజ్ఞా పించాడు. సాధువు వచ్చువరకు కుక్కకు అన్నపానీయాల నేర్పరచి, రక్షణ కల్పించాడు.

వారం రోజులకు సాధువు సభలోకి ప్రవేశ పెట్టబడ్డాడు. కుక్కను కూడా సభకు గొనివచ్చారు. కుక్కను చూసి సాధువు ఒకే

క్షణంలో ఆశ్చర్యపడటం, భయపడటం కూడా జరిగింది. శ్రీరాముడు సాధువు నుద్దేశించి యిట్లు ప్రశ్నించాడు, “ ఓ సాధుపుంగవా! ఈ కుక్క నీపై నేరారోపణ చేసింది. కుక్కకు నీవే మపకారం చేశావు?”

సాధువు శ్రీరామునికి నమస్కరించి యిట్లనెను. “ప్రభూ! నేను సన్యాస దీక్షను స్వీకరించి సత్యాన్వేషణమునకై తపస్సు చేసుకొంటూ జన సమూహమునకు దూరంగా ప్రశాంత జీవనం గడుపుచున్న సమయంలో ఈ కుక్క నన్ను ఆశ్రయించి, నా సహవాసియైనది. దీని ఆలనాపాలనా కూడ నేను వహిస్తూ వచ్చాను. పక్షము రోజుల క్రితం ఒకరోజు నాకు భిక్ష దొరకలేదు. కనుక దీనికి ఆహారము నొసగలేదు. దీనికి ఆకలిగ నుండుటచే అరచుట మొదలిడినది. ఆ రోజు ఒక దుర్దినం. ఎండ తీవ్రముగ నున్నది. ఊరిలోకి పోయినను భిక్ష లభింపక తిరిగి వచ్చితిని. మనస్సు, శరీరం రెండునూ అలసినవి. నాకాహారం లేకపోవుట అటుంచి, నన్ను ఆశ్రయించిన కుక్కకు కూడా ఏమియునూ పెట్టలేకపోయితిని. ఆ దురవస్థను మరచుటకు మనస్సు దైవముపై నిలుపుటకు నిశ్చయించితిని. ఆకలితో నున్న ఈ కుక్క అరచి నన్ను విసిగించినది. ఓర్పు నశించిన సందర్భములో కోప మావేశించెను. కోపముతో దీనిని తన్నిన మాట వాస్తవమే. తాము ధర్మ ప్రభువులు. ధర్మము ననుసరించి మీ రేశిక్ష విధించినను మనః పూర్వకముగా శిక్ష నంగీకరించి అనుభవింప గలను.”

శ్రీరామునితో సహా సభలోని వారందరూ కొంత తడవు మౌనగంభీరులైరి. శ్రీరాముడు ధర్మకోవిదుల నుద్దేశించి పై విషయ మున ధర్మమేమి సూచించుచున్నదో తెల్పుడనెను. ధర్మశాస్త్ర

పారంగతులైన పెద్దలు యిట్లని పలికిరి. "రాజా! సన్యసించి, సత్యాన్వేషణమునకై తపస్సు చేయు బ్రాహ్మణుని శిక్షించుట తగదు. అతడు సంఘ సభ్యుడు కాడు. సంఘమున నే దుష్కార్యము నొనర్చలేదు. ఈ కుక్క అతని నాశ్రయించినది. అతడు శక్తివంచన లేక దానిని పోషించి మేలు చేసినాడు. దాని నాలించినవాడు దాని నదిలించుటలో తప్పులేదు. ఈ బ్రాహ్మణునకు ఏశిక్ష విధించిననూ అది ధర్మవిరుద్ధమే" యగునని తెలిపిరి.

శ్రీరాముడు సందిగ్ధమున పడెను. జాగిలము వైపు చూసెను. జాగిలము "రాజా! మేము నోరులేని జీవులం. ఇతరులపై ఆధారపడి జీవించువారం. ఈ సాధువు నన్ను పోషించిన మాట వాస్తవమే. కాని, నన్ను హింసించు అధికారం ఇతనికి లేదు. బలవంతుడు బలహీనుని హింసించుట అధర్మం కాదా? ధర్మం తెలిసిన మీరే అధర్మమును సహించుట సమ్మతం కాదు. తగు రీతిని ఇతనిని శిక్షించి, నాకు న్యాయం చేయుడు" అని పలికెను.

శ్రీరాముడు కుక్కనుద్దేశించి "ప్రియ జాగిలమా! నీవే నా స్థానమున నున్నచో ఈ సాధువున కేమి శిక్ష విధించెదవు? అని ప్రశ్నించెను. జాగిలం ఉత్సాహముగా నిట్లు పలికెను. "మీ రాజ్యమున ఒక ఆధ్యాత్మిక పీఠమునకు పీఠాధిపతిలేక దీనావస్థను చెందియున్నది. ఆ పీఠమున కొక కులపతి ఆవశ్యకం. ఆ పీఠమునకు విశేషించి ఆస్తిపాస్తులుగల భక్తకోటి గలదు. దానిని నిర్వర్తించుటకు కులపతియే కఅవు. ఈ సన్యాసియైన బ్రాహ్మణుని ఆ పీఠమునకు కులపతిగా నియమింపుడు, ఇదియే నేను కోరునది."

శ్రీరాముడు, సభికులు, సాధువు మరింత ఆశ్చర్యపడిరి. సాధువు మనసున సంతసించెను. సభికులు కూడ సంతసించిరి. అందరి మనోభావము లెరిగిన శ్రీరాముడు సాధువుని అక్కడికక్కడే పీఠాధిపతిని చేసి సకల గౌరవములతో పీఠమునకు తన వాహనం, పరివారమునిచ్చి పంపివేసెను. జాగిలం వైపుచూసి "సాధువును శిక్షించుటకు బదులు ఇట్టి వర మిచ్చితివేమి? నీ ప్రవర్తనము చాల నిగూఢమై యున్నది. మాకెవరికిని తెలియని ధర్మసూక్ష్మమేదో యిందిమిడియున్నట్లు గ్రహించితిని. నీవు సామాన్యమైన జంతువు కాదని నీ మనుజ భాషణమే తెలిపినది. నీ యీ ప్రవర్తనము నీవొక ధర్మవేత్తవని తెలుపుచున్నది. నీవు ధర్మదేవతవు కాదు గదా! అని నమస్కరించి నీ వివరములను తెలుపుము" అని పలికెను.

జాగిలం గంభీరముగా యిట్లు పలికెను. "మహారాజా! నీ అనుమానం నిజం కాకపోలేదు. నేనొక ఆధ్యాత్మిక తత్త్వవేత్తను. ధర్మం తెలిసిన వాడను. మాయ ఆవరించగా అహంకారమున బడితిని. అట్టి అహంకారముతో పతితులైన జీవులను వుద్ధరించి, వారికి ముక్తిమార్గం తెల్పి వారి జీవన సమస్యలను పరిష్కరించుచూ జీవించవలెనని భావించితిని. క్రమశః లోకులు జీవన సమస్యలకు నానుండి పరిష్కారంపొంది నన్నాదరించిరి, మన్నించిరి, గౌరవించిరి. క్రమముగా పేరు ప్రతిష్ఠలు పెరిగినవి. లోకులు తాము పొందిన సహాయమునకు ప్రతిఫలముగా ధనమును, ఆస్తులను కట్టబెట్టిరి. విశేషముగా సంఘమున సత్కార్యములు జరుగుట ఆరంభమయ్యెను. వీటిని నిర్వర్తించుటకు కార్యాచరణ సమితి, సంస్థ అవసరమయ్యెను. ఉత్సాహవంతులు, అనుభవజ్ఞులైన కొందరు ఆధ్యాత్మిక పీఠములు,

సంఘసేవ పీఠము లేర్పరచి దానికి నన్నధికారిగా చేసిరి. కులపతిని చేసిరి. పీఠ నిర్వహణమున అనేకానేక సమస్యలు సహజం. ఓర్పు ముఖ్యమైన లక్షణముగా నుండవలెను. వివిధ స్వభావములు, దృక్పథం కలవారిని సమన్వయించి సమాధాన పరుపవలెను. కోపం, తొందరపాటు, పక్షపాత బుద్ధి యుండరాదు. ఏమరుపాటు పనికిరాదు. యోగినైనను రాజలక్షణములు లేక కొంత తికమక పడుచుండెడి వాడను. నిర్వహణమున ఎప్పుడును అందరినీ సంతృప్తి పరచుట దుర్లభం. ఇట్టి క్షమా ఓర్పులతో పీఠ నిర్వహణ మును ఈ సాధువులు చేయలేరు. ఒకపూట అన్నము దొరకని మాత్రముననే అతనికి విసుగు, కోపము వచ్చినవి. సన్యసించిన వారికి కోపం తగునా? తొందరపడి సన్యసించెను. అతడు యిప్పుడు పీఠము నిర్వహించుటలో తొందరపాటు చర్యలతో తనకు తానే శిక్షలు విధించుకొనగలడు. కులపతిత్వం శిక్షా పీఠమేకాని, అలంకార ప్రాయం కాదు. ఈతడికి శిక్ష–శిక్షణ రెండునూ పీఠాధిపత్యమున దొరుకును. ఈతనికి శిక్షణ ఓర్పు, అదిలేనిచో శిక్ష తప్పదు. అతనిని కాలక్రమమున ప్రకృతియే శిక్షించగలదు."

శ్రీరాముడు విస్తుపోయి "మహాత్మా! ఇంతకును మీరెవరో తెలుపలేదు?" అనెను. కుక్క ఆ పీఠమునకు మునుపటి కులపతిని నేనే, స్వానుభవం వలననే పై విషయములను తెలిపితినని పలికెను. మరలా విస్తుపోవుట శ్రీరాముని వంతయ్యెను.

కులపతిత్వం అర్హులకే. అనర్హులకు అతి భయంకర హేతువు.

*(ఇది కల్పితం కాదు. త్రేతాయుగమున జరిగిన కథ.)*

# 29

## హెచ్చరిక!

**“అం**టు సొంటూ, ఆచారం..... ఇవి లేనివారికి పవిత్రత యుండదు. శుచి శౌచం యుండవలెను. శుచి అనగా బాహ్య పవిత్రత. శౌచం అనగా అంతఃశుద్ధి. అంతఃశుద్ధి, బాహ్యశుద్ధి కలిగిననాడే స్థిరము సుఖము అగు మనస్సు ఏర్పడును.

అంతఃశుద్ధికి ప్రాముఖ్యత ఎక్కువగ నిచ్చి బాహ్యశుద్ధికి తగుమాత్రపు ప్రాముఖ్యత నీయవలెను.”

“నీయందు బాహ్యశుద్ధిని గూర్చిన భావము ఎక్కువై అంతః శుద్ధికి సంబంధించిన భావములు కరువగుచున్నవి. నీ బాహ్యాచారం నిన్ను క్రమశః మూర్ఖుని చేయుచున్నది. అది డంబాచారమై నిన్ను పతనం చేయుచున్నది. దీనులను హీనులుగ చూచుచున్నావు. వారి బాహ్య మాలిన్యమును ఎక్కువగ చూచుచూ ఈసడించుకొను చున్నావు. వారు నీకన్న చాల తక్కువవారన్న అహంకారం నిన్ను బాగా ఆవరించి యున్నది.”

“మడి అంటావు, ఆచారం అంటావు. మనస్సున అందరినీ వెలివేసి దూరం చేసుకొంటావు జాగ్రత్త! నీవు హీను లనుకునేవారే

నీ కనుదినం జీవనమునకు ఆధారం. వారు పండించిన కూరలు, పండ్లు, ధాన్యం సంశయం లేకుండా మెక్కుతావు. వారు కృషిచేసి యిచ్చిన డబ్బును స్వీకరిస్తావు. వారు పాడిని పోషించి పాలను తెచ్చియిస్తే గుటకలు వేస్తూ త్రాగుతావు. వారు కడిగియిచ్చిన పాత్రను వాడుకొంటావు. వారు నేసిన, కుట్టిన మరియు ఉతికిన బట్టలు వేసుకుంటావు. నీ యిల్లు వాకిలి వాళ్ళే కట్టిపెడితే అందులో వుంటావు. వాళ్ళు తుడిచి కడిగి నీయింటిని శుభ్రం చేస్తూవుంటే కిమ్మనకుండా చేయించుకుంటావు. పైగా సరిగా చేయలేదని కోప్పడతావు. నీ బ్రతుకంతా వారిచుట్టూ పెనవేసుకొని వున్నది. మరి వారిని హీనులని ఎందుకు భావిస్తావు? వారిని ప్రేమించలేని నీవు నన్ను పూజించుట వ్యర్థం. నాతో నడవాలంటే ఈ హీనమైన భావన నీలో తొలగాలి. ఇది నీకు తుది హెచ్చరిక!"

ఉలిక్కిపడి లేచాడు శిష్యుడు. వచ్చింది కల అని తెలుసు కున్నాడు. "అమ్మయ్య! కలేకదా ! " అనుకొని స్నానంచేసి, మడికట్టు కొని, దీపం పెట్టి, గురువును స్మరించి, ధ్యానం మొదలుపెట్టాడు. ఖంగున లోనుండి శబ్దం వినిపించింది. "మూర్ఖుడా! నీకు వచ్చింది కలకాదు. నీవు పాటించవలసిన నియమం. నియమపాలన చేయని నీ ధ్యానం నిరర్థకం. ప్రవర్తన మార్చుకొనుటయే నీ కర్తవ్యం." తీక్షణమైన గురువు వురము విని ఉలిక్కిపడ్డాడు. అంతేకాని అప్పటికి ఇప్పటికీ అలాగే వున్నాడు.

"జీవులను హీనులుగ చూసేవాడే హీనుడు."

# 30

## మంచి - చెడు

మహర్షి దరిచేరి, మనిషొకడు ఇలా అన్నాడు. “మీవంటి మహాత్ములు ఎంత చేస్తున్నా ప్రపంచంలో చెడే పెరిగిపోతోంది. కారణమేమై యుంటుందంటారు? మహర్షి మందహాసం చేస్తూ “కారణం మీరే!” అన్నాడు.

అగంతకుడు ఉలిక్కిపడి “అదేమిటి?” అన్నాడు. “ఔను మీరే కారణం. మీబోటి మంచివారు ఉత్త మంచివారే కాని, సమర్థులు కారు. సమర్థులు స్వార్థపరత్వాన్నే ఆశ్రయిస్తారు కాని, మంచిమీద వారికి నమ్మకం లేదు. మాబోటి వారి దగ్గరకు వారు వచ్చినా, ఏవో తగిన deals (ఒప్పందాలు) కుదుర్చుకొని కొంత వెలకట్టి ధర్మకార్యాలకు అన్నట్లుగా మా మొహం మీద విదిల్చి పోతుంటారు. మంచివారికి సమర్థత లేకపోవటమే లోపం. సమర్థులు మంచివారౌ తారని ఆశించడం కూడా ఒక లోపం. పై రెండూ ఎవరియందు భాసిస్తాయో, వారు మెండుగా వుంటే సంఘంలో మంచి పెరుగు

తుంది. అందాక మంచికి కుంటినడకే. ఇది లోకం తీరు అని తెలిసి, మిన్నకున్నాం మేమందరం.”

“నీకొక కథ చెప్తాను విను. పూర్వం నీబోటివాడే ముమ్మరంగా ధర్మప్రచారం చేస్తాను, సంఘంలో అందరికి ధర్మం తెలియకపోవుట వలననే ఆచరించుట లేదు, ధర్మగ్లాని వలన వచ్చే కష్టాలు కూడా అందరికీ తెలియ చెప్పాలి అన్నాడు. అప్పుడు నేను వాడితో నీవల్ల కాదన్నాను. లేదు, చేసి చూపిస్తానన్నాడు వాడు. వాడి ఉత్సాహం కాదనలేక తాళపత్రం మీద కొన్ని ధర్మాలు వ్రాసి, వాడికిచ్చి వీలున్నన్ని ప్రతులను తీసి అందరికీ పంచి ధర్మ ప్రచారం చేసుకో మన్నాను. వాడు ఉత్సాహంగా ఆ తాళపత్రాలను తీసుకొని ఒక వ్రాయసగాడి వద్దకు వెళ్ళాడు. కాగితాలు, ముద్రణాలయాలు లేని రోజులవి. తాళపత్రాలే శరణ్యం. మా ప్రచారకుడు వ్రాయసగాడి వద్దకు వెళ్ళి వేయి ప్రతులను తీయమనీ, వంద బంగారు నాణాలు యిస్తానని చెప్పాడు. వ్రాయసగాడు వేయి తాళపత్రాలు సిద్ధంగా లేవని, సిద్ధమైన వారం రోజుల్లో వ్రాసి యిస్తానని చెప్పాడు. అప్పుడే నాణాలు యిస్తానని మా ప్రచారకుడు చెప్పివచ్చాడు.”

“పక్షం రోజుల తర్వాత మా ప్రచారకుడు వెళ్ళి వ్రాయస గాడిని కలిసాడు. పనైందా? అన్నాడు. కాలేదు! అన్నాడు వ్రాయస గాడు. కారణం అడిగితే మరొక ప్రచారకుడు వచ్చాడని, వేయి తాళపత్రాలు అతడే తెచ్చుకున్నాడని, వ్రాయసగాడు తెప్పించే వేయి తాళపత్రాలు కూడ తనకే వినియోగించమని ఐదువందల బంగారు

నాణాలు ముందుగానే చేతిలో పెట్టాడు. ఆ రెండవ ప్రచారకుడు చేసే ప్రచారం దేశద్రోహ ప్రచారం. వారి సంసిద్ధత, సమర్థత మావాడికి లేకపోయింది. ధర్మ ప్రచారం కాకపోగా, అధర్మప్రచారం ముమ్మరంగా సాగింది. అప్పటికి, ఇప్పటికీ కూడా ధర్మానికి ఒకటే లోపం జరుగుతోంది. సన్మార్గులు సమర్థులు కాకపోవుట, సమర్థులు సన్మార్గులు కాకపోవుట. అయినప్పటికి మా కర్తవ్యం చేస్తూనే వున్నాం.”

మహర్షి పై విధంగా పలికి గంభీరుడై మౌనం వహించాడు. వచ్చిన వాడు మంచి, చెడు గురించి మీనమేషాలు లెక్కపెడుతూ అలాగే వుండిపోయాడు. కాలం విచిత్రం !



31

# దైవ సందేశము

**అ**క్బరు చక్రవర్తి మొగలాయి చక్రవర్తులలో ఉత్తమోత్తముడు. దివ్యాంశ సంభూతుడు. దివ్యస్ఫూర్తితోనే తన జీవితమును, తన వ్యక్తిగత జీవితమును, రాజ్యపాలన గావించువాడు. అతనికి తరచు దివ్యవాణి వినిపిస్తూ వుండేది. అతని చూపు, వినికిడి అత్యంత అప్రమత్తంగా వుండేవి. వినిపించేవి, కనిపించేవి శ్రద్ధగాను, లోతు గాను చూస్తూ వుండేవాడు. లోనుండి కూడ వినబడుట, కనబడుట వుండేది.

ఛత్రపతి శివాజీ వలెనే అక్బరు చక్రవర్తిది గురుపరంపరా గతమైన ఆశీర్వచనము, అనుగ్రహము కలిగి యుండేవాడు. చిన్నచిన్న సంఘటనల నుండి పెద్ద సత్యాలను గ్రహించేవాడు.

ఒకానొక సమయములో అక్బరునకు అతని మంత్రులు, సేనాధిపతులు గోల్కొండను ముట్టడించి, చేపట్టి పరిపాలించాలని ఒత్తిడి చేశారు. చక్రవర్తి అందరి సలహాలను గ్రహించి, ఒత్తిడి

చెందకుండా ఏకాంతములో ఉద్యానవనంలో కూర్చుని ఆలోచించ సాగాడు. యుద్ధమునకు అప్పటికే సర్వమూ సన్నద్ధమైనది. చక్రవర్తి వాహనారూఢుడై బయలుదేరటమే మిగిలియుంది. కాని, అతడింకనూ ఉద్యానవనంలోనే వున్నాడు. తన చుట్టూయున్న నేలను పరికించ సాగాడు. ఒక చీమ కనిపించింది.

చీమ ఒక చిన్న మట్టిముద్దను తన తలపై నుంచుకొని మోసుకొని వెడుతున్నది. మాటిమాటికి మట్టిముద్ద జారి క్రింద పడుతోంది. దానిని మరల మరల తలకెక్కించు కోవటానికి అవస్థ పడుతోంది. మట్టిముద్దతో నానా యాతన పడుతున్న చీమను చూసి అక్బరు చక్రవర్తి చిరునవ్వు నవ్వాడు.

మంత్రులను, సేనాధిపతులను గొనిరమ్మని సేవకులను ఆజ్ఞాపించాడు. వారందరు హుటాహుటిన ఉద్యానవనంలోకి వచ్చారు. వారందరితోను అక్బరు గంభీర స్వరంతో ఇలా పలికాడు: "గోల్కొండ ముట్టడి ప్రయత్నము విరమించబడింది. గోల్కొండను చేజిక్కించు కోవటం సులభమే కాని, అది మనకు పాలనాపరం కాదు. తలభారం అవుతుంది. భారం కొనితెచ్చుకొన్నట్లవుతుంది. యాతన పడవలసి యుంటుంది. కావున, యుద్ధ ప్రయత్నము విరమిస్తున్నాను." అందరూ విస్తుపోయారు. మంత్రి, పురోహితులు అటుపైన ఏకాంతమున ప్రశ్నింపగా అక్బరు చక్రవర్తి గోల్కొండ విషయమున తన నిర్ణయం "దైవ సందేశం" అని సవినయంగా తెలిపి చిరునవ్వు నవ్వాడు.

32

# పొట్టు గింజ

దేశాటనం చేస్తున్న బుద్ధుడు ఒక గురువాశ్రమాన్ని చేరాడు. ఒకరినొకరు పరస్పరం మన్నించుకున్నారు. కుశలప్రశ్నలు జరిగినాయి. బుద్ధుని అనుచరులంతా ఆశ్రమంలో ఆదరింపబడి విడిది చేశారు.

ఏకాంతంలో బుద్ధుడు, ఆశ్రమగురువు ప్రేమపూరిత సంభాషణలను గావిస్తూ వున్నారు. సంభాషణలో భాగంగా తమతమ శిష్యులు, అనుయాయుల గూర్చిన ప్రసక్తి వచ్చింది.

గురువు ఈ విధంగా పలికాడు. “సంఘము నుండి వేలాది మనుష్యులు ఇక్కడకు వచ్చి సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ ఇత్యాది విషయాలను గూర్చి అడిగి తెలిసికొని సంతృప్తి చెంది, శ్లాఘించి వస్తువులను బహుమతులుగా సమర్పించి తిరిగి వెళుతుంటారు. వారందరూ విషయములను ఆసక్తితోనే సత్యపరమైన విషయములను గ్రహిస్తూ వుంటారు. ఆశ్రమానికి వచ్చి ప్రశాంతత

పొందటం, సంఘమున సొచ్చి అశాంతి చెందటం, మరలా ఆశ్రమానికి వచ్చి ప్రశాంతత పొందటం జరుగుతోంది. అంతా చర్వితచర్వముగా జరుగుతోంది. వలయాకారంగా ఎంతోమంది సంఘానికి, ఆశ్రమానికి మధ్య సంవత్సరాలుగా రాకపోకలూ చేస్తున్నారు. అశాంతత నుండి ఉత్తీర్ణులు మాత్రం కావటం లేదు. ఇతర గురువులను సోదర భావంతో విచారింపగా వారి అవగాహన కూడ యిట్లే వున్నది. సర్వజ్ఞులు– తమ అవగాహనను మా కందించ గలరు."

బుద్ధుడు ప్రసన్న వదనంతో యిట్లా పలికాడు. "సత్యము, ధర్మములకు పరమైన అంశములు జీవుని సహజముగా ప్రచోదనము చేయగలవు. ఆ ప్రచోదనము చాలమందికి తాత్కాలికమే. మీ ఆశ్రమము దాటేసరికి ప్రచోదనము అదృశ్యమై, సహజ స్వభావం జీవుని ఆవరించును. మరికొంతమందికి ప్రబోధం ఉపశమనము నిస్తుందే కాని, అవగాహనను కలిగించదు. అవగాహన లేక అనుసరించు వారు పరితృప్తి చెందలేరు. అవగాహన పొందిన వారందరు కూడ, తదవగాహనను ఆచరణమున పెట్టరు. ఇట్టివారు కేవలం సంఘమున పాండిత్య ప్రదర్శనం చేసుకొనుచూ కాలం గడుపుచుందురు. స్ఫూర్తి చెంది, అవగాహనను పొంది, ఆచరించు వారు బహు కొద్దిమంది. ప్రశాంతత వారి సొత్తు మాత్రమే."

33

# గంగాస్నానం

దక్షిణేశ్వరంలోని భవతారణి దేవాలయం వద్ద పరమహంస గంగానది ప్రవాహమును తదేక దృష్టితో గమనిస్తూ ఆనందాతి శయంతో పరిసరములను మరచి తన్మయుడై యున్నాడు. శిష్యు డొకడు పరమహంసను సమీపించి పాదములను శిరముతో స్పృశించి, చేతులు కట్టుకొని నిలబడెను. శ్రీ రామకృష్ణుడు కనులు తెరచి, శిష్యులను చూసి ప్రేమపూరితముగా చిరునవ్వుతో అతని రాకకు కారణ మడిగెను.

శిష్యుడు "ప్రయాగ వెళ్ళి గంగాజలమున స్నానమాచరించి నా పాపములను పరిహరించు కొనవలెనని సంకల్పించుకొంటిని. నాకు అనుమతినిచ్చి అనుగ్రహించండి" అని పలికెను.

రామకృష్ణుడు : గంగానది యిచ్చట కూడ నున్నది కదా! ప్రయాగ పోవలసిన అవసర మేమున్నదని శిష్యుని ప్రశ్నించెను.

శిష్యుడు : ప్రయాగలో ప్రసిద్ధ పండితుడు గలడు. వారు సమంత్రకముగ, విధి విధానముగా మనచే స్నానము చేయింతురు.

అప్పుడు మన పాపములన్నీ తప్పక తొలగిపోవును. అదియే ప్రయాగకు పయనించుటకు కారణం” అని తెలిపెను.

రామకృష్ణుడు ఫక్కున గట్టిగా నవ్వెను. కొంతసేపట్లే నవ్వెను. అతనికి నవ్వు ఆగుట లేదు. శిష్యుడు విస్తుపోయెను. తన గురువు ఎందుకట్లు నవ్వుచున్నాడో అర్థము కాలేదు.

“మీరు ఎందుకలా నవ్వుచున్నారో నాకు తెలియటం లేదు. నేను తెలిపిన విషయం సంప్రదాయబద్ధమైనదే కదా! ఎందుకిలా ఆట పట్టిస్తున్నారు? అని అడిగాడు.

రామకృష్ణుడు నవ్వు ఆపుకొని “మంత్రాలు విని గంగలో స్నానం చేస్తావు. బాగుంది. అప్పుడు నిన్ను పాపాలన్నీ వదిలేస్తాయి. ఇది మరీ బాగుంది. నిన్ను వదిలేసిన పాపాలు ఎక్కడకు పోతాయను కుంటున్నావు?” అని ప్రశ్నించాడు. శిష్యుడు “మీరే చెప్పండి” అని అన్నాడు.

“గంగానది ఒడ్డున పెద్దపెద్ద చెట్లుంటాయి. నదిలో స్నానం చేసేవారంతా తమ బట్టలు తీసి, ఆ చెట్టుకు తగిలించి ఏకవస్త్రంతో స్నానం చేస్తుంటారు. స్నానమైన వెనుక వచ్చి బట్టలు ధరిస్తారు. నీవు గంగలోకి దిగుతున్నావని తెలిసి నీ పాపాలు నిన్ను వదలి చెట్టెక్కు తాయి. నీవు గంగలోంచి బయటకు రాగానే చెట్టుమీదనున్న పాపాలు వచ్చి మరల పట్టుకుంటాయి. గంగ పవిత్రం అన్నమాట సత్యం. కాబట్టి, పాపాలు గంగను చేరవు. వేచియుండి నీవు బయటకు రాగానే మరలా నిన్ను పట్టుకుంటాయి. మరొక విషయం చెప్పనా?

శిష్యుడు నిర్వీర్యుడైపోయాడు. "చెప్పండి" అన్నాడు.

"గంగలోంచి తిరిగి నీవు వచ్చినప్పుడు నీ పాపాలే నిన్ను పట్టుకోవాలనే నియమం లేదు. అవి పాపాలు కదా! పాపం వాటికి నియమాలు లేవు. ఎవరు బయటకు వస్తే వారిమీద పడుతుంటాయి. పైగా ప్రయాగలో ఎక్కువమంది స్నానం చేస్తుంటారు. కాబట్టి, ఎక్కువమంది గంగ నీళ్ళలో వుండటం చేత చెట్లన్నీ ఎక్కువ పాపాలతో రద్దీగా వుంటాయి. వాడు వీడు అనే విచక్షణ లేకుండా గంగలోంచి బయటకు వచ్చిన వాడినల్లా పట్టుకుంటాయి. మరి జాగ్రత్తగా ఆలోచించుకో. ఇక్కడే అయితే స్నానానికంతమంది జనం వుండరు. ఆపైన నీ యిష్టం."

శిష్యుడు నీరుగారిపోయాడు. "మరి నన్నిప్పుడేం చేయమంటారు?" అని అడిగాడు.

రామకృష్ణుడు నవ్వుతూ "గంగలో వుండిపోవటమే దీనికి పరిష్కారం. ఇంతకు మించి పాప పరిష్కారం లేదురా!" అని అన్నాడు.

"అదేలా సాధ్యం?" అన్నాడు శిష్యుడు.

రామకృష్ణుడు అతి గంభీరుడై యిలా పలికాడు. "అది సాధ్యమే. అదే పరిష్కారం. మరి వేరే పరిష్కారం లేదు. గంగ, గీత, గోవింద, గౌరి పవిత్రీకరణ కేంద్రములు. మనల విధి ధ్యాసల ననుసరించి వీనియందు శాశ్వతముగ నుండవచ్చును. "గంగ" అనగా ఏమనుకొనుచున్నావు? దక్షిణ ముఖముగను, ఉత్తర

ముఖముగను జీవన గమనం వుండగా అందలి కేంద్రస్థానముగ పూర్ణత్వం వున్నది. నీ యందలి ఇడ, పింగళ నాడులలో ప్రవహించు జీవన స్రవంతి గంగయే. వాటి నడుమ మునుగుట యనగా పూర్వత్వం చెందుట. అదియే శుద్ధ చైతన్యముగా "సుషుమ్న" యందు ప్రవహించుచున్నది. దానియందు మునుగుటయే "త్రివేణీ సంగమ" స్నానం. అదియే ప్రయాగ స్నానం. దానికి వలసినది నిరంతర "నామస్మరణం". స్మరణం జరుగుచున్నంత తడవు పాపములంటవు. స్మరణము "అనుస్మరణం" కావాలి. అపుడు పాపములు దరిచేరవు.

"నీవు దేవాలయము నందున్నపుడు, గంగా జలము నందున్నపుడు, సత్పురుషుల సాన్నిధ్యము నందున్నప్పుడు కూడా నీ పాపములు నిన్ను విడుచును. పాపముల కచట స్థానము లేదు. నీవు వెలుపలికి రాగానే మరల ఆవరించ గలవు. కావున పాపములనుండి విముక్తి చెందుటకు పరిష్కార మొకటియే- అది నిరంతరం "సద్గురు" లేదా "దైవసాన్నిధ్యం" కలిగియుండుట. అందుకే భగవానుడు అనుస్మరణం, అనన్యచింతనం, పర్యుపా సనము, నిత్యాభియుక్తి అను అంశములను హెచ్చరిక చేసినాడు. దీపం వున్నంత సేపు చీకట్లు క్రమ్మవు కదా! చీకట్లు వుండరాదను కొన్నవాడు దీపారాధనం నిత్యము చేయవలెను. ఇది నిజమైన సంప్రదాయం."

# 34

# దైవప్రేమ

విజయనగర సామ్రాజ్య పూర్ణచంద్రుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి యగు శ్రీకృష్ణదేవరాయలు, శ్రీకృష్ణాంశయందు జన్మించిన చక్రవర్తి, రాజర్షి, సనాతనధర్మ సంస్థాపనమునకు విశేషముగ వినియోగపడిన దైవప్రేరితుడు. రణరంగమున ఎంత వీరుడో, ధర్మ సంస్థాపనమున అంత ధీరుడు. భారతీయ సంస్కృతికి అద్దం పట్టి స్వర్ణయుగపు రుచులను ప్రజలకు అందించిన సమర్థుడు. అతనిని "దైవము" కవచమువలె కాపాడినది. అతడును దైవము విషయమున అప్రమత్తుడే.

ఒకనాడు శ్రీకృష్ణదేవరాయలను హతమార్చుటకు మ్లేచ్ఛుడొకడు రాయల ఉద్యానవనమున ఒక పొదమాటున దాగి యుండెను. రాయలు ప్రతి ఉదయం ఉద్యానవనమున విహరించు సమయమును గమనించి అర్ధరాత్రికే ఆ మ్లేచ్ఛుడు రహస్యముగా వనమున ప్రవేశించి మాటుగా నుండెను.

ప్రభాత సమయమున తూర్పు వెలుగు చీకట్ల నధిగమించు చుండగా రాయలు తనభార్యతో వనమున ప్రవేశించెను. అతడు సంచరించుచూ మ్లేచ్ఛుడు దాగిన పొద సమీపమునకు రాసాగెను. మ్లేచ్ఛుడు అప్రమత్తుడై ఒరనుండి పదునైన బాకును తీసి అదను కొరకు వేచి యుండెను. ఇంతలో ఒక నల్లని త్రాచు సరసర రాయల ముందునుండి వేగముగా ప్రాకుచూ మ్లేచ్ఛుడున్న పొదలోనికి జొరబడెను. త్రాచును చూచిన రాయలు అనుచరుల నుద్దేశించి "త్వరపడుడు. పొదను వెదకుడు" అని పలికెను. అనుచరులు హఠాత్తుగా పొదను దూరి మ్లేచ్ఛును కని, పట్టిరి. త్రాచు దొరకలేదు. మ్లేచ్ఛుడు దొరికెను. అనుచరులు మ్లేచ్ఛుని చేతులు విరిచికట్టి రాయల ముందుంచిరి. రాయలు మ్లేచ్ఛుని దండించుటకు ఆజ్ఞనిచ్చి, తన ధర్మపత్నితో యిట్లనెను. "నన్ను చంపదలచిన మ్లేచ్ఛుడే నిజమైన త్రాచు. మనము చూచిన త్రాచు దైవం. అతడే మన కవచం. త్రాచు రూపమున వచ్చి అసలు త్రాచును పట్టించి తాను అదృశ్యు డయ్యెను. తన వారిపై దైవమునకుగల ప్రేమ అద్వితీయం అన్నాడు.



## 35

# అర్హత - అనుగ్రహం

**హిం**దూస్థానము యొక్క మహిమను విశేషముగ రుచి చూచిన వారిలో దివ్యజ్ఞాన సమాజ సంస్థాపకుడైన ఆల్కాట్ ఒకడు. ఆల్కాట్ సంశయాత్మ. పరిపూర్ణ విశ్వాస మేర్పడు వరకు సంశయము లక్షణముగా జీవుని ఆవరించి యుండునని ఆది బుద్ధుడైన "ఋషభుడు" తెలిపెను. సంశయం మనసుయొక్క ఆలోచనా తీరులో ఒక ప్రధానమైన పనిముట్టు. ఏ విషయమునైననూ క్షుణ్ణముగా పరిశీలించి తమ మేధస్సుకు అందినంతలో అంగీకారమైన విషయ మునే మనుష్యులు పాటించుట కద్దు. ఆల్కాట్ ప్రసిద్ధిగాంచిన న్యాయవేత్త, న్యాయవాది, నేర పరిశోధకుడు, మిష్టరీలను ఛేదించు టలో నిపుణుడు. అతడు హెచ్.పి. బ్లావెట్స్కీని అనుసరించి హిందూ స్థానమునకు ఏతెంచెను. వివిధ ప్రదేశములకు గొనిపోబడెను. రహస్య ప్రదేశములకు కూడ ఒక రాజపుత్రుని సహాయమున గొని పోబడెను. ఆ రాజపుత్రుడు ఒక రాజర్షి. అతనిని పసితనమునుండి సేవించుచున్న భారతీయ యువకుడు ఒకడు కూడా పర్యాటక

బృందమున నుండెను. ఆ యువకుని హిందూ ధర్మ విషయములను గూర్చి, రాజర్షిని గూర్చి ఆల్కాట్ పరిపరి విధములుగా ఉత్సుకతతో ప్రశ్నించుచుండెను.

ఒకనాడు ఉత్తర హిందూదేశ అడవులలో పర్యాటకము పూర్తియైన వెనుక ఒక సురక్షిత ప్రదేశమున పర్యాటక బృందము గుడారములు వేసుకొని విశ్రమించిరి. వారికి రెండువందల గజముల దూరములో రాజర్షి తనకై ఒక గుడారము నేర్పరచుకొని అందుండెను.

ఆల్కాట్ జిజ్ఞాసువగుటచే భారతీయ యువకుని సమీపించి యోగపరమైన సంవాదము ప్రారంభించెను. యువకుడు తనకు తెలిసిన మేరకు యోగ విషయములను వివరించుచుండెను. ఆ విషయములన్నియు తెలుసుకొని ఆల్కాట్ దిగ్భ్రాంతి చెంది, యువకుడు తెలిపిన విషయములు అనుభవ పూర్వకములా అని తెలియగోరెను. యువకుడు సత్యకాముడు. అతడు స్పష్టముగా తాను తెలిపిన విషయములు చిన్నతనము నుండి తన గురువగు రాజపుత్రుని నుండి తెలుసుకొనినవే యనియు, స్వానుభవములు కావనియు తెలిపెను.

అప్పుడు ఆల్కాట్ "మీ సద్గురువు రాజర్షులు మీకు యోగోప దేశం చేసెనా? కుండలిని ప్రచోదనము గావించెనా?" యని అడిగెను.

యువకుడు "లేదు" అని తెలిపెను. "పసితనమునుండి ఆయన ననుసరించు చున్నావు, ఆయనకు సేవ చేసినావు, ఎన్నో

విషయములను కూడ తెలుసుకొన్నావు. నీకు కుండలినీ ప్రచోదనము పొందు హక్కు, అర్హత కలదని నేను భావిస్తున్నాను. జీవిత కాలమంతయు ఆయన సేవలకే అంకితము చేసితివి గదా! ఎందులకు నీ గురువు మీకు యోగోపదేశం చేయలేదు?" అని ఆల్కాట్ ప్రశ్నించెను.

"మీరన్నది నిజమే. కాని, కారణం ఒకటున్నది. వారు యోగప్రచోదనము చేయుటకు సంకల్పించిన సమయముననే నా తల్లిదండ్రులు నన్ను వివాహమాడి, దాంపత్య జీవితం గడుపుమని నిర్దేశించిరి. అది గురుదేవులకు విన్నవించగా, తల్లిదండ్రుల మాట శిరోధార్యమని, వారి నిర్దేశం దైవ సంకల్పమని తెలిపి, వివాహమునకు ప్రోత్సహించిరి. వివాహ సంబరములు ముగిసిన కొన్ని దినముల తర్వాత గురుదేవుని సమీపించి, ఉపదేశ విషయమై పరి ప్రశ్నించితిని. వారు చిరునవ్వుతో ఇంకనూ నేను దాంపత్య జీవితం గడుపవలసిన కర్తవ్య మున్నదనియూ, అది కారణముగా ఉపదేశమునకు అవకాశము లేదని, సమయం వచ్చినప్పుడు తానే నిర్వర్తించెదనని తెలిపెను. పుష్కరకాలం గడిచినది. వారు అనుగ్రహించినపుడే అది జరుగగలదు. అంతవరకు వేచియుండుటే తప్ప మరియొక గత్యంతరము లేదు" అని పలికెను.

ఆల్కాట్ దిగ్భ్రాంతి చెంది "మీ గురుదేవుల నిర్ణయం కఠినముగా తోచుచున్నది. నాకిది సమ్మత మనిపించుట లేదు. నా అవగాహనకు కూడ అందుట లేదు. నీవంటి వానికే ఉపదేశం

చేయని రాజర్షి వద్ద మా బోటి పాశ్చాత్యులు ఎట్లు పొందగలరు?" అని ప్రశ్నించెను.

హఠాత్తుగా గుడారములో ఒక దివ్యవాణి వినపడెను. "అర్హతలు, హక్కులు తమకై తాముగా నిర్ణయించుకొనువారికి ఉపదేశ మందదు. ఉపదేశం తాము పొందునది గాదు. అది అందింప బడునది. బ్రహ్మమును పొందిన వాడెవ్వడును లేడు. బ్రహ్మయే జీవులను పొందగలడు. దానిని అనుగ్రహం అందురు. అనుగ్రహం వర్షించునపుడు అహంకార పొర అడ్డుగా నిలచును. నిరహంకారం, వినయము శ్రద్ధ అనసూయత్వంతో కూడిన దీర్ఘకాల సత్పురుష సేవనము నుండి లభించగలదు. అది ప్రాచ్యులకే కష్టము. అప్రాచ్యు లకు కష్టతరం. కామునకు దుర్లభం. ప్రశ్నల పరంపరలతో పరిష్కార ములు రావు. అనుసరణీయ మార్గం మాత్రమే పరిష్కారం."

పై మాటలు విన్న ఆల్కాట్ భయపడెను. తాను విన్న వాణి రెండువందల గజముల దూరములో విశ్రాంతి గొనుచున్న రాజర్షిది అని తెలిసెను. అతని వాణి యిచ్చట ఎట్లు వినపడినదో తెలియలేదు. సమాధానం మాత్రం తనకు సంతృప్తి కలిగించినది. పరుగునపోయి రాజర్షికి నమస్కరించెను.

*(జరిగిన కథ, బ్లావెట్స్కీ రచనల నుండి)*



# 36

# బంగారం

"పదార్థమయమైన వస్తువులు, విలువగల రాళ్ళు, బంగారం, వెండి వంటి లోహములు ఆధ్యాత్మిక మార్గమున అవరోధములా?" అని శిష్యుడొకడు గురువును ప్రశ్నించాడు.

గురువిట్లనెను : అవరోధములు అగుట, కాకపోవుట వానిపై మనకున్న భావమును బట్టి యుండును. సాధారణముగా ఘనమైన పదార్థములు మానవప్రజ్ఞను భౌతికమునకు బంధించగలదు. భూమి లోపల దొరకు పదార్థములయందు గల మక్కువ మానవ ఆజ్ఞను పాతాళలోకమునకు ఆకర్షించగలదు. ఈ ఆకర్షణ అంటురోగమువలె వ్యాపించి మానవప్రజ్ఞను భౌతికమునకు బద్ధుని చేయును. ప్రస్తుతం మానవజాతికి బంగారంపై గల మక్కువే దీనికి తార్కాణం. దేశముల చరిత్ర కూడ బంగారం, వజ్రముల సముపార్జనం, దోపిడీలను చాటి చెప్తున్నవి. గత 500 సం॥ల మానవజాతి చరిత్రను గమనించి నచో శక్తివంతమైన దేశాలు భారతదేశము, అమెరికా ఖండం కొల్లగొట్టిన తీరు అతి దైన్యం.

సృష్టియందు సమస్తమునకు సద్వినియోగం వున్నది. అటులనే దుర్వినియోగం కూడ యున్నది. సద్వినియోగం ద్వారా ఉద్ధారం, దుర్వినియోగం ద్వారా పతనం వ్యక్తికిగాని, జాతికిగాని తప్పవు. బంగారము నందుగల హిరణ్మయమగు కణతి భౌతికమందలి దివ్యత్వమునకు ప్రతీక. పవిత్రతకు ప్రతీక. ఈ లోహపుకాంతులు రక్తమును శుద్ధి చేయగలవు. ప్రాణశక్తిని పెంపొందింపగలవు. వెలుగును పదార్థముల లోతులలో కూడ ప్రసరింప చేయగలవు. భౌతికమున దివ్యత్వమును అవతరింప జేయగలవు.

అది అట్లుండగ బంగారం నుండి జనించు వాయువులు విషపూరితములు, ప్రాణారిష్టములు. బంగారము నందు ఆశ గలవారియందు, దానిని ప్రోగుచేసుకొను వారియందు, దాచిపెట్టు వారియందు, దానిపై గల కామము కారణముగా ఈ విషపూరిత వాయువు జనింపగలదు. ఈ వాయువు మసక కలిగించును. మాయను పెంచును. జీవుని హరించును. పవిత్రతకై బంగారమును ధరించుట బుద్ధిమంతుల లక్షణం. దానికై ఆశపడుట, దానిపై మితిమీరిన అనురాగం కలిగియుండుట పతన కారణం. బంగారు కిరణములకు ఉన్ముఖుడగుట నేర్చుకొనుము. అది అర్చిర్ మార్గం. దానిపై మోజు విషవాయు జనితం. కావున ధూమ్ర మార్గం.



# 37

## వినయ నయనము

"**భూ**మ్యాకర్షణలను అధిగమించినవాడే ఆకాశ గమనమునకు అర్హుడు" అని సద్గురు వొకరు తన శిష్యబృందమునకు బోధించుచుండెను. శిష్యుడొకడు నిలబడి "భూమి యందలి వైభవం సమస్తమును మనసున విచారించినచో ఆ ఆకర్షణలను విచక్షణతో అధిగమించవచ్చును గదా!" అని పలికెను. పై విషయము అనుభవపూర్వకముగ తెలియుట జ్ఞానం. కేవలం విచారణవలన తెలియుట తెలియుటగాదు. అనుభవైక జ్ఞానమే జ్ఞానం. దానిని పొందుటకు వలసిన కాలమిపుడు మిమ్ములను సమీపించినది. మీరు యికపై ఆశ్రమమును వీడి మీ మీ జీవితములను యథేచ్ఛగా నిర్వర్తించుకొనుడు. భూమిపై జీవనమున తారసిల్లు ఆకర్షణమును విచక్షణతో గమనించుచూ ప్రతిస్పందింతురు. అందించిన సాధన మార్గమును మరువక జీవింపుడు. మీకు శుభమగు గాక!" అని శ్రీగురుడు వీడ్కోలు వచనములను పలికెను.

శిష్యబృందము ఆశ్రమమును వీడిరి. కర్మానుసారముగ వివిధ ములైన కార్యములను చేపట్టిరి. పరిణయమాడిరి. సంతతిని పొందిరి.

శిష్యులలో కొందరు క్రమశః దేహావసరములకు లొంగిరి. మరికొందరు కుటుంబ మమకారమునకు లొంగిరి. ఇంకొందరు ధనమునకు లొంగిరి. కొందరు వ్యసనములకు లొంగిరి. కొందరు పదవులకు లొంగిరి. కొద్దిమంది కీర్తికి కూడ లొంగిరి. ఆకాశ గమనము చేయుచూ గురువు అందరి పరిస్థితులను, అవస్థితులను గమనించుచునే యున్నాడు. ప్రతి శిష్యుడు ఏదో ఒక ఆకర్షణమునకు లొంగియుండెను. కొందరు సాధన మానివేసిరి. మరికొందరు అంతంత మాత్రముగ చేయుచుండిరి. ఒకడు ఆకర్షణకు లొంగి యున్నప్పటికిని సాధన నిరంతరము సాగుచునే యున్నది. వారున్న స్థితిగతుల నుండి బయల్పడుటకు శ్రీ గురుడు అందరికినీ శక్తి ప్రసారం గావించెను. అది కారణముగ కొందరు సాధనను పునః ప్రారంభము చేసిరి. మరికొందరికి సాధనయందు అంతరాయము తగ్గినది. నిరంతర సాధన చేయుచున్న శిష్యునికి సంఘమున ఆకర్షణ పెరిగినది. అతని చుట్టునూ మనుషులు చేరుట, సలహాలను పొందుట మొదలై క్రమశః ఒక ప్రాంతీయ గురువైనాడు. అతనికి అనుయాయు లేర్పడినారు. వందిమాగధులు ఏర్పడినారు. పొగడ్తలు పెరిగినవి. సేవకులు, పరిసేవకులు పెరిగిరి. వైభవములు పెరిగినవి. అంతయూ గురువుయొక్క అనుగ్రహమని మొదట భావించినాడు.

తన చుట్టును గల వైభవమునకు కొంత లోబడినాడు. కాని, ప్రతి నిత్యము సాధన చేయుచూ గురుకృపను కోరుచునే యున్నాడు.

ఆకాశ గమనమును గూర్చి గురుని బోధ జ్ఞప్తికి వచ్చినది. అది తనకు సిద్ధించలేదు. ఆలోచింపగా తన చుట్టునూ ఏర్పడిన వైభవమునకు తా నాకర్షితు డగుటచే బంధింపబడినట్లు తెలిసినది. తన అంతరాంతరాళములో ఈ వైభవము తాను కోరినదే యని తెలిసినది. తాను కోరినది తనకిప్పుడు బంధమై తోచినది.

గురుని ఆర్ద్రతతో విముక్తికై ప్రార్థించెను. శ్రీ గురుడు స్వప్నమున దర్శనమిచ్చి "మనసున విచారించి విచక్షణతో దాటవచ్చునని యంటివి కదా! విచారణము చేయుము. విచక్షణ చేయుము. విచారింపకుము." అని తెలిపి, చిరునవ్వుతో అదృశ్య మయ్యెను.

శిష్యుడు తీవ్రముగా విచక్షణతో దాటుటకు ప్రయత్నించెను. కొంత తడవు మాత్రమే తన సంకల్ప బలముతో ఆకర్షణలను అధిగమించ గల్గెను. కాని, మరల ఆకర్షణలు క్రమ్ముకొనుచుండెను. ఇట్లు కొంతకాలం జరుగగా కేవలం తెలియుట చాలదని, మరియేదో శక్తి సహకారం చేయవలెనని తెలిసినది. తన బలహీనతను మొరపెట్టుకొనుచూ గురుమూర్తిని ధ్యానించెను. స్వప్నమున గురుదర్శన మయ్యెను. శిష్యు నుద్దేశించి గురువు యిట్లనెను. "మనసుతో నిగ్రహించి భూమ్యాకర్షణను అధిగమించుట వీలుపడదని

అనుభవమున తెలిసినది కదా!", "తెలిసినది ఇప్పుడు నేను చేయవలసినదేదో తప్పక తెల్పుడు" అని శిష్యుడు పలికెను.

"ఆకర్షణలను ఉపసంహరింపుమని భూదేవిని కోరుము. ఆమె ఉపసంహరింపనిచో నీవు అధిగమించలేవు. నిజమునకు ఆమె ఉపసంహరించుటయే నీ వధిగమించుటగా కనిపించును. నాకై దాటలేను. నీవే దాటించుము అను ప్రార్థన త్రికరణశుద్ధిగ సాగవలెను. ప్రార్థన యందలి శుద్ధి, ఆర్తి, ఆవేదనను బట్టి సిద్ధి కలుగ గలదు. భూలోకమునందే కాదు, ఏడు లోకముల యందు కూడ యిట్టి ఆకర్షణలు గలవు. నీకై దాటుటకు వీలుపడదు. నేనుగ దాటుదును అనుట అహంకారమునకు చిహ్నం. నీవు దాటిపొమ్మని అమ్మను ప్రార్థించుట వినయమునకు చిహ్నం. మార్గం వినయవంతులకే, యితరుల కది దుర్గమము. అహంకార పడక, వినయము నూతగ గొని దుర్గ నాశ్రయించి దాటింపు మనుము. ఆమె మాయ నుండి లేక ఆకర్షణ నుండి ఆమెయే నిన్నుద్ధరించును. అని పలికి గురు డదృశ్యుడయ్యెను.

నిద్ర లేచిన శిష్యునకు హృదయముననే "మమ మాయా దురత్యయా" అను గీతా శ్లోకం చెవులలో గింగురుమనెను. హృదయమున ధ్యానం సాగెను. వినయ నయనుడు అయ్యెను.

38

# గుండ్రాయి

గురు ఆశీః ఫలితముగ శిష్యుడు సంఘమున అతి పెద్దవాడయ్యెను. అమితమైన ధనము, అధికారము, అనుకూలమగు కుటుంబము ఏర్పడెను. అంతయు గురుకృపయని భావించి ఆశ్రమమునకు ధనము, బంగారము విరివిగ పంపెను. సేవకులు గురువుని దర్శించి వినయముతో కానుకలు సమర్పించిరి. గురువు మిక్కిలి ప్రేమతో శిష్యుని యోగక్షేమములు కనుగొనెను.

“అతడు వచ్చిన నాకెక్కువ సంతోషము కలిగెడిది. తాను రాలేదు. కానుకలు మాత్రం వచ్చినవి, అవియును విరివిగ వచ్చినవి. సంతోషం” అని పలికి గురువు ఒక నల్లని గుండ్రాయిని తీసి శిష్యుని సేవకులకు యిచ్చెను. దానిని తన శిష్యునకు యిమ్మని తెలిపెను.

సేవకులు తిరిగి వచ్చి తమ స్వామికి సమస్తమును తెలిపి, గురువు యిచ్చిన గుండ్రాయిని అందించినారు. “ఆశీర్వచన

మేమియును పంపలేదా? ఈ గుండ్రాయి నాకెందులకు? దీనిని సమీపమునగల నదిలో పారవేయుడు" అని కోపమున పలికెను. సేవకులు గురువు యిచ్చిన గుండ్రాయిని నదిలో పారవేసిరి.

కొన్ని సంవత్సరముల తర్వాత శిష్యుడు ఆశ్రమమునకేగి, గురువునకు నమస్కరించి ఆర్ద్ర హృదయముతో యిట్లనెను. "తమ అనుగ్రహము పొందుటకు వచ్చితిని, నేను రాకపోతినని మీరు ఆగ్రహించి నట్లున్నారు. నన్ననుగ్రహింపుడు. మీ దాసులలో ఒకనిగ చూసుకొనుడు." గురువు నవ్వుతూ "అనుగ్రహమే నా స్వభావం. ఆగ్రహ మెప్పుడునూ లేదు. ఎవరిపైనను వుండదు. నిన్ను హృదయ పూర్వకముగా అనుగ్రహించినాను. నిన్ను అనుగ్రహించుటకై గుండ్రాయిని పంపితిని. దానిని పరిశీలించి చూసితివా?" అనెను.

శిష్యుని గుండెలు గతుక్కుమనెను. మౌనం వహించెను. "అది గుండ్రాయివలె కనిపించును. కాని, గుండ్రాయి కాదు. అది అత్యద్భుతమగు చింతామణి, అమ్మ నాకొసగినది. నీపై ప్రేమ కారణముగ నీకిచ్చితిని. అది ఏమి చేసితివి?" శిష్యుడు హఠాత్తుగ లేచి నదివైపునకు పరిగెత్తెను. నదిలో గుండ్రాయికై వెదికెను. కనపడలేదు. మరింత లోతులలో వెదికెను. అయినను కనపడలేదు. ఇప్పటికినీ వెతుకుతునే యున్నాడు.



39

# కోతిమూకలు

**క**లి పురుషుడు తన రాజ్యసభలో సింహాసనారూఢుడై యున్నాడు. కలి ప్రభావం ఎట్లు పనిచేయుచున్నదో వార్తాహరులచే వినినాడు. సభాసదు లందరూ ఆనందముతో పొంగినారు. కలి నుద్దేశించి జయజయ ధ్వనులు గావించినారు. కర్తవ్యోన్ముఖు లగుటకు సందేశ మడిగినారు.

కలి గంభీరుడై యిట్లనెను. “మీరు తెలుపుచున్న కలిప్రభావం నాకు తృప్తి కలుగుట లేదు. మన రాజ్యము నింకనూ పటిష్ఠము చేసుకొనవలెను. విశ్వాసములు, సంప్రదాయములు, సిద్ధాంతములు, మతములు లెక్కకు మిక్కిలిగ యింకను పెరుగవలెను. వానిమధ్య సామ్యముండకూడదు. వివిధ అభిప్రాయములతో పరస్పర విరోధ ములు కలిగి యుండవలెను. అన్నిటికిని మించి మనిషికి స్వంత ముగ ఆలోచించుకొను సమయము బొత్తిగా లేకుండా చేయవలెను. ఆత్మ పరిశీలనమునకై వానికి తీరుబడి యుండరాదు. మీ కందరకును నా శుభాశీస్సులు.”

కలి సేనలు విజృంభించి పనిచేయుచున్నవి. ఎవరి మతము వారిది. ఎవరి సిద్ధాంతము వారిది. ఎవరి అభిప్రాయము వారిది. ఒకరికొకరికి పడక కల్లోలము లేర్పడినవి. విధ్వంసము, మారణ హోమము దైనందిన కార్యక్రమములైనవి. కలి సంతసించెను. మరల సభ ఏర్పాటు చేసెను.

సభలో వార్తాహరులు యిట్లు తెలిపిరి. "మానవులలో కొందరు బృందజీవనము లేర్పరచుకొను చున్నారు. కృష్ణ దందించిన బృందావన జీవనము మరల మరల అభ్యాసవశమున జీవుల కేర్పడుచున్నది. ఇంత కలి ఇంద్రజాలమున కొందరు ఏకాంత ధ్యానము చేయుచున్నారు."

కలి ప్రతిస్పందించుచూ "నా కాలమున బృందములు నామ మాత్రములే. అందు సమైక్యత, ఆనందము నేతి బీరకాయలోని నేయి వంటివి. ఈ బృందముల వలన నాకు భయము లేదు. వేల సంవత్సరముల నుండి వారి ప్రయత్నము ప్రయత్నముగనే మిగిలి పోయినది. నిజమునకు బృందజీవనము స్థాపించినది వసుదేవుడు. ప్రోత్సహించినవాడు వాసుదేవుడు. ఈ బృందములన్నియూ కోతిమూకలు. ఈ మూకల వలన నాకు భయము లేదు. ఏకాంతు లని చెప్పినారే వారిని గూర్చి మనము కొంత జాగ్రత్తపడవలెను. వీరు ఆత్మపరిశీలనము, అధ్యయనము గావించి అటుపై ఆత్మాను సంధానము చేయగలరు. అట్టివారు సిద్ధాంతముల నుండి మేల్కాంచి సత్యదర్శనము చేయగలరు. అప్పుడు వారిపై కలి ప్రభావము

ప్రసరించదు. వారి ఏకాంతమును భంగము చేయవలెను. ఆత్మ ప్రతిబింబమే సృష్టి. ప్రతిబింబమే బింబమను భ్రమలో జీవులున్నంత కాలము మనకు భయము లేదు. ప్రతిబింబములతో మిథ్యాక్రీడ జరుగవలెను. అప్పుడే మన సామ్రాజ్యము పటిష్ఠమగును. ప్రతిబింబ ములకు కూడ బింబము లుండునని కలియుగమున అద్దము లేర్పరచితిని. ఏకాంతులకు అద్దము లేర్పరుచుడు. వారు ప్రతి బింబించునట్లు శత విధముల ప్రయత్నించుడు." అని సందేశ మిచ్చెను.

జయజయ ధ్వనులు చేయుచూ అనుయాయులు నలుదిశలా సాగిరి.

ఆకసమున సమస్తమును గమనించుచున్న శ్వేతబృంద అధిపతి మైత్రేయులు బృందముల నుద్దేశించి చిరునవ్వుతో యిట్లనెను. "చతుర్దశ భువనంబులు హడలెత్తించిన రావణుని వినాశనమునకు హేతువు కోతిమూకలే! మన కోతిమూకలకు కూడ అట్టి అవకాశము రాగలదు, కార్యోన్ముఖులై వేచియుండుడు."



# 40

## జరిగిన కథ

సౌకుమార్యుడు ఈశాన్యదిశగా ప్రయాణం చేస్తున్న సందర్భంలో అనుయాయి అయిన సోదరి ఇలా పలికింది. "హితుడా! మనము పోవుచున్న ఈ దారిలో మనకొక మహానగరము తారసిల్లును. అచటొక లోకహితుడు నలుబది సంవత్సరముల నుండి అద్భుతముగ రోగ చికిత్స చేయుచున్నాడు. అతనిని మీరు దర్శించినచో బాగుండును."

సౌకుమార్యుడు "ఎవరికి బాగుండును? నాకా, నీకా లేక ఆ లోకహితునికా?"

"అందరికిని బాగుండునని నా అభిప్రాయము."

"అందరిని గూర్చి నీ వెట్లు చెప్పగలవు? నాకును, లోకహితునికి బాగుండునో లేదో నీవెట్లు నిర్ణయించగలవు? నీకు బాగుండును గనుక అందరికిని బాగుండునని భావించుచున్నావు. మనకి నచ్చినది అందరికి నచ్చనక్కరలేదు. ఇది తెలియుట చాల ముఖ్యము. పెద్దలనుకొనువారు కూడ ఈ విషయమున పొరపడుచుందురు. ఇట్లు పొరపడి ఇతరులకు కూడ నిర్ణయములు చేయుదురు."

"క్షమార్హురాలను. నాకు బాగుండునను విషయము సత్యము. మీకు బాగుండుట, బాగుండకపోవుట లేదు. మీరు సమవర్తులు. ఇక లోకహితుని విషయము కనుగొని తెలిపెదను."

"సమయము వచ్చినపుడు నేనే తెలిపెదను. నీవు త్వరపడ వలదు."

× × × ×

పై సంఘటన జరిగిన ముప్పది నెలలకు మరల అదే మార్గమున సౌకుమార్యుడు తన అనుయాయులతో యాత్ర సలుపు చుండెను. అందు ముందు తెలిపిన అనుయాయి కూడ ఉన్నది. ప్రయాణము మౌనముగ సాగుచున్నది. వాహనమున సౌకుమార్యు నితోపాటు నలుగురు అనుయాయు లుండిరి. సౌకుమార్యుడు అర్ధనిమీలిత నేత్రుడై యుండెను. అతడు కనులు తెరిచి ముందు తెలిపిన అనుయాయిని చూచి చిరునవ్వుతో ఇట్లనెను.

"సోదరీ! నీవు తెలిపిన లోకహితుడు క్షేమమేనా? ఈ రోజు శుక్రవారము. మనము నిర్వర్తించబోవుచున్న సహజీవనము పై శుక్రవారము మధ్యాహ్నమునకు పూర్తియగును. తిరుగు ప్రయాణ మున శుక్రవారము సాయంత్రము నీవు తెలిపిన లోకహితుని దర్శించెదను. ముప్పది నెలల క్రితము నీయందు ఉద్భవించిన సంకల్పము కార్యరూపము దాల్చుటకు సమయ మాసన్నమైనది. నీవతనితో సంప్రదించి పై శుక్రవారము సాయంత్రమునకు సమావేశమున కేర్పాటు చేయుము."

అనుయాయి ఇట్లనెను. "హితుడా! మీ ప్రవర్తనము నా కాశ్చర్యము కలిగించుచున్నది. ఈ ముప్పది నెలలు మీరెన్నడూ పై

విషయమును గూర్చి పలుకలేదు. అకస్మాత్తుగా ఇపుడు మరల ఆ లోకహితుని ప్రస్తావన తెచ్చినారు. మీరే నిర్ణయము చేసినారు. ఈ నిర్ణయము సున్నితమైన సౌకుమార్య దౌర్జన్యముగ నున్నది. నేను తెలిపిన లోకహితునికి మీ రాక నచ్చునో నచ్చదో అను ప్రశ్నయొకటి ఉన్నది. నచ్చినను మీరు నిర్ణయించిన సమయము అతనికి వీలగునో కాదో అనునది రెండవ ప్రశ్న."

"సమయము వచ్చినది గనుక అన్నియు సానుకూలమే అగును. ఇదివరకు నీవు కోరినపుడది సమయము కాదు. ఇపుడు సరియగు సమయము" అని సౌకుమార్యుడు తెలిపెను.

"ఇపుడసలే కాదు". అని అనుయాయి నిర్దిష్టముగ పలికెను. మరల యిట్లనెను. "ఇదివరకు మీతో లోకహితుని గూర్చి తెలిపినపుడు మీరంగీకరింపలేదు. అటుపైన కొన్ని దినముల తరువాత నేనాయనను కలిసినపుడు మిమ్ములను గూర్చి తెలిపితిని. మీ ముఖచిత్రమును చూపితిని. ఆయన మిమ్ములను గూర్చి అవహేళనగ భాషించినాడు. నేను బాధపడితిని. మీరపుడు పలికిన పలుకులు (మన రాక లోకహితునికి నచ్చునో, నచ్చదో) జ్ఞప్తికివచ్చి మీ బుద్ధి వైశాల్యమును ప్రశంసించుకొంటిని. మీకీ విషయము తెలుపుట కిష్టము లేక మౌనము వహించితిని. మీ రాక అతనికి ఇష్టము లేదు."

"ఇష్టాయిష్టములతో పనిలేదు. అతనికి నచ్చినను, నచ్చకున్నను అతనిని చూచుట తథ్యము. అవసరము కూడ."

"ఎవరి కవసరము? మీకా, అతనికా? నాకు మాత్రము కాదు."

"అతనికే అవసరము. నీవు అతనిని సంప్రదించిన నీ కన్నియు అవగతము కాగలవు."

అనుయాయి సౌకుమార్యుని భాషణమునకు ఆశ్చర్యము చెందెను. సౌకుమార్యుని కనులలోనికి జూచెను. అతడు శాంత గంభీరుడై యుండెను.

× × × ×

రెండు దినములు తరువాత అనుయాయి సౌకుమార్యుని వద్దకు వచ్చి నమస్కరించి ఇట్లనెను. "మీరు తెలిపిన ప్రకారముగ పై శుక్రవారము సమావేశ మేర్పాటైనది. లోకహితుడు మీ రాకకు ఆర్ద్రతతో ఎదురు చూచుచున్నాడు. మీ విషయమున భక్తి ప్రపత్తులతో నున్నాడు. ఇదియంతయు నాకు అగమ్య గోచరముగ నున్నది. ఇది వర కవహేళన చేసిన వ్యక్తియే ఇపుడార్ద్రతతో ఎదురు చూచుటేమి ?"

సౌకుమార్యుడు నవ్వుచు "అంతయు దైవవిలాసము, అతడును సత్సాధకుడే. అతనికి నా అవసరము ఇపుడు తెలియును. అపుడు తెలియదు. కావుననే అతని ఆర్ద్రత."

సహజీవనము పూర్తియైన తరువాత సౌకుమార్యుడు బృందమునకు వీడ్కోలు పలికి తన అనుయాయులతో లోకహితు డుండు నగరమునకు ప్రయాణమయ్యెను. ఆయన శిష్యురాలు ప్రయాణమున మరల సంభాషణ ప్రారంభించెను. "హితుడా! నీకొక విషయము తెలుపలేదు. నేను తెలిపిన లోకహితుడు రోగగ్రస్తుడై

సంవత్సర కాలము నుండి మంచము పట్టినాడు. ఎవ్వరిని చూచుట కిష్టపడుట లేదు. నేను సన్నిహితురాల నైనప్పటికి, నాకు కూడ అతడు దర్శనమున కనుమతీయలేదు. కాని అపరిచితులైన మీకు అనుమతియే గాక సాదరాహ్వానము గూడ లభించినది. రెండు సంవత్సరముల క్రితము మిమ్ములను అవహేళన చేసిన వ్యక్తి సంవత్సరము వెనుక రోగ గ్రస్తుడయ్యెను. మీ రాకకై ఎదురు చూచుచున్నాడు. అతని అస్వస్థత మీకు తెలియునా? ఎవ్వరిని చూచుటకు ఇష్టపడని మనస్సు అపరిచితులైన మిమ్ములను చూచుటకు ఉవ్విళ్ళూరుచుండుట ఏమి?"

"ఎంత చదివినను, ఎంత సాధన చేసినను, ఎంత నాతో అనుగమనము చేసినను మీకందరికిని స్థూల విషయ గ్రహణమే తప్ప, సూక్ష్మ విషయ గ్రహణము జరుగుట లేదు. దృష్టిని స్థూలము నుండి సూక్ష్మమునకు మరల్చినచో అనేక విషయములు తెలియును. సమస్యలకు పరిష్కారములు కూడ తెలియును. నీవు తెలిపిన లోకహితుడు నాకపరిచితుడు కాడు. సుపరిచితుడే. అది యెట్లు అని మరల ప్రశ్నింపకుము. అతడు సూక్ష్మలోకమున నాకు సన్ని హితుడు. స్థూలలోకమున అతనికి నేను తెలియదు. స్థూలమున సన్నిహితులందరు, సూక్ష్మమున సన్నిహితులు కానవసరము లేదు. సూక్ష్మమున సన్నిహితులు స్థూలమున దూరతీరములలో నుండ వచ్చును. లోకములను బట్టి దూరము, దగ్గర మారుచుండును. నీ హృదయమున నీవు నన్ను ఆరాధించునపుడు, నీ హృదయస్థుడుగ నీ దగ్గరవాడనే. కాని భౌతికముగ నేను విదేశీయుడను. పరదేశీయు డను. ఆత్మసాధన సూక్ష్మాతి సూక్ష్మలోకములకు సంబంధించినది.

కేవలము స్థూలమగు విషయములను పట్టించుకొనుచు నిర్ధారణ చేయుట మానుము. సూక్ష్మమున కెదుగుము. నీ యందు పుట్టు సమస్తమగు ప్రశ్నలకు సమాధానము నీయందు గల నేను తెలుపును.”

అనుయాయియందు కొంత మౌన మేర్పడెను. అటుపైన ప్రయాణమున ఆమెకు నిద్ర కలిగినది. మరి ప్రశ్నలు లేవు.

సౌకుమార్యుడు అనుయాయులతో లోకహితుని గృహము చేరెను. ముఖద్వారమున లోకహితుని దత్తపుత్రిక చిఱునవ్వుతో, ప్రశాంత వదనముతో స్వాగతము పలికినది. సౌకుమార్యుడు ఆశీః పూర్వక దృష్టితో ఆమెను పలకరించి లోనికేగినాడు. అనుయాయి కూడ తనవెంట లోనికి వచ్చినది. దత్తపుత్రికను ప్రశంసిస్తూ సౌకుమార్యునికి పరిచయము చేసినది. సౌకుమార్యుడు మౌనముగ తలూపుచు లోనికేగెను. సరాసరి లోకహితుడున్న గదిలోనికి ప్రవేశించెను. అతడు పక్షవాతముతో మంచమున నుండెను. నమస్కరించుటకు ప్రయత్నించెను. కుడిచేయి లేవలేదు. సౌకుమార్యుడు సుకుమారముగ అతని కుడిచేతిని లేవదీసి నమస్కారముద్రను పరిపూర్తి గావించుచు, అతని కన్నులలోనికి చూచి నవ్వెను. లోకహితుని కన్ను లశ్రుపూరితము లైనవి. గొంతు గద్గదితమైనది. అత్యంత ప్రయత్నమున యిట్లు పలికెను.

“లోకహితునకు వేయి నమస్కారములు. మీ రాకతో నా జీవనము పావనమైనది. మీ స్పర్శతో దేహము తేలికైనది. మీ చూపులనుండి నా సద్గురువు దర్శనమిచ్చుచున్నాడు. అతడు హిమాలయవాసి. దివ్య శరీరుడు. మీ నుండి అతని దర్శనము

లభించుట అనుగ్రహము. మీరు తప్పక వారి సన్నిహితులై యుండ వలెను. అతడే మిమ్ములను నాకడకు పంపి నాకేదో ప్రయోజనము నందించుటకు సంకల్పించినట్లుగ గోచరించు చున్నది. మీరును తప్పక హిమాలయ వాసియే అయివుండవలెను. ఎక్కువగ మాట్లాడితిని. క్షమార్హుడను. ముందుగ మీరు నన్ను క్షమించితినని వాగ్రూపమున తెలుపుడు. అటుపై మీ సందేశమును తెలుపుడు. మీకుగ మీరు వచ్చుటకు సంకల్పించిరి. పిలువని పేరంటము సత్పురుషులే చేయుదురు. వారి రాక జీవులకు ఆశీః ప్రదమే. నేను మదముచేత, అహంకారము చేత, అజ్ఞానముచేత మిమ్ములను అవగాహన చేసుకొనలేక అవహేళన చేసితిని. అందులకై మీ పాదములకు నమస్కరించి క్షమింపుడని వేడుకొనుచున్నాను.

సౌకుమార్యుడు మందస్మితము చేసి లోకహితుని కుడిభుజముపై స్పృశించి కనులలోనికి చూచి ప్రసన్నముగ ఇట్లు పలికెను. “నీ యూహ సరియైనదే. నీ సద్గురువు నాకు చిరపరి చితులు. మిత్రులు, సన్నిహితులు. వారి స్ఫూర్తితో నీవు పదుల సంవత్సరములు చక్కని సేవ గావించుచు, సంఘము మన్నలను పొందుచున్నావు. లోకహితునిగ సంఘమున ప్రశంసింపబడు చున్నావు.” సౌకుమార్యుడిట్లు ప్రసంగించు చుండగ లోకహితు డడ్డు తగిలి ఇట్లనెను.

“నిజమునకు లోకహితులు మీరు. నేను సాధకుడనే. నేను లోకహితుడనని భ్రమపడితిని. మీరు లోకహితుడా! అని నన్ను సంబోధించినపుడు నా హృదయము కలవరము చెందినది. సంఘ మట్లు పిలుచుటచేత లోకహితుడనని అనుకొంటిని. సంఘము

గుర్తింపునకు లొంగితిని. మీరు నన్ను 'హరిమనీకుడు' అని పిలువుడు. అది నాకు తల్లిదండ్రులు పెట్టిన పేరు. అదియే నాకు సముచితము."

సౌకుమార్యుడు నవ్వుతూ రోగగ్రస్థుడ వగుటచే నీయందు ఆత్మ పరిశీలనము జరుగుచున్నది కాబోలు! మంచిదే నిన్ను హరిమనీకుడనే పిలిచెదను.

హరిమనీకుడి కన్నుల వెంట నీరు ధారగ స్రవించినది. ఇట్లు పలికెను. "మీ కనులనుండి ప్రసరించు వాత్సల్యపూరిత కిరణములు నా కన్నులద్వారా హృదయ కవాటమును చేరి ఒక సున్నితమైన స్పర్శను అందించి రోగముతో సంబంధములేని సుఖ మేర్పడుచున్నది. నన్నింతగ అనుగ్రహించినందులకు శతకోటి ప్రణామములు. ఇంతకును నా సద్గురువు పంపిన సందేశమేదియో వినిపింపుడు. వినుటకు ఆత్రుతగ నున్నది."

సౌకుమార్యుడు : రోగగ్రస్థు డయినప్పటి నుండి నీవు చాలా కినుక వహించినావట? సద్గురువుపై ఆరోపణలు చేయుచుంటివట? పదుల సంవత్సరములు నీవొనర్చిన సేవకు నీకందించిన పారితోషకము రోగగ్రస్థ శరీరమా? అని అడుగుచుంటివట.

హరిమనీకుడు : అవును. నా మనసు దుఃఖించుచున్నది. దేహబాధ తీవ్ర మగుచున్నది. ఒకింత ఉపశమనము కూడ అందుట లేదు. నిజముగ నాయందు ప్రేమ యుండినచో నా గురుదేవుడు ఈ బాధనుండి తరింపు కలిగించెడివాడు. వేచి వేచి, విసిగి విసిగి వేసారితిని. భరించలేక కోపము చెందితిని. కోపము కారణముగ ఆరోపణలు మనసుయందు ఉప్పెనలవలె వచ్చుచున్నవి. హిత

కార్యముల నొనర్చుచున్న నాకు ఇట్టి దురవస్థ ఎందుకు కలుగ వలెను? ఈ పక్షవాతపు రోగము నాకెందుకు రావలెను?

సౌకుమార్యుడు గంభీరుడై ఇట్లనెను. నాకు రోగ మెందుకు రావలెను? నాకీ దురవస్థ ఎందుకు కలుగవలెను అని నీవు ప్రశ్నించుచున్నావు. నీ ప్రశ్నకు నేను సూటియైన సమాధానము చెప్పెదను విందువా?

హరిమనీకుడు : తప్పక వినెదను. వినిపింపుడు.

సౌకుమార్యుడు : అయినచో వినుము. నీ ప్రశ్నలకు నా ప్రశ్నలే సమాధానము. నీకు రోగమెందుకు రాకూడదు? నీకు దురవస్థ ఎందుకు రాకూడదు? అట్లు రాకుండుటకు నీ గొప్పతన మేమి? సాధుజనులు గూడ దుఃఖము ననుభవింతురు. అది నీకు తెలియని విషయము కాదు. వారు సాధుస్వభావులు కనుక జీవిత మున పొందు దుఃఖములను ఓర్పుతో భరింతురు. దైవమును, గురువును దుఃఖముల కారణముగ దూషింపరు, నిందింపరు, ప్రశ్నలు వేయరు. నీయందట్టి సాధు స్వభావము లేదు. కష్టములను భరించు ఓర్పులేదు. క్షమలేదు. సద్గురువును గూర్చిన అవగాహన లేదు. మంచిపనులను చేయుచున్నానని, మంచివాడనని అహంకారము మాత్రము కొండంత ఉన్నది. ప్రారబ్ధ కర్మ కూడ నీ అహంకారమునకు సరిసమానముగ నున్నది.

అని తెలిపి సౌకుమార్యుడు మౌనము వహించెను.

హరిమనీకునకు తల తిరిగినట్లయ్యెను. సౌకుమార్యుడు పలికిన సూటియగు మాటలు అతని అహంకారమును ఛేదించెను.

అతడు ఇట్లాలోచింపసాగెను. "ఈత డిట్లు తెలుపుట కొంత కఠినముగ నున్నను సత్యమున్న దనిపించుచున్నది. నిజమే, నాకు అహంకారము ఎక్కువ. సాధుత్వము తక్కువ అని ఇపుడు తెలియుచున్నది. సంఘ ప్రశంసలకు లోబడి నన్ను నేను ఎక్కువగా భావించితిని. మదించిన అహంకారముతో సద్గురువును దూషించితిని. ఇది అజ్ఞానమే గదా! ఈ మహాత్ముడు తెలిపినట్లు ప్రారబ్ధకర్మ వలననే ఈ రోగము సంభవించినది అని సమాధాన పరచుకొను చుండెను. ఇంతలో అతని స్వభావము నుండి మరియొక ప్రశ్న పుట్టెను. దానిని సౌకుమార్యుని కిట్లు వివరించెను.

"ఆర్యా! అనేక జన్మల కర్మములు సద్గురువు తన జ్ఞానాగ్నిచే భస్మము చేయునని చదివితిని. నా గురుదేవులు నన్నెందుకట్లు అనుగ్రహించలేదు? నాపై అట్టి కరుణ ఎందుకు ప్రసరింప జేయలేదు? మిమ్ములను ప్రశ్నించుచున్నానని భావించవద్దు. నా సందేహ నివృత్తికై ప్రాధేయపడుచున్నాను."

సౌకుమార్యుడు : శరీరము, మనస్సు, వాక్కు ద్వారా నిర్వర్తింపబడిన కొన్ని కర్మలు అనుభవించడము వల్లనే పోగొట్టుకొన గలరు. కొన్ని కర్మలు ప్రాయశ్చిత్తము చేసుకొనుటవలన నశించును. మరికొన్ని కర్మలు తపస్సుచేత దహింపవచ్చును. ఇందు సద్గురువు దహించు కర్మలు అతని తపోబలంచేత దహింపబడుతూనే వున్నాయి. అహంకారి వగుటచే నీ తప్పులు నీవు తెలియక ప్రాయశ్చిత్తము నీవు చేయవు. కావున ఒకటి, రెండు తరగతుల కర్మలు నీకు నీవుగ అనుభవించి పరిష్కరించుకొనవలెను. తద్వారా నీకు వినయము, ఓర్పు, శాంతి, భూతదయ సిద్ధులుగ ఏర్పడును. కష్టము లనుభవింపనివానికి ఈ సిద్ధులు లభింపవు. నీ యందు కృప,

ప్రేమ కలిగిన సద్గురువు, పై తెలిపిన సిద్ధులను నీవు పొందుటకు తోడ్పడును. తన సహాయ సహకారములు సూక్ష్మముగ నీ కందించి నీ కర్మలను నీవు అనుభవించి క్షేమముగ బయట పడుటకు అతడెప్పుడును సహాయము చేయును. నీవు ఆరోపణలు చేయుట, దూషించుట, ప్రశ్నించుట కారణముగ సద్గురువును ఉన్ముఖము చేసుకొనజాలకున్నావు. గుర్తుంచు కొనుము. మీ కర్మలు మీరే అనుభవించవలెను. సద్గురువు మీకు సన్నిహితుడుగ, స్నేహితుడుగ సహాయపడునేగాని మీ సేవకునిగ భావింపకుడు. అతనికిష్టమైనచో శిష్యులకు సేవచేయును కూడ. కాని అతడు మీకు సేవ చేయలేదని ఆరోపించుట అహంకారము. ఈ అహంకారమును నీవు తక్షణము వీడుము. నీ నిజస్థితి నెరుగుము. వినయము నాశ్రయించి నీ కాలమంతయు ధ్యానమున కుపయోగించుము. సద్గురువును ఉన్ముఖుని చేసుకొనుము. ఇది నీకు తెలుపుటకే నా రాక.

హరిమనీకుడు : పై మార్గమున పక్షవాతము నుండి తేరుకుందునా?

సౌకుమార్యుడు బిగ్గరగా నవ్వుచు తేరుకొందువు. తప్పక తేరుకొందువనుచు అతనికి వీడ్కోలు తెలిపి బయటకి వచ్చెను. హరిమనీకుని దత్తపుత్రిక కృతజ్ఞతా భావముతో సౌకుమార్యుని అనుసరించి వచ్చెను. ఆమె వినయముతో ఇట్లు ప్రశ్నించెను. “నా తండ్రి నిజముగ దేహము నుండి తేరుకొనునా? మీరు సర్వజ్ఞులు, నాకు సత్యమును స్పష్టముగ తెలుపుడు.”

సౌకుమార్యుడు : “నీకా సందేహ మెందుకు కలిగినది? అని నవ్వుచు అడిగెను.

పుత్రిక : మీ నవ్వునుండి నాకు కలిగిన భావమిది. అందులకే వేడుకొనుచున్నాను.

సౌకుమార్యుడు : నీవు నిర్మల హృదయవు. నీ తండ్రి నుండి వైద్యవిద్యను స్ఫూర్తితో పొందితివి. నీవు రోగ నివారణా మహాయజ్ఞమును లోకశ్రేయస్సుకు కొనసాగింపుము. నీ తండ్రి సద్గురువే, నీకును గురువు. అతని తోడ్పాటుతో నీవు స్ఫూర్తిమంత ముగ పరహిత కార్యములు చేయగలవు. నీ ద్వారా నీ తండ్రి యొనరించిన మహాయజ్ఞము శోభాయమానముగ కొనసాగును. నీ వినయము, నీ నిర్మలత్వము పదిలముగ కాపాడుకొనుము అని పలికెను.

పుత్రిక : మీ సందేశము ద్వారా నేనడిగిన ప్రశ్నకు సమాధానము తెలుపకయే తెలుపబడినది. మీరొసగిన ఆశీర్వచనము హృదయస్థమైనది. తప్పక మీ సందేశమును శాసనముగ భావించి జీవింతును. మరియొక చిన్న సందేహము- అడుగవచ్చునా? సౌకుమార్యుడు మందస్మితము చేయుచు, వాహనము నెక్కి అడుగుము అనెను. నా తండ్రి సద్గురువు, మీరు ఒకటే అనిపించు చున్నది. మీరే నా సద్గురు వనిపించుచున్నది. దయతో తెలిపి నాలోని కలవరమును తీసివేయుము.

సౌకుమార్యుడు మందహాసము చేయుచు "నీ వన్నట్లే" అనెను. వాహనము సాగిపోయెను.

# 41

## చేదు నిజం

**అ**శోకుడు రాజ్యాభిషేకము జరిగిన రోజది. యువరాజు చక్రవర్తి అయినాడు. వజ్రవైడూర్యాలతో, మణిమాణిక్యాలతో కాంతులు విరజిమ్మే అపురూపమైన రాజమకుటం అతని శిరస్సు నలంకరించింది. ఆ సమయంలో వేదఘోషలు మిన్నుముట్టాయి. రాజ పురోహితులు మకుటాన్ని శిరస్సుపై అలంకరించి రాజఖడ్గాన్ని, ధర్మదండాన్ని చేతుల కందించారు. శోభాయమానమైన మౌర్య సామ్రాజ్య సింహాసనంపై అశోకుడు చక్రవర్తిగ ఆశీనుడయ్యాడు.

అతని మనస్సు పొంగింది. చక్రవర్తిననే భావం మనస్సులో నిండింది. ఠీవిగా కుడిపాదం పీఠిక మీదుంచి, రాజసభ నుద్దేశించి ప్రసంగించాడు. సభలోని ప్రజలు హర్షధ్వానాలు, జయజయ ధ్వానాలు గావించారు. సాయంకాలము అశోకచక్రవర్తి పాటలీ పుత్రంలో ఊరేగింపబడ్డాడు. పాటలీపుత్ర మహానగరమంతా శోభాయమానంగా తీర్చిదిద్దబడింది. రాచబాటలన్నియు దేదీప్య కాంతులతో నగరాన్ని ప్రకాశింపజేస్తున్నాయి. ఆనంద ఉత్సాహాలతో నగరమంతా అర్ధరాత్రి వరకు సంబరాలతో మేలుకొనే ఉన్నది.

చక్రవర్తి అంతఃపుర ప్రవేశం చేసి తనకై ప్రత్యేకముగ అలంకరింపబడిన విశ్రాంతిగదిలో ప్రవేశించాడు. ఆ గదిలో ఒక పెద్ద అద్దమున్నది. అద్దమునందు తన్నుతాను చూచాడు. తలపై కిరీటము, దేహముపై రాజదుస్తులు, రాజలాంఛనములు మనసారా చూచుకున్నాడు. అద్దము ముందే కూర్చొని దర్పంగా రాజమకుటాన్ని తీసి ప్రక్కన పెట్టాడు.

ఇంతలో అద్దము నుండి ఒక నగ్నస్వరూపుడు కనిపించాడు. అతడు అశోకుని చూచి పకపక నవ్వాడు. అతని దర్శనము, నవ్వు అశోకునికి ఆశ్చర్యం కలిగించింది. ప్రశ్నార్థకంగా నగ్నరూపుని వైపు చూచాడు. అపుడా నగ్నరూపుడిలా ప్రశ్నించాడు.

"నీవెవరవు?"

అశోకుడు : చక్రవర్తిని, మౌర్య సామ్రాజ్య చక్రవర్తిని.

సాధువు : నిన్నెందులకు చక్రవర్తిని చేసినారు?

అశోకుడు : నేను వీరుడను, ధీరుడను, ధర్మము నెరిగినవాడను. అందులకే నేను చక్రవర్తినైతిని.

సాధువు : నీవు పిచ్చివాడవు. అమాయకుడవు. మోసపోతివి. నీ చక్రవర్తిత్వము పదవికాదు. నీకు హక్కులేమియు ఉండవు. అన్నియు బాధ్యతలే. నీవు పరతంత్రుడవు. స్వతంత్రము కోల్పోతివి. పాపము, నీకు తెలియ దేమో రాజులకు వ్యక్తిగత జీవనము గూడ నుండదు. నీవు ప్రజలకు, మంత్రులకు బానిసవు. స్వేచ్ఛగా విహరింపలేవు. రఘురాముడందులకే రాజ్యాధికారము కన్న వనవాసము మేలని త్రికరణ

శుద్ధిగ భావించెడివాడు. రఘురాముడు తెలిసిన వాడు. నీవు తెలియని వాడవు. అతడు రాజులకే రాజు. నీవు చక్రవర్తి నని మోజు పడుచున్నావు గాని నీది బానిస జీవనము. మకుటమును, రాజ లాంఛనములను చూచి ఉబ్బిపోవుట పసితనము. ఊరేగింపులకు పొంగుట అజ్ఞానము, అని తెలుపుతు నగ్నసాధువు పకపక నవ్వెను. అశోకునికి తల తిరిగింది. మనసులోని పొంగంతా మాయమైనది. దుఃఖము వచ్చింది. సహింపరాని దుఃఖముతో నేలమీద పొర్లాడు. తన అవివేకమునకు దుఃఖించాడు. ఇపుడు చేయగలిగిందేమీలేదు. అపరి మితమైన బరువు నెక్కించుకొని గర్వించిన తన తెలివికి నివ్వెరపోయి పరిష్కారమునకై అద్దములోనికి చూశాడు. నగ్నస్వరూపుడు ఇలా పలికాడు. “నీవు ధరించు కిరీటము ముళ్లకిరీటమని ఎరుగుము. ధరించినపుడల్లా బాధ్యతాయుతమైన ప్రవర్తనమే కలిగియుండవలెనని భావింపుము. బానిసత్వ మనుకొనక పరహిత మనుకొనుము. ధర్మ నిర్ణయము చేయునపుడు నీ నిర్ణయముగ గాక నా నిర్ణయముగ చేయుము. రాజ ఖడ్గమును వాడునపుడు రఘు రాముని తలచుము. క్రమశః రాజయోగివి కమ్ము.” నగ్నస్వరూపుడు అదృశ్యు డయ్యెను. అశోకుని మనసు దర్పము నుండి బయటపడి సమానత్వము చెందెను.

**42**

# రేపటి భయం

**స**ద్గురువుని సమీపించి ఒక శిష్యుడు ఈ విధముగా ప్రశ్నించాడు.

"గురుదేవా! మానవజాతి చరిత్ర తెలుసుకొన్నకొద్దీ కేవలం ఆకలిదప్పులకే జీవితం అంకితం చేయబడ్డట్లుగ కనిపిస్తుంది. ఎంత తిన్నా, ఎంత పోగేసుకున్నా ఈ జాతికి ఆకలి తీరదు. అధికార దాహం, ధనదాహం ఎప్పటికీ పోవు. ఏమిటీ మాయ? దీనికి పరిష్కారమేమైనా ఉందా?"

సద్గురు వొక్కసారి పట్టువంటి తన గడ్డాన్ని సవరిస్తూ నవ్వుతూ ఇలా తెలిపాడు.

"నేను సంచారం చేస్తున్న సమయాల్లో ఒకానొక రోజున ఒక వింతమనిషిని చూశాను. అతనికి చాలా పెద్ద పొట్ట వున్నది. పొడుగాటి చేతులున్నాయి. విపరీతమైన ఆకారం. దాదాపు 28 అడుగులు పొడుగుంటాడు. అతనెపుడు భూగోళంపై పదార్థాన్ని

తింటూ, సముద్రజలాల్ని త్రాగుతూ ఉంటాడు. ఆ తినటం త్రాగటం నిరంతరం జరుగుతూ ఉంటుంది. ఎప్పటికీ ఆపడు. నేను చాలాసేపు గమనిస్తూ ఉన్నాను. వారం రోజులు గడిచింది. నెలరోజులు గడిచింది. అయినా అతడలా తింటూ త్రాగుతూ ఉన్నాడు. మండలం రోజులు అతనిని పరిశీలనగా చూస్తూ ఉండిపోయాను. అతని వంక చూసి ఇలా అడిగాను.

"భూమంతా తినేస్తున్నావు. సముద్రాన్నంతా త్రాగేస్తున్నావు. అయినా నీకు ఆకలి, దప్పిక తీరుతున్నట్లు కనబడుటలేదు. ఇట్లా ఎంతకాలం తింటావు? నీకు తృప్తి లేదా? ఇట్లా తింటూ త్రాగటానికి విసుగురాదా?"

ఆ వింతమనిషి తినడం ఆపకుండానే నాకీ క్రింది విధంగా సమాధానమిచ్చాడు.

"నీ వడిగిన ప్రశ్నకి సమాధానం ఉంది నా దగ్గర. నిజానికి తృప్తి కలుగుతూనే ఉంది. ఆకలి తీరుతూ వుంది. దప్పిక కూడ తీరుతూ ఉంది."

నేనిలా అన్నాను. "మరి ఆకలి, దప్పిక తీరుతూ ఉంటే అట్లా ఆపకుండా తింటున్నావేం."

"ఒక ప్రక్క తీరుతునే వుంది గాని మళ్ళీ ఆకలి కలుగుతునే వుంది. దాహం వేస్తునే ఉంది."

"ఆకలి, దాహం వేసినపుడు తిని త్రాగొచ్చుగా అట్లా ఎప్పుడూ తింటూ ఉండటం ఎందుకు? త్రాగుతూ ఉండడం ఎందుకు?"

"భలేవాడివే. ఇప్పటికి తృప్తిగా ఉన్నా మళ్ళీ నాకు ఆకలి వేసినపుడు తింటానికుండొద్దూ, త్రాగటానికుండొద్దూ. ఉండవేమో అన్న భయంచేత అట్లా నిరతంరం తింటూ, త్రాగుతూ ఉన్నాను. రేపటి భయమే ఈ రోజు నా కార్యక్రమానికి కారణం. రేపటి సంగతి ఎవరు చెప్పగలరు? దొరుకుతుందో దొరకదో, అందుకే ఈ నిరంతం భోజనం" అన్నాడు.

"ఇంతకీ నీ పేరేమిటిని అడిగాను. దానికతడు నా పేరు ఎం.వి. స్వభావం. అంటే మానవజాతి స్వభావం అన్నాడు."



# 43

## జ్ఞాన పర్యవసానం

గోదావరి పొంగింది. వర్షం కారణంగా వరద గోదావరి అయింది. వరదనీటిలో దూలమొకటి కొట్టుకొస్తోంది. దూలంమీద ఐదు కప్పలున్నాయి. దూలం అతి వేగంగా నది నీటిలో సాగుతోంది. ఒంపులు తిరుగుతూ గోదావరి పారుతూవుంటే దూలం వయ్యారంగా దూసుకెళుతోంది.

ఒక కప్ప ఇలా అంది. మనం చాలా వేగంగా పోతున్నాం. ఇంత వేగంగా ఎప్పుడూ ప్రయాణం చేయలేదు.

రెండవ కప్ప : మొద్దు! నీకు బుద్ధి లేదు. వేగంగా పోతున్నది మనం కాదు, దూలం. దూలం వేగంగా పోతుంటే మనం వెళుతున్నట్లు అనిపిస్తోంది. ఈ దూలం చాలా వయ్యారంగా వేగంగా వెళుతోంది.

మూడో కప్ప : అది మొద్దయితే నువ్వు సుద్ధ మొద్దు. నీకసలే బుద్ధి లేదు. దూలం కదలడం ఏమిటి? దానికి ప్రాణమే లేదు. కదులుతున్నది నది. అది కారణంగా దూలం, అది కారణంగా మనం కదులుతున్నాం.

నాలుగో కప్ప : వేదాంత ధోరణిలో ఇట్లా అంది. మీ కెన్నాళ్ళుపోయినా జ్ఞానం రాదు. మనం కదలటం లేదు. దూలం కదలటం లేదు. నది కూడ కదలటం లేదు. మన మనస్సే కదులు తోంది. మనస్సులో కదలిక లేకపోతే దృశ్యంలో కదలిక లేదు. ఇది మీకు తెలియాలంటే జన్మలు పడుతుంది.

ఐదో కప్ప వారందరి సంభాషణ వింటోంది. వాటి మధ్య వాగ్యుద్ధం మొదలయింది. ప్రతి కప్ప తను చెప్పిందే సత్యం అంటుంది. ఐదో కప్ప వింటోంది. అలసిన నాలుగు కప్పలు ఐదో కప్పను చూచి "నువ్వే మంటావు" అన్నాయి. ఐదో కప్ప నవ్వుతూ ఇలా అంది.

"మీరు నలుగురు చెప్పిందీ సత్యమే. కాకపోతే ఒకే సత్యంలోని భాగాలు. ఎవరెవరి జ్ఞానాన్ని బట్టి వారి వారి దర్శనా లుంటాయి. మనం కదలడం సత్యం, అసత్యం కూడ. దూలం కదలడం సత్యం, అసత్యం కూడ. నది కదలడం సత్యం, అసత్యం కూడ. మనసు కదలడం సత్యం, అసత్యం కూడ. ఒకే సత్యం యొక్క అవస్థితు లివి. సత్యము, అసత్యము అసలు సత్యంలో ఏకీభవిస్తాయి. ఈ ఏకీభావమే సత్యస్వరూపము. అందులో అన్నీ ఇముడుతాయి."

మిగతా నాలుగు కప్పలకి ఐదో కప్ప సమాధానం నచ్చలేదు. అవన్నీ కలసి ఐదో కప్పను నదీ ప్రవాహంలోనికి తోసేసాయి!!!



**44**

# తెలుపు - నలుపు

రంగులు పులిమిన కాయితాన్ని చూచి తెల్లకాయితం ఇట్లా అంది. "నేను తెల్లగా పుట్టాను. అంటే స్వచ్ఛంగా ఉన్నాను. నిర్మలంగా ఉన్నాను. నేనెప్పుడూ నిర్మలంగానే ఉంటాను. నిర్మలంగానే మరణించి తెల్లటి విభూతిగా ఉంటాను. నిర్మలత్వమే నా ధ్యేయం."

రంగులతోను, సిరాలతోను వ్రాయబడ్డ కాయితం పై మాటలు విని నవ్వుకుంది. "నేనూ నిర్మలంగానే ఉన్నాను. నాపై వ్రాసిన రాతలు, గీతలు, రంగులు నాకు సంబంధించినవి కావు. లోకులకు సంబంధించినవి. నాకు నేను తెలుపే, నాకు నేను నిర్మలనే. లోదృష్టి గలవారికే నా నిర్మలత్వం తెలుస్తుంది. నా నిర్మలత్వంలో పరహితం చోటు చేసుకుంది. అందులో ఆనందం నీకు తెలియదు. ఎప్పటకీ తెలియదు."

ఇంతలో కిటికీలో నుండి ఒక పిల్లి బల్లపైకి దూకింది. దాని కాలొకటి బల్లపై నున్న సిరాబుడ్డికి తగిలింది. బుడ్డి దొర్లి, సిరా తెల్లకాయితంపై పడింది. తెల్లకాయితం సిరాతో నిండింది.

అవమానంతో, సిగ్గుతో దుఃఖించింది. రెండో కాయితం ఓదారుస్తూ ఇలా అంది.

“ఇలా ఉంటాను, అలా వుంటాను అనకు. అంతా కాలం చేతిలోని వాళ్లమే. నీలో నువ్వుండటం నేర్చుకో. నీవిప్పుడు గూడ తెల్లనిదానివే. సిరా మనం అంటించుకోవద్దు.

45

# మూర్ఖత

గద్దతో పాము ఇలా అంది.

"నీవు ఆకాశంలో ఎగరగలవే గాని భూమి లోతులలోకి రాలేవు గదా! భూమి లోపల చాలా ప్రశాంతంగా ఉంటుంది."

దానికి సమాధానం గద్ద ఇలా చెప్పింది.

"నీకు భూమిలోపల విషయాలు చాలా తెలుసు. తత్సంబంధమైన జ్ఞానంలో నీవు దిట్టవు. కాని నీవు ఆకాశంలోకి ఎగరలేవు. ఎగిరితే ఎంత బాగుంటుందో నీకే తెలుస్తుంది."

పాము : భూమిలోపల ఎన్నో సంపదలున్నాయి. బంగారముంది. వెండి ఉంది. వజ్రాలున్నాయి. మణులున్నాయి. కెంపులున్నాయి. పచ్చ లున్నాయి. పైకి కనిపించే భూమికి, లోపల కనిపించే భూమికి పోలికే లేదు. అందుకే భూమి రత్నగర్భ. రకరకాల కాంతులు లోపల మిరిమిట్లు గొలుపుతూ ఉంటాయి. పాతాళం వరకు ప్రయాణం చేసి ఎన్నో అద్భుతాల ననుభవిస్తూ ఉంటాను. నీకా అనుభూతి లేదు.

గద్ద : నీవు చెప్పిందంతా సత్యమే. భూమిలో అందాలు వింటూ వుంటాను. నిజానికి భూమి దివ్యమైనదే గాని, ఆ భూమి గూడ ఆకాశంలో తిరుగుతుంది. నేను కూడ ఆకాశంలో తిరుగు తున్నాను. నువ్వు గూడ తిరిగితే బాగుంటుంది.

పాము : భూమిలో చాలా ఓషధులున్నాయి. నీకు తెలుసో తెలియదో ఒక ఓషధి పాలు త్రాగితే స్ఫటికం కన్న ప్రకాశం కలిగే శరీరం లభిస్తుంది.

గద్ద : నిజమే. భూమిలో చాలా అద్భుతాలున్నాయి. అవి నీవే చెప్పగలవు. ఇటువంటి భూములు చాలా ఉన్నాయి. అవన్నీ ఆకాశంలోనే తిరుగుతున్నాయి. పాపం నీవే ఆకాశ గమనం చేయలేవు.

పాము : భూమిమీద ఒక రహస్యమైన సెలయేరు ఉంది. అందులో రోజా రంగు నీళ్ళు ప్రవహిస్తుంటాయి. అవి త్రాగితే మరణ ముండదు. అమృతత్త్వం సిద్ధిస్తుంది.

గద్ద : నిజమే. నీవు దేవతలవలె అమృతత్త్వాన్ని సాధించ గలవు. కాని ఏమి లాభం? నావలె జీవగానం, ఆకాశ గమనం చేయలేవు. కాని నీవు సంకల్పిస్తే ఈ రెండూ నీక్కూడ సిద్ధిస్తాయి. నారదాది మహర్షులు ఆకాశంలో చరిస్తూ, జీవగానం చేస్తూ, తన్మయం చెందుతూ ఉంటారు. కేవలం అమృతత్త్వంవల్ల ఉపయోగం లేదు. జీవన మాధుర్యం ఉండాలి. తాదాప్యం ఉండాలి.

ఆ తాదాప్యంలో కాలాన్ని, దేశాన్ని కూడ అధిగమించాలి. ఈ ఆనందం పొందటానికి ప్రయత్నించు. భౌతిక సంపదలకు మురిసి పోకు, ప్రయత్నించి ఎగిరే రెక్కలతో కూడిన శరీరం సంపాదించుకో.

ఈ మాటలకి పాముకి చిర్రెత్తుకొచ్చింది. తన కలుగులోకి దూరిపోయింది. "మూర్ఖపు గద్ద. ఎంత చెప్పినా వినిపించుకోదు. దాని ఖర్మ అంతే" అనుకుంది. గద్ద ఆకాశంలో ఎగిరిపోతూ గానం ద్వారా తాదాప్యం చెందింది. పామును గూర్చి మరచింది.

# 46

## అమ్మకం - నమ్మకం

ఊరు బయట ఇళ్లస్థలం కొన్నాడు వెంకయ్య. శాస్త్రిగారిచేత శంకుస్థాపన ముహూర్తం పెట్టించుకున్నాడు. ఈశాన్యంలో భూమి పూజకు తవ్విస్తుంటే ఒక అద్భుతమైన కృష్ణ విగ్రహం కనిపించింది. దాని అందం వర్ణనాతీతంగా ఉంది. ఇల్లు కట్టుకొని, ఇంట్లో పెట్టుకొని ఆరాధన చేస్తే బాగుంటుందనిపించింది. ఇంతలోనే మరో ఆలోచన వచ్చింది. స్థలం కొంటానికే చాలా ఖర్చయింది. ఇల్లు కట్టడానికి మరింత ఖర్చవుతుంది. భార్య నగలు కూడా ఇల్లు కట్టడంకోసం అమ్ముతున్నాడు. ఈ విగ్రహం గూడ అమ్మేస్తే డబ్బుకు కొదవుండదు. క్రమశః ఈ భావం బలం పుంజుకుంది. విగ్రహం ఊరులోకి పదిలంగా తెచ్చుకుంటుంటే, ధనికుడైన కృష్ణ భక్తుడు వెంకయ్యకు గుర్తొచ్చాడు. అతనికి అమ్మితే మంచి ధర వస్తుందనిపించింది.

వెంకయ్య సరాసరి కృష్ణ భక్తుడింటికి వెళ్లాడు. కృష్ణవిగ్రహాన్ని చూపాడు. ధర కట్టమన్నాడు. కృష్ణభక్తుడు విగ్రహాన్నిచూసి తన్మయం

చెందాడు. శ్రీకృష్ణుడే తన యింటికి వచ్చినట్లు భావించాడు. వెంకయ్యనే ధర నిర్ణయం చేసుకోమన్నాడు. వెంకయ్య మనసు వికసించింది. తను మొదట ఆశించిన ధరకన్న నాలుగింతలు అడిగాడు. కనీసం రెండింతలన్నా ఇవ్వకపోతాడా అనుకున్నాడు. ధనికుడు ఇనప్పెట్టెలోంచి అప్పటికప్పుడు నాలుగింతలు ధరయిచ్చి వెంకయ్యకు స్నేహభావంతో పట్టుబట్టలు కూడా పెట్టాడు. వెంకయ్య సంతోషంగా ఇంటికి బయలుదేరాడు.

దారిలో వెంకయ్య ఇలా భావించాడు.

"ఈ కృష్ణ భక్తుడెంత మూర్ఖుడు. ఆవేశం తప్ప ఆలోచన లేదు. నాలుగింతలు ధర ఎక్కువిచ్చి కొన్నాడు. పైగా బట్టలు కూడా పెట్టాడు. పాపం డబ్బు విలువ తెలియదు. ఉన్నదంతా ఇట్లాగే తగలేస్తాడు కాబోలు."

కృష్ణభక్తుడు కృష్ణ విగ్రహానికి స్నానం చేయించి పూజా మందిరంలో అందమైన పీఠం ఏర్పరచి విగ్రహాన్ని అమర్చి షోడశోప చార పూజ చేసి ఇలా భావన చేశాడు. అత్యంత సుందరమైన నీ మూర్తి దర్శనం ఏర్పరచి నా హృదయం రంజింపచేశావు. నిన్ను డబ్బుతో కొనలేం. నా సమస్త సంపద నీవే. నీవిచ్చినదే. నీ కోసమే నే జీవిస్తున్నా. పాపం వెంకయ్యకు తెలియదు. నిన్ను అమ్ముకున్నాడు. నమ్ముకోలేదు. ఎంత డబ్బు వెచ్చించినా దొరకని నిన్ను డబ్బుకోసం అమ్మిన వెంకయ్యను క్షమించు."

# 47

# పూర్వాపరాలు

సద్గురువును సమీపించి శిష్యుడిలా ఘోషించాడు. "నా కొడుకు నా మాట వినడు. నా నచ్చుబాటుకు విరుద్ధంగా ప్రవర్తిస్తాడు. అంతకంతకు మామధ్య వైవిధ్యం పెరుగుతోంది. స్నేహం తగ్గుతోంది. ఎంతో గారాబంగా పెంచిపోషించాను. అన్ని సౌకర్యాలు ఏర్పరిచాను. ఇప్పుడు వాడికి నా మీద అనురాగం లేదు. నిష్కారణమైన కోపం ఉంది. కారణం తెలియదు. ఈ వృద్ధాప్యంలో తన్ని తగిలేస్తాడేమో అని భయం కూడ వేస్తోంది. ఏ జన్మలో పాపమో ఈ జన్మలో ఇట్లా కట్టి కుడుపుతోంది. దీనికి కారణం త్రికాలజ్ఞులైన మీకు తెలియకపోదు. వివరించి బాధా నివారణ చేయండి."

సద్గురువు గంభీర ముద్ర వహించాడు. క్షణకాలం కనులు మూసుకున్నాడు. కనులు తెరచి వాత్సల్యపూరితంగా ఇలా అన్నాడు.

"నేవే తెలిపావు కదా! ఏదో జన్మలో చేసిన పాపం కట్టి కుడుపుతోందని. మనది కాని దేదీ మనవద్దకు రాదు. మనదైన

దేదీ మనవద్దనుండి పోదు. మనం చేసిందే, మంచైనా చెడైనా మన వెంట వస్తుంది. నీకో కథ చెపుతా విను.

క్రీ॥ పూ॥ ఈశాన రాజ్యం అని ఉండేది. ఆ రాజ్యానికి రాజు పేరు కూడ ఈశానుడే. ఎవరు సింహాసనం ఎక్కినా, అతనిని ఈశానుడనే అంటారు. ఈశానుడు మహా పరాక్రమవంతుడు. అతడు శత్రు కంటకుడు. తనపై శత్రుత్వం వహించిన వారిని సమూలంగా నశింపజేస్తాడు. విధివశాత్తు అతనికి పొరుగు రాజ్య మేలుతున్న అతని బావమఱిదితో విరోధం ఏర్పడింది. ఆ విరోధం యుద్ధానికి దారితీసింది. భార్య సోదరుని కోసం, భర్తను ప్రాధేయ పడ్డది. యుద్ధము వద్దన్నది. తనకొకడే సోదరుడని, చిన్నప్పటినుండి కలిసి పెరిగామని, అతని సంహారం తనకు భరింపరాని దుఃఖమని, అతనిని క్షమింపుమని ప్రార్థించింది. ఈశానుడు వినలేదు. తన శత్రువెవరైనాసరే మృత్యువాత పడాల్సిందే. మరియొక మార్గం లేదన్నాడు. మంత్రి, సేనాధిపతులను సమావేశపరిచాడు. తన నిర్ణయం తెలిపాడు. వృద్ధుడైన మంత్రి యుద్ధము వద్దన్నాడు. సామోపాయంతో మైత్రి చేసుకోమన్నాడు. బంధుత్వాన్ని వినియోగించి స్నేహం పెంచుకోమన్నాడు. ఈశానుడు వినలేదు.

శత్రు సంహారానికై యుద్ధం ప్రకటించాడు. భార్య నిండు గర్భవతి. ఏడవ నెల. పుట్టినింటికి పసుపు కుంకుమలతో వెళ్ళవలసిన తరుణంలో తన భర్త యుద్ధానికి వెళ్తున్నాడు. ఆమెకు

దిక్కు తోచలేదు. తన సోదరుని, భర్తను కాపాడవలసిందని జగన్మాతను ప్రార్థించింది.

యుద్ధం భీకరంగా సాగింది. ఈశానుడు శత్రుసంహారం కావించాడు. విజయోత్సాహంతో తన రాజ్యానికి తిరిగివచ్చాడు.

భార్య, మంత్రి మినహా అందరూ సంతోషించారు. రాజ సభలో రాజులందరు వేనోళ్ళ కీర్తించి సన్మానించారు. రాణి మాత్రం సోదరుని తలచుకుంటు జగన్మాతను నిరంతరంగా ప్రార్థించింది.

పదినెలలు నిండాయి. రాణి ప్రసవించింది. మగశిశువు పుట్టాడు. రాజ్యం అంతా సంబరాలు చేసుకుంది. ఈశానుడు అమిత ఆనందంతో విరివిగా దానధర్మాలు చేసాడు. పుత్రుని ఎత్తుకొని హృదయానికి హత్తుకొని ముద్దాడేడు. పుత్రోత్సాహం పుత్రమోహానికి దారితీసింది. అతని పుత్రుడు గూడ సర్వాంగ సుందరుడు. ముఖవర్చస్సు నుండి దివ్యకళ గోచరిస్తూ ఉండేది. తనయుడిలో సోదరుని చూసుకొని రాణి తృప్తి చెందింది. జగన్మాత కరుణించిందని ఆనందించింది.

పిల్లవానికి ఐదు సంవత్సరములు వయస్సు వచ్చింది. ఈశానుడు విద్యాభ్యాసం కావించాడు. జ్యోతిష్కుని పిలిచి, అతని భవిష్యత్తు తెలుపమని కోరాడు. జ్యోతిషులు జాతకాన్ని పరిశీలించి విస్తుపోయారు. మాటాడక మౌనం వహించారు. ఈశానుడికి సందేహం కలిగింది. ఉన్న విషయం నిష్కర్షగా తెలుపమన్నాడు. ఆ సమయంలో ఆకాశవాణి ఇలా పలికింది.

“రాజా! నీ తనయుని రూపంలో ఉన్న జీవాత్మ నీచే సంహరింపబడిన నీ బావమఱిది జీవాత్మయే. అతనితో శత్రుత్వం వహించి సంహరిస్తావో, మిత్రత్వం వహించి ఆదరిస్తావో నీవే తేల్చుకో. ఆ జీవాత్మ అప్పుడు బావమఱిది, ఇపుడు స్వయాన నీ పుత్రుడు. శత్రువు ఎవరైనా సరే సంహరించాలన్న నీ ప్రతిజ్ఞ ఇపుడు పరీక్షకు వచ్చింది. విచక్షణ కలిగి నిర్ణయం చేసుకో.”

ఈశానుడు నివ్వెరపోయాడు. తనయుని వంక చూసాడు. జగన్మాత ఆవరించిన బాలుడు మోహనంగా తండ్రిని చూసి నవ్వాడు. ఆ నవ్వు నుండి జగన్మాయ వ్యక్తమై ఈశానుని ఆవరించింది. ఈశానుడు తనయుణ్ణి కౌగలించుకొని, “ఈతడు నా పుత్రుడు. పెరిగి నాపై శత్రుత్వము వహించినను, ఇతనికే రాజ్యాన్ని అందించి నే నడవులకు పోతాను. తనయుని సంహరించు కొనేటంతటి మూర్ఖుడను కాను” అన్నాడు. రాణి తన హృదయంలో జగన్మాతకు కోటి నమస్కారా లర్పించుకొంది.”

పై కథలో నీ కథకు కూడ సమాధానం ఉంది. వివేకంతో ప్రవర్తించు అని సద్గురువు వివరించాడు.

# 48

## అస్మి

**సా**ధువొకడు మార్గమున కూర్చొని యుండెను. కర్మిష్ఠి ఒకడు దారినపోవుచు యిట్లనెను. "ఉదయము నుండి సాయంత్రము వరకు ఇట్లు కూర్చుని యుండుట కన్న యేదైన పని చేసుకొనవచ్చును కదా?"

సాధువు మౌనముగ నవ్వెను. కర్మిష్ఠి ముందుకు సాగి పోయెను.

*   *   *

స్వాభిమాని యొకడు దారిన పోవుచు సాధువును చూచెను. ఇట్లనెను. "అభిమానము కలిగినవాడవైనచో నిన్ను నీవు పోషించుకొందువు. ఇట్లు దారిలో కూర్చుండి బిచ్చమెత్తుట ఎందులకు? భగవంతుడు శరీరమిచ్చెను కదా! దానితో పనిచేయుచు పదిమందికి ఉపయోగపడవలెనే కాని యిట్లభిమానము, పురుష ప్రయత్నము వదలి కూర్చుండుట సమంజసము కాదు."

సాధువు నవ్వుచు, "నేను మిమ్ములను బిచ్చమడిగితినా,

కేవలము కూర్చుంటిని. నన్ను గూర్చిన నీ అభిప్రాయము, నీ భావనయే కాని నేను కాదు.”

*  *  *

దారి ప్రక్కన కూర్చున్న సాధువును చూచి రక్షకభటుడు యిట్లడిగెను.

“ఈనాటి నీ సంపాదన యెంత? దాచక నావంతు వాటా నా కిమ్ము.”

సాధువు నవ్వుచు “నేను బిచ్చగాడిని కాదు. నీవు ఎదురు చూచుచున్న ధనము నావద్ద లేదు” అని పలికెను. రక్షకభటుడు అనుమానముగ వెడలిపోయెను.

*  *  *

దారి ప్రక్కన కూర్చున్న సాధవును చూచి బిచ్చగాడొకడు చేరెను. ఆయాసపడుతూ యిట్లనెను. “కలికాలము! ఉదయము నుండి మధ్యాహ్నము వరకు ఏ ఒక్కడును కనికరించి పదిపైసలు డబ్బుకాని, పట్టెడు అన్నము కాని పెట్టలేదు. పేదవారిని గూర్చి ఆలోచించువారు లేరు. ఎవరి స్వార్థము వారిది. మా తాత సమయములో బిచ్చము సమృద్ధిగా దొరికెడిదట. నేడు నేను, నా కుటుంబము ఆకలిచే మలమల మాడుచున్నాము. రాజకీయ నాయకులు, అధికారులు, వ్యాపారులు ఆశ చూపుదురేకాని ఏమియు మనకు చేయరు. అందరునూ దొంగలే. నీకు ఈ రోజు ఏమైనా దొరికినదా?”

“నేను బిచ్చగానిని కాదు” అని సాధువు పలికెను.

*  *  *

మధ్యాహ్నము దాటినది, ఎండ తీవ్రత పెరిగినది. బిచ్చగాండ్రు అందరూ ఆకలితో పట్టె డన్నము కోసము దేవాలయమునకు బోవు దారిలో ఎదురుచూస్తూ కూర్చునే యున్నారు. సాధువు కూడ వారియం దొకడుగ యున్నాడు. ఇంతలో కోలాహలము. అన్న పదార్థములతో వాహన మొకటి వచ్చి వంద అడుగుల దూరములో ఆగినది. వాహనముపై “అన్నదాన సంఘము” అని వ్రాసి యున్నది. అందుండి ముగ్గురు వ్యక్తులు దిగినారు. వారు ధరించు దస్తులపై కూడ “అన్నదాన సంఘము” అని వ్రాసి యుంది. వారు వాహనము నుండి అన్నముతో కూడిన పొట్లముల గంపలను దింపినారు. పొట్లముపై కూడ “అన్నదాన సంఘము” అని వున్నది. అది చూచి బిచ్చగాండ్లందరూ పరుగులెత్తుచూ ఆహార పొట్లములకు చేతులు చాచినారు. ముగ్గురు వ్యక్తులలో ఒకడు అందరిని పంక్తులుగ కూర్చోమని, స్వామీజీ నామస్మరణ చేయమని నిర్దేశించినాడు. మరియొకడు స్వామీజీ చిత్రపటములను బిచ్చ గాండ్రకు పంచినాడు. ఇద్దరును కలసి “స్వామీజీకి జై! అన్నదాన సంఘమునకు జై!” అని బిచ్చగాండ్రచేత అనిపించినారు.

మూడవ వ్యక్తి పొట్లములు పుచ్చుకొని ఒక్కొక్కరికిని అందించినాడు. అన్నపొట్లము లందించుచున్న మూడవ వ్యక్తి, చిత్రపటము నందున్న స్వామీజీయే అని తెలిసి బిచ్చగాండ్రు పొట్లము లందుకొనుచుండగ “స్వామీజీ పాదములకు నమస్కారము చేసి అన్నపొట్లము లందుకోండి అని మిగిలిన యిద్దరు వ్యక్తులు ఆదేశించినారు. ఆకలిగ నున్న బిచ్చగాండ్రు అట్లే చేసిరి. అన్న సంతర్పణ ముగిసినది.

దూరము నుండి ఈ విచిత్ర సంఘటనను సాధువు గమనించుచు నవ్వుకొనినాడు. ఇంతలో ఆ వాహనము నుండి దిగిన యిద్దరు సేవకులు సాధవును చూచి యిట్లరచినారు. “దొరగారికి తెచ్చిపెట్టవలెనా? వచ్చి తీసుకొనరు కాబోలు! బిచ్చగాడైనను అభిమానము మెండుగ యున్నట్లున్నది.” సాధువు వినలేదు. వారిద్దరూ సాధువు వద్దకు వచ్చి, “ఆకలి లేదా? అన్న మక్కరలేదా? అభిమానమా? లే, నడచివచ్చి స్వామీజీకి నమస్కరించి అన్నమందుకో” అని అనినారు. సాధువు లేవలేదు. సమాధానముగా “నేను బిచ్చగాడను కాదు” అని తెలిపినాడు. అన్నదాన సంఘము కదలివెళ్లినది. బిచ్చగాళ్ళందరు కూడ సంతోషముగ వారి వారి అన్న పొట్లములను తీసుకొని ఇళ్ళకేగినారు.

మధ్యాహ్నము రెండు గంటలైనది. ఎండ వేడిమి తీవ్రముగ నున్నది. సాధువొక్కడే అట్లే కూర్చుని యున్నాడు. ఇంతలో ఒక పండు ముత్తైదువు పంచభక్ష్య పరమాన్నములతో అక్కడికి వచ్చి సాధువుకి నమస్కరించి “ఊరి వారందరూ భుజించినారు. ఇకమీరు భుజింపవచ్చును” అని పలికినది. “అన్నపూర్ణమ్మ నీవుండగ ఎవరికేమి కొఱత. నీవందించిన భక్తి, ప్రేమ నా కడుపు నింపినది. అన్నము స్పృశింతును. నీవు గొనిపోయి భుజింపుము” అని సాధువు శాంత గంభీర స్వరముతో పలికెను. వచ్చిన ముత్తైదువు “కనీసము పది మెతుకులు భుజించి నన్నాశీర్వదింపుడు. మిగిలినది గొనిపోయి భుజించెదను.” అని అనెను. సాధువట్లే చేసెను. ముత్తైదువు నిండు విస్తరిని తీసుకొని ఎదురుగా గల దేవాలయములోని గర్భాలయమున ప్రవేశించి అంతర్ధానమయ్యెను.

# 49

## సదాచారము - సాన్నిధ్యము

నైష్ఠికుడొకడు బుద్ధ భగవానుని చేరి యిట్లని పరిప్రశ్నము చేసెను.

"జీవితమంతయు వేదపఠనము, అగ్నికార్యము, సంధ్యా వందనము, గాయత్రి జపము చేసితిని, చేయించితిని కూడ. దాన ధర్మములు చేసితిని. అధ్యయనము చేసితిని, చేయించితిని. ధర్మము ననుసరించితిని, అనుసరింప జేసితిని. నాకు తెలిసిన పుణ్యకార్యము లన్నియు ముప్పది సంవత్సరములుగా నిర్వర్తించుచునే యున్నాను. దైవసాన్నిధ్యము రుచి చూడలేదు. కారణమేమో తెలియదు. నన్ను కరుణించి నాకు ఉపాయము తెలుపుడు."

బుద్ధుడు మందస్మితము చేసెను. నీవు చేసినదంతయు, నీ యుపాధిని పవిత్రముగ నుంచుకొనుటకే ఉపయోగపడినది. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములను బాగుగ పరిశుద్ధి గావించుచున్నావు. ఎవరికోసమై యిది యంతయు చేసితివో అతడు నీ యొద్దకు వచ్చినను, తెలియలేక పోయితివి. చేయుట, చేయించుట సతతము చేసిన మాత్రముననే చాలదు.

చేసిన తరువాత నీ మనోమయ కవాటమును తెరిచి, వేచియుండుట నేర్వవలెను. ముఖ్య అతిథిని మనయింటికి ఆహ్వానించుకొను సమయమున గృహమును పరిశుద్ధిచేసి, అలంకరించి వచ్చు అతిథికై వేచి యుండవలెను. వేచియుండక ఎప్పుడును కార్య నిమగ్నుడవై యున్నచో అతిథి వచ్చినను నీవు చూడలేవు. అతనిని సాదరముగ ఆహ్వానించలేవు. అతని సాన్నిధ్యమును పొందలేవు. సదాచారము లందే మునిగిన మనస్సు దేనిని అనుభవింపలేదు. నీ యందు ఉపాధి పరిశుద్ధిగనే యున్నది. అతనికై వేచియుండుట నేర్చు కొనుము. మనస్సును, బుద్ధిని పనియందుంచక వేచియుండుట, ఎదురుచూచుట నేర్పుము. సదాచారములకు, ప్రార్థనలకు అంత మున దైవము కొఱకు వేచియుండుటగ జరుగవలెను. అట్లు వేచియున్నపుడే దైవము నిన్ను సమీపించుట, సాన్నిధ్యము నిచ్చుట, తనలోనికి అందుకొనుట, తానుగ చేసుకొనుట యుండును.

పై కారణముగనే పరిశుద్ధమైన మనస్సుతో దైవమును ధ్యానింపుడని, వైదిక కర్మకాండలు, ప్రార్థనలు కన్న ధ్యానము ప్రధానమని నేను తెలుపుచున్నాను. ఇది కారణముగ నేను వైదిక కర్మలకు వ్యతిరేకినని నీబోటివారు భావించి ప్రచారము చేయు చున్నారు. మీరు నిర్వర్తించుచున్న దంతయు ప్రార్థనము. అటుపైన వేచి యుండుట, అనుగ్రహింపబడుట నేను నేర్పుచున్నాను. చేయకుండుటకన్న చేయుట యుత్తమము. చేసిన వెనుక వేచి యుండుట ఉత్తమము. అహర్నిశలు చేయుటయందే యుండు వారికి దైవము ఎదుట నిలబడినను కనబడదు. ప్రస్తుతము నీవు నేర్వవలసినది దైవమును ఆహ్వానించిన వెనుక వేచియుండుట. ఇది ఒకటియే యుపాయము. దీనినే ధ్యానము అందురు.

# 50

## వా ద న

**మే**ధా సంపత్తి, తర్కజ్ఞానము గల పండితుడొకడు ఎపుడును ఆస్తికులను ఆహ్వానించి దేవుడు లేడని వాదిస్తూ వుంటాడు. వచ్చినవారు తనతో వాదన కుపక్రమించటం కోసం తాను కూర్చుండు ఆసనం వెనుక గోడపై "దేవుడెక్కడా లేడు" అను ఒక వాక్యమును ప్రదర్శించి ఉంచుతాడు. వచ్చినవారల్లా ఆ వాక్యాన్ని చూచి అతనితో వాదనలోకి దిగి విఫలులౌతూ వుంటారు. అతడి కదొక ఆనందం. తినటానికి, తిరగటానికి, జీవించడానికి సమృద్ధిగా తండ్రులు, తాతలు యిచ్చి వెళ్ళేరు. సంఘమున అతడికి మరియొక పనిలేదు. ఇదియే పని. ఆ మేధావికి ఒకే ఒక సంతానము. అదియును పుత్రికయే. భోజనము, నిద్ర, విరామము అయిన వెనుక ప్రతినిత్యం యీ విధంగా ఆస్తికుల్ని పీడిస్తూ వుంటాడు. ఆస్తికుల నాహ్వానించి, ఆదరంగా కాఫీ ఫలహారములు గూడ యిచ్చి పై విధంగా వాదిస్తూ వుంటాడు. అపజయమన్నది యెరుగడు.

ఆ మేధావి కూతురు వివాహిత. ఒకనాడు ఐదు సంవత్సరములుగల తన కొడుకు నెత్తుకొని పుట్టింటి కొచ్చింది.

మనవడిని చూచి తాత సంతోషించాడు. మనవడి ఆకర్షణ తాతను బాగా ఆకట్టుకుంది. కొంతకాలం వాదనా కార్యక్రమానికి శలవు ప్రకటించాడు. మనవడికి అప్పటికే అక్షరాలన్నీ వచ్చు. ఊరిలోకి షికారుగా తాతతో వెళుతున్నప్పుడల్లా, కనబడిన ప్రతీ బోర్డు చదువుతూ వుంటే, తాతకు ఆనందం వేసింది. మనవడి తెలివి తేటలకు ఉబ్బిపోయాడు. పైగా చూచిన వారందరు మనవడచ్చుగా తన పోలికే అంటున్నారు. మనవడు తాతని వదలడు. తాత మనవడని వదలలేడు.

ఒకనాడు తాత తన వాదనా గదిలోనికి మనవడితో వెళ్ళాడు. గదిలో వ్రాసివున్న బోర్డును చూచాడు. తాతకు ఆనందం వేసింది. మనవడిని చదవమన్నాడు. వాడిలా చదివేడు. "దేవుడెక్కడ లేడు?" తాత నిర్ఘాంతపోయాడు. తాత మనవడి చదువును సరిదిద్దాలని "దేవుడెక్కడ లేడు కాదు నాన్న, దేవుడెక్కడా లేడు" అని చదవాలని చెప్పాడు. మనవడు మళ్ళీ చదువుతూ 'దేవుడెక్కడ లేడు' అన్నాడు. ఎన్నిసార్లు చెప్పినా అదే విధంగా అంటూ వచ్చాడు. తాతకది మంత్రమై కూర్చుంది. అదే మస్తిష్కంలో తిరగడం మొదలుపెట్టింది. ఇంటికొచ్చిన మనవడైతే కూతురితో వెళ్ళిపోయాడు గాని వాడన్న మాటలు గుండెల్లో తిరుగుతూనే యున్నవి. ఒక శుభోదయాన "నిజమే! దేవుడెక్కడ లేడు!" అని సమాధానం పొందేడు.

మేధావులందరు మన మేధావితో వాదించి ఓడిపోయారు. పసివాడు వాదించకనే తాతని ఓడించాడు. భగవంతుడి లీలలు యెవరు తెలియగలరు?

# 51

## లేనిది లేదు

మత బోధకు డొకడు ఉద్వేగంగా దైవాన్ని గురించి, అతడి సర్వ సమర్థతను గురించి ప్రబోధిస్తూ ఉన్నాడు. సభలో నుండి ఒక వ్యక్తి లేచి "దేవుడంత సమర్థుడైతే నా చేతి వాచీలో తిరుగుతున్న సెకండ్ల ముల్లును ఆపమనండి. నేనపుడు మీరు చెప్పేది ఒప్పు కుంటాను." మత బోధకుడు దిగ్భ్రాంతి చెందేడు. విస్తు పోయాడు. అవాక్కయి పోయాడు. సభలోని వారందరూ రకరకా లుగా మాట్లాడుకోవటం మొదలుపెట్టారు. కొంతమంది మత బోధకుని దుస్థితిని చూచి పకపక నవ్వేరు. పృచ్ఛకుడు సభ నావిధంగా భంగపర్చి విజయగర్వంతో వీధిలోనికి బయలుదేరాడు. దారిలో ఫకీరొకడు పృచ్ఛకుని జూచి "నీకున్నది నాకు లేదు. నాకు లేనిదానిని నేనెట్లా ఆపగలను?" అని పలికెను.

పృచ్ఛకు డాలోచించసాగేడు. "ఉన్నది పోతుంది. లేనిది రాదు. లేని దానిని వున్నదనుకోవటం ఒక పొరపాటు. లేనిది లేనే

లేదుగదా! అది వున్నదనుకున్నవాడికి వాడి మనస్సులోనే వుంటుంది. అది లేనివాడికి వాడి మనస్సులో అది ఉండదు గదా. అది మనస్సులో లేనివాడు దానిని తీసేయటం అనే ప్రశ్నెక్కడ వుంది. తనకు మొదట్నించి పెళ్ళాం లేదు. లేని పెండ్లాము పోయిందనిగాని, చనిపోయిందనిగాని అనలేము గదా. అలాగే తనకి చేతివాచి వుంది. దానికి తిరిగే ముల్లు లున్నాయి. దానిని చూసుకొని యింత టైమైందని తా ననుకొంటున్నాడు. ఇదంతా తా ననుకుంటున్నాడు. తనకు వాచీ వుంది. టైము వుంది. తనకు వాచీ లేకపోయినా టైము వుంది. దేవుడికి వాచీ లేదు, టైము గూడ లేదు. తనకి లేని దానిని తానాపగలడా? అట్లాగే దేవుడును.” పృచ్ఛకుడికి లోనుండి పరిష్కారం లభించింది. తనతో మాట్లాడిన ఫకీరుకోసం పరిగెత్తాడు. అతడెక్కడా కనపడలేదు.



# 52

## సత్యం - శివం - సుందరం

**ము**గ్గురు అపరిచిత వ్యక్తులు ఒక సద్గురువును కలసి ఇలా పరిప్రశ్నము గావించారు.

"సత్యం అంటే ఏమిటి?"

"సుందరము (అందము) అంటే ఏమిటి?"

"శుభము, శివము అంటే ఏమిటి?"

పరిప్రశ్న గావించిన ముగ్గురుని సద్గురువు పరీక్షగ పరికించాడు. మౌనము వహించాడు.

వచ్చిన వ్యక్తులు "తమబోటి సద్గురువుల నిర్వచనము మాకవసరం. అందరు తలొక రకంగా నిర్వచిస్తూ వున్నారు. తమ బోటి సత్యదర్శనుల వద్ద స్పష్టంగా తెలుస్తుందని వచ్చాము. తమ నిర్వచనమే మాకు ప్రామాణికము" అన్నారు.

సద్గురువు మౌనమే కొనసాగించాడు.

*"ఏకం సత్ విప్రా బహుధావదంతి"* అని అంటూ ఉంటారు కదా. ఇన్ని రకాల నిర్వచనాలు మౌలిక విషయాలపై ఉండటం సత్యాన్వేషకులకు యిబ్బంది కలిగిస్తుంది. అందుచేతనే ప్రత్యేకించి పనికట్టుకొని మీ వద్దకు వచ్చాం అని వచ్చిన అపరిచిత వ్యక్తులు పలికారు.

సద్గురువు ఏమీ పలుక లేదు.

"పనికట్టుకొని వచ్చాం. మీరిలా ఉలకక పలుకక కూర్చుంటే మా గతేంకాను?" అని వచ్చినవారు పలికారు.

"పనికట్టుకొని వచ్చారా? లేక రూపుకట్టుకొని వచ్చారా? మీరడిగిన జీవన మౌలిక విషయము సత్యము, శివము, సుందరము అనుభూతిపరముగ తెలియునదేగాని తెలియపరచగలిగినది కాదు. తెలియపరచటానికి ఎందరో ప్రయత్నం చేసి విఫల మయ్యారు. వానిని గూర్చి రకరకములుగ ప్రశంసించ వచ్చును. వివరించ వచ్చును. కాని వానిని వివరించుట ఎవ్వరికినీ సాధ్యము కాదు. అవి భాషాతీతము, వర్ణనాతీతము. ఒక కవి తానుపొందిన అత్యద్భుతమైన భావాన్ని భాషలో ఉంచడానికి చాల ప్రయత్నం చేస్తాడు. అతని కవిత్వం యితరులకు ఆనందం కలిగించవచ్చుగాని, అతనికి పరిపూర్ణమైన ఆనందం కలుగదు. ఏలయన తన భావమందలి సౌందర్యమునకు తగిన భాష లేకపోవుటయే.

"ఒక శిల్పి అపురూపమగు సౌందర్యమూర్తిని గానవచ్చును. అతనెంత నైపుణ్యముతో శిల్పములు చెక్కినను అతని హృదయమున తారసిల్లిన సౌందర్యము అతనిచే మలచబడిన శిల్పమందు అతనికి

గోచరించదు. ప్రపంచమునకు అతడద్భుతమైన శిల్పియే. కాని తనకు తాను మాత్రము అట్లు భావింపలేదు. ఏలయన తన హృదయ సామ్రాజ్యమందలి సౌందర్యమునకు, రాతితో ఏర్పరచిన సుందర శిల్పమునకు గల వ్యత్యాసము అతనికే గోచరము. అట్లే చిత్ర కారుడును.

"అదే విధముగ సత్యమును దర్శించినవారు దానిని భాష యందు నిలుపలేమని తెలిసి మౌనము వహింతురు. సత్యము, సుందరము, శివము, ప్రేమ– వీని నన్వేషించినచో దొరుకును. తపనతో వేచియుండుటవలన దొరుకవచ్చును. అట్లు దొరికినచో ఆ అనుభవము పరిపూర్ణము. అందు అనుభవించువాడు కూడ కరిగిపోవును కావున అందుండి ఈవలకు వచ్చినపుడు దానిని గూర్చి పరిపూర్ణముగ వివరింపలేడు.

"అట్లే ప్రేమించుట అవివేకము. ప్రేమ స్పృశించినచో అతడికి జగత్తంతయు రసోపేతముగ గోచరించుచుండును. అట్లని తాను ప్రేమను దర్శించలేడు. ప్రేమ స్పర్శించినచో తా నెరుగగలడు. అట్లే సత్యము, సుందరము, శివము. స్పృశించిన తెలియవలెనే కాని నిర్వచించుట అసాధ్యము. స్పృశించిన వెనుక, ఆ స్పర్శాను భవముతోనే శాశ్వతముగ జీవించును. అందువలన మీ పరిప్రశ్నము నకు మౌనము కన్న సమాధానము లేదు. మీ దర్శనమునకు కృతజ్ఞుడను. కృతార్థుడనైతిని." అని సద్గురువు అపరిచిత వ్యక్తులకు నమస్కరించెను. వారు ఆశీఃపూర్వకముగ, చూపులతో స్పృశించి అంతర్ధానమైరి.

# 53

## బుద్ధుని మౌనము

గౌతముడు తీవ్రము, కఠోరము అయిన తపస్సు చేసి బుద్ధుడైనాడు, సిద్ధార్థు డైనాడు. అతని జీవితాశయము నెరవేరినది. అతని ఆవేదన ఆనందముగా మారినది. అతని అన్వేషణ అనంతత్వాన్ని అందించింది.

అతను ఆనందముతో అరణ్యములో తిరగసాగాడు. అలా ఏడు పగళ్ళు, రాత్రుళ్ళు తిరుగుతూ వున్నాడు. తాను పొందిన ఆనందము మానవులందరూ పొందితే ఎంత బాగుంటుంది, అని అనిపించింది. రకరకాల బంధనాల్లో, పదార్థమయమైన విషయాల్లో చిక్కుకొని ఆనందము యొక్క స్వరూపము తెలియక, అది పొందే మార్గము తెలియక, ఆనందము కొఱకే అన్వేషిస్తూ అది దొరకక, తిప్పలు పడుతూవున్న మానవులకు తాను పొందిన ఆనందాన్ని తత్సంబంధిత మార్గాన్ని తెలియపరచాలని అనిపించింది.

కాని తాను ఎలా తెలుపగలడు? తాను పొందినది భాషకు, భావనకు అందని విషయము. ఈ అనుభూతిని తెలుపుట కష్టమేకాక కష్టతరము కూడ. ఈ ఆనందానుభూతిని తెలపటము కష్టము.

తెలుపకపోయినా కష్టమే. తెలుపకపోతే అది మానవత అనిపించుకోదు. లక్షలాదిమంది ఈ సత్యానుభూతికై తపన చెందుతూ వున్నారు. తనకు ఈ అనుభూతి అనుగ్రహింపబడినది. కనీసము తపన చెందే వారి కందించటము తన బాధ్యత కదా! కొన్ని సూచనలు, సలహాలు తెలపటము సబబు కదా! కొంతలో కొంత దారి చూపటము తన కనీస ధర్మమేమో! అనిపించింది.

తెలియ పరచటము తన ధర్మమని నిశ్చయముగా తేలినప్పటికి సాధనము మాత్రము అతనికి దొరకలేదు. ఎలా తెలపాలి? నిజానికి నిశ్శబ్దము ద్వారానే సరిగా తెలుపవచ్చు. కాని నిశ్శబ్దముగా వుంటే ఇతరులకు వినపడదు. వారికి నిశ్శబ్దమే తెలియదు. శబ్దము చేస్తే నిశ్శబ్దానికి అంతరాయమై అసలు విషయ ముండదు. గౌతమ బుద్ధునికి అది ఒక విషమ సమస్యయై కూర్చుంది. సత్యాన్ని తెలపాలి. కాని ఎలా తెలపాలో తెలియ లేదు. తోటి మానవులను ఎలా మేల్కొలపాలో తెలియలేదు. సత్య సాధనకన్న సత్య బోధనము అతనికి విషమంగా తోచినది. అందువలన మౌనముగ వుండి పోయాడు.

బుద్ధుని మౌనము స్వర్గములోని దేవతలకు ఇబ్బంది కలిగించింది. ఎన్నో వేల సంవత్సరాలకు మానవుడు దైవమై వెలిగాడు. ఇది సృష్టిలో ఒక అద్భుత సంఘటన. ఇతడు మౌనముగ వుండిపోతే మిగిలిన కోట్లాది జీవుల గతి యేమగును. అజ్ఞానములో పడిన వీరిని పూర్ణ జ్ఞానియే కదా రక్షించగలడు. మేల్కొనిన వాడే ఇంకొకరిని మేల్కొల్ప గలడు. మనము దేవతలుగ మేల్కొల్ప గలిగినప్పటికిని, మనకు భాష లేదుకదా! బుద్ధునికి భాషణ శక్తి

యున్నది. అందువలన ఇతడే మానవులకు సహాయము చేయగలడు. మన మతనికి సహాయపడవచ్చును అని భావించారు.

ఇంద్రాది దేవతలందరును అంతర్ముఖముగ భాషణమునకై ప్రేరణ కలిగించారు. దేవతల సంకల్పాన్ని గ్రహించినప్పటికి బుద్ధుడు మౌనముగ వుండిపోయాడు. దేవతలలో కలవరము మొదలైనది. వారు మరల బుద్ధుని బుద్ధిలోకములో కలిసి భాషించవలసినదిగ వేడుకొనినారు. అప్పుడు వారితో బుద్ధుడు నిశ్శబ్దముతో ఇలా పలికాడు. "మీరు కోరుచున్న విషయాన్ని నేను ఎంతో కాలముగ కోరి సరియగు విధానము లేక మౌనముగ యున్నాను. సత్యమును గూర్చి మాట్లాడుట కుదరని విషయమని తెలిసినది. భాష పరిమితమైనదని, దాని ద్వారా సత్య విషయమును తెలుపలేమని తెలిసినది. భాషణము వలన పూర్ణ ప్రయోజనము కలుగదు. అంతియేకాక బహు అపాయములు కూడ జరుగ గలవు. నేనొకటి తెలిపిన వినువారు మరొకటి అవగాహన చేసుకొనవచ్చును. నేను నందిని గూర్చి తెలిపినను వినువారికి అది పందివలె గోచరించ వచ్చును. వినువారందరు వినలేరు. చూచువారందరు చూడలేరు. కావున నాకు మానవ జాతియందు అపారమగు ప్రేమ, దయ, కరుణ వున్నప్పటికిని వారిని మేల్కొల్పు విషయమున కృతకృత్యుడను కాగలనను విశ్వాసము నాకు కలుగుట లేదు. నా పరిస్థితిని గ్రహించి ఈ విషయమున నన్ను మన్నింపుడు. తెలియపరచు మార్గము సులభమగునది కాదు అని తెలిసినది. తెలియపరచలేకపోవుట నన్నును వేధించుచున్నది."

దేవతలిట్లని పలికిరి. "సత్యదర్శనునికి అసాధ్య మనునది

యుండదు. కావున నీవే మరల తపస్సు చేసి మార్గమును బడయుము. ఇది మా కోరిక.”

బుద్ధు డిట్లనెను : “అట్లే కానిండు, నాకు తోచిన విధమున ఈ బాధ్యతను నిర్వర్తింతును. భూమిపై మానవులందరు మేల్కాంచు వరకు నాకు తోచిన ప్రయత్నము చేయుచు ఇచటనే యుందును. నాకుగ నేను బోధించను. నన్ను వినదలచినవారు, వినగలిగిన వారు విందురు. సౌధాగ్రములనుండి, పర్వతాగ్రముల నుండి ఘోషించి ప్రయోజనము లేదు. సత్యము నందు మాత్రమే రుచి గల వారికి దానిని బోధించు ప్రయత్నము చేయుదును. కేవలము కుతూహలము గల వారికి తెలుపను, ప్రచారము చేయను. ప్రచారము చేసినచో దానియందు రుచి లేనివారు దానిని అవమానింతురు. నన్నునూ అవమానింతురు. ఆ మార్గమున అగచాట్లెక్కువ, అవగాహన తక్కువ.”

దేవతలు కొంత సంతోషించిరి. బుద్ధునితో ఇట్లనిరి. “అట్లే కానిమ్ము. సామాన్యుల యెడ కూడ కొంత కరుణ వహింపుము. వారికిని తగు ప్రేరణ లిమ్ము. మేలుకొలుపుట నీవంతు. మేల్కాంచుట వారి వంతు. మానవ జాతిని చైతన్య పరచుట నీవంతు.” బుద్ధుడు నవ్వుతూ ఇట్లనెను. “అట్లే కానిండు. సత్యమును పూర్ణముగ నే నెట్లును పలుక లేను. ఆకలి గొన్నవారికి అన్నము పెట్టినట్లు ప్రేరణ నిచ్చెదను. వారికి మార్గము తెలిపెదను. అందరికిని మౌనమున సాన్నిధ్యమిచ్చెదను. సామాన్యునికి పరిపూర్ణముగ సేవ చేసెదను.”

ఆనాటి నుండి ఈనాటి వరకు బుద్ధుడట్లే తన దీక్షను కొనసాగించుచున్నాడు.

# 54

## అత్యావస్యకత

దేవదత్తుడు బుద్ధునిట్లు ప్రశ్నించెను.

"కర్మ ప్రారంభ మెక్కడనుండి?"

బుద్ధుడిట్లనెను. "అవసరమే కర్మకు ప్రారంభము అత్యవసర మైననే కర్మలు నిర్వర్తించవలెను."

దేవదత్తుడు మరల యిట్లు ప్రశ్నించెను.

"అత్యవసరమా కాదా అనునది ఎట్లు తెలియును?"

బుద్ధుడు నవ్వుచు ఇట్లనెను.

"అజగరము సహితము దేహమున కాకలి వేసినపుడు కదలును. అవసరమో, కాదో నిన్ను నీవు ప్రశ్నించుకొన్నచో బుద్ధి నుండి నీకు తెలియగలదు. బుద్ధి నుండియే ఊర్ధ్వమునకు గల సమస్త లోకములు తెలియగలవు. బుద్ధి మాత్రమే నియత కర్మను తెలుప గలదు. బుద్ధిని సంప్రదించనివాడు ప్రపంచమున బుద్ధుడగు

చుండును. బద్ధత లేక సృష్టియందు నర్తించుటకే బుద్ధి యొసగ బడినది.”

దేవదత్తుడు కర్మలయందుగల ఆవశ్యకత, అనావశ్యకత తెలుయుటలో విఫలుడయ్యెను. అజ్ఞానమను చీకటిన పడెను.

# 55

## శుద్ధి - సిద్ధి

**వృ**ద్ధుడొకడు బుద్ధుని చూచుటకేగెను. జనులు తండోప తండములుగా బుద్ధుని చూచుటకు వచ్చుచుండగా వారి తాకిడికి తట్టుకొనలేక నేలబడెను. వృద్ధుడు పట్టుదలతో మరల చేతికఱ్ఱ సాయమున లేచి నడువసాగెను. మరల జన సమూహముచే తోయ బడెను. మరల నేలబడెను. అయిననూ ధైర్యము వీడక లేచుచు, బుద్ధుని వైపునకు సాగెను. ముందుకు సాగుతున్నకొద్దీ, జనసమ్మర్ధ మెక్కువై మరియొకమారు కిందబడగా వృద్ధుడిట్లు నిస్పృహతో పల్కెను.

“నన్నేల నిరాకరించెదవు? నేను నీ కొరకే జీవించుచున్నవాడను. నిన్ను చేరుటయే నా సంకల్పము. నా శక్తిహీనతను చూసి విసర్జింప కుము. నా సంకల్పము నిన్ను చేరుటయే. అందలి స్వచ్ఛతను గమ నింపలేవా? స్వచ్ఛత కన్నా శక్తియే గొప్పదా?

ఇట్లనుచు వృద్ధుడు తలపైకెత్తగా సాలెపురుగు దారమువలె ఊర్ధ్వముగ నొక రేఖ కనిపించెను. సూర్యకిరణము కాంతికి అది మిరు

మిట్లు గొల్పుచు తన హృదయము నుండి సహస్రారము పైవరకు భ్రూమధ్యము ద్వారా ఎగబ్రాకుచూ, కాంతిమయమై గోచరించెను. కాంతి మయదారము నందలి ప్రతి అణువును బుద్ధుని ప్రతిబింబింప జేసినవి. వృద్ధుని ఆనంద మమిత మయ్యెను. బుద్ధుని చేరుమార్గము తనవద్దే యున్నదని తెలిసి వృద్ధుడు పరమానంద భరితుడయ్యెను.

ఆకాశమపుడు "సంకల్ప శుద్ధి – నిస్పృహ – ఆనందము" అని పలికినది.



# 56

## మహిమ

**బు**ద్ధుడు మౌనియై, ప్రశాంతముగ బోధివృక్షము క్రింద కూర్చొనియుండగా పాంథుడొక డేతెంచి యిట్లనెను.

“మీరు మహాత్ములని వింటిని. మహాత్మ్య మొకటి చూపినచో మిమ్ముల ననుసరింతును.”

బుద్ధుడు నవ్వుచూ పాంథు డాశ్చర్యపడునట్లు ఒక మహాత్మ్యము చేసెను. పాంథు డాశ్చర్యపడెను. ఆనందముగూడ చెందెను. బుద్ధునితో యిట్లు పల్కెను.

“నేను మిమ్ములను అనుసరించుటకు సర్వదా సంసిద్ధుడను. దీక్షతో మీరందించు మార్గమున నడతును. నాకు దీక్ష ననుగ్రహింపుడు.” ఇట్లనుచు బుద్ధుని పాదములు స్పర్శించి, లేచి నిలబడెను.

బుద్ధుడు శాంతగంభీరుడై కన్నులతో పాంథుని త్వరితగతిని అచటినుండి పొమ్మని సంజ్ఞ చేసి చేతితో బయటికి దారిని చూపించెను. బుద్ధుని రూపమును చూచి భయపడిన పాంథుడు అచటినుండి పలాయనము చిత్తగించెను.

57

# నిష్క్రమణ

గౌతమబుద్ధునకు నిదుర పట్టలేదు. అర్ధరాత్రి సమయమున లేచి కూర్చుండెను. భార్య యశోధర, పసితనయుడైన సిద్ధార్థుడు నిదురలో నున్నారు. ఒక్కసారి వారిని పరికించి చూచినాడు. తన భార్య మహాజ్ఞాని, స్థితప్రజ్ఞురాలు. వాదించి తానామెను గెలువలేడు. లోనుండి తీవ్రమగు ప్రబోధము తనకు ప్రతినిత్యము కలుగుచున్నది. భార్యను, పిల్లవానిని, తల్లిదండ్రులను, రాజ్యమును త్యజించి, సత్యదర్శనమునకై తపస్సు చేయుమని ప్రబోధము. ఈ ప్రబోధమును భార్యతో ప్రసంగించినపుడెల్ల ఆమె సత్యము నిచ్చటనే దర్శించవచ్చు నని, సత్యముకొరకెచటికో చన నవసరములేదని సోదాహరణముగ తనకు వివరించి నచ్చజెప్పును. ఆమె చెప్పునది సత్యమే అయిననూ తన కెందులకో అది నచ్చుట లేదు. పర్వత శ్రేణులలో తపస్సు గావించిననేగాని సత్యదర్శనము కాదని ఆత్మప్రబోధము జరుగు చున్నది. ఏనాడు తనకు సరిగా నిదుర పట్టుట లేదు. ఆనాడు కూడ అట్లే నిదుర పట్టుట లేదు. అతడు ధృఢనిశ్చయుడై రాజభవన మును వదలి రాత్రికి రాత్రే గుఱ్ఱము నెక్కి ఒక సహచరునితో నిష్క్రమించెను. వాయవ్య దిక్కుగా నదీ పథమున లోయలలో

పయనించెను. పక్షము రోజులట్లు పయనించెను. కొండలు, గుట్టలును దాటుచు ఎత్తైన పర్వత మొకటి దాటి, సేవకుని గుఱ్ఱముతో ఇంటికి పొమ్మని ఆజ్ఞాపించి, ముందుకు సాగెను.

సేవకుడు నిష్క్రమించుచు, గంభీరముగ నిట్లు పల్కెను. "రాజపుత్రా! నీ వింకనూ ముందుకు సాగు సమయమున ఒక వేటగాని నివాసమును దర్శించగలవు. నీవతనికి ఈ గంధపుచెక్క నిమ్ము" అని తెలిపి మూడు సంకేతములుగల గంధపుచెక్క నొకదానిని గౌతమున కిచ్చెను. గౌతము డాశ్చర్యము చెందెను. తీక్షణముగా సేవకుని చూచెను. సేవకుని ముఖము తేజోమయమై యుండెను. గౌతమునకు మరింత ఆశ్చర్యము కలిగినది. సేవకుడు ప్రశాంత వదనముతో "సోదరా! పోయిరమ్ము. నీ కంతయును శుభము కాగలదు." అని పలికి చటుక్కున గుఱ్ఱమెక్కి వెనుదిరిగి గుఱ్ఱము నదిలించి అతి వేగముగా వెనుకకు మరలిపోయెను!

గౌతముడు నిర్ఘాంతపోయెను. తన అనుచరుడు సేవకుడు కాదు. సహాయకుడు! దివ్య సహాయకుడు!! ఎంత ఆశ్యర్యము! ఇంతకాలము కేవలమొక సామాన్యునివలె తన అంగరక్షకునిగా నిలచినాడు. అనేకానేక సేవలను చేసినాడు. అతడంగరక్షకుడా? కాదు. ఆత్మరక్షకుడు. గౌతముడు వినమ్రుడై సేవకుడు జనిన మార్గమువైపునకు వంగి నమస్కరించి ముందుకు సాగెను.

గౌతముడు కాలినడకన పర్వతశ్రేణులలో ముందుకు సాగెను. ఏడు దినములు గడచినవి. ఎనిమిదవ దినమున తనకు ముందుగా

తెలుపబడిన వేటకాని కుటీరము కనిపించినది. కుటీరమును సమీపింపగా ముఖద్వారము తెరిచియున్నట్లు గోచరించి నది. ద్వారముకడ వృద్ధుడొకడు గౌతమునికొరకెదురుచూచు చున్నట్లు నిలబడి యుండెను. గౌతము డతని కడకేగి సంప్రదాయబద్ధముగ నమస్కరించెను. వృద్ధుడు గౌతముని కనులలోనికి చూచెను. గౌతముడును వృద్ధుని కనులలోనికి చూచెను. ముహూర్తకాలము ఇరువురిని నిశ్శబ్దము పరిపాలించినది. అటుపైన వృద్ధుడు తన కుడిచేయి చూపుడు వేలుతో సమీపమున గల వృక్షమును మౌనముగా చూపించెను. గౌతమునికి అపుడు తన అనుచరు డిచ్చిన గంధపుచెక్క గుర్తుకు వచ్చినది. వెంటనే త్రిసంకేతముతో కూడిన గంధపుచెక్కను అంగవస్త్రమునుండి తీసి వృద్ధునికిచ్చి మరల నమస్కరించెను. వృద్ధుడు తన కందించిన గంధపుచెక్క ముక్కను పరిశీలించి, నవ్వుచూ గౌతముని లోనికి మౌనముగా ఆహ్వానించెను. విశ్రాంతి గొనుటకు వేదికను చూపెను. గౌతము డచట ఆశీను డయ్యెను. వృద్ధుడు లోనికేగి, పండ్లు, తేనె గౌతముని కాహారముగ నొసగి విశ్రమించమని సూచించెను. ఆహారమును గొనిన గౌతముడు విశ్రమించి ఆ పగలు, తరువాత రాత్రి గాఢముగ నిద్రించెను.

మరునాడుదయము గౌతముడు నిదురలేచుసరికి అరుణ కాంతులు సమీప హిమశిఖరములపై బడి, శిఖరములను హిరణ్మయ ములను గావించు చున్నవి. గౌతముడు కుటీరమును పరిశీలించి చూడగా, వృద్ధుడు కుటీరమున కనిపించలేదు. సమీపమున గొడ్డలి

శబ్దము వినిపించుచుండగా, గౌతముడు కుటీరము వెలుపలికిచని, వృద్ధుడు కార్యనిమగ్నుడై యుండుట చూచెను. గౌతముని చూచిన వృద్ధుడు మరల కుటీరమున ప్రవేశించి, గౌతమునికి మరల తేనెతో కూడిన పానీయము నందించెను. పానీయము గ్రోలిన గౌతమునికి వృద్ధుడు ఒక కంబళిని, చేతికర్రను అందించి కుటీరము బయటకి దారి చూపెను. గౌతముడు మరల ప్రయాణమునకు సిద్ధమగు చుండగా కుటీరము వెలుపల వృద్ధుడగుపించి మూడుమార్లు వంగి నమస్కరించి, తన ననుసరింపుమని గౌతమునికి సౌంజ్ఞ చేసెను. ఆశ్చర్యపడుట మరల గౌతముని వంతైనది.

వృద్ధుడు ముందు నడచుచుండగా, గౌతముడు వెనుక అనుసరించు చుండెను. దట్టముగ నున్న వనమున వృద్ధుడు కొన్ని గుబుళ్లను గొడ్డలితో నరికి రహస్యమగు నొక యిరుకైన కాలిబాటను చూపెను. ఆ బాటలో తాను ముందు నడచుచు, గౌతము ననుస రించమని సూచించెను. సూర్యుడు నడినెత్తి చేరువరకును యిరుకు, క్లిష్టము అయిన మార్గములో దట్టమైన పొదలను నరకుచు వృద్ధుడు గౌతముని ముందుకు నడిపించెను. క్రమముగా పొదలు ఒక విశాలమగు లోయలోనికి దారి చూపినవి. గౌతముడు సెలయేటి చల్లదనమును, ప్రవాహ శబ్దమును విని పర్వత శ్రేణులలో గల నొక నదీతీరమును చేరుచున్నట్లుగా భావించెను.

నదీ తీరమున కొంత తడవు విశ్రమించిన వెనుక వృద్ధుడు తన వద్ద గల వింటిని సంధించి ఒక బాణమును నది కావలవైపునకు

వదిలెను. బాణము అమిత వేగముతో ఆవలి ఒడ్డున గల వన మధ్యములో పడెను. కొంత తడవైన వెనుక వృద్ధుడు గౌతమునికి వస్త్రములు, ఆభరణములు విసర్జించమని సూచించెను. గౌతముడట్లే చేసెను. ఆ వస్త్రములు చాల విలువైనవి. ఆభరణములు మరింత విలువైనవి. అందుచే వస్త్రాభరణములు రెండింటిని గౌతముడు వృద్ధున కీయబోయెను. వృద్ధుడు దరహాసముతో వానిని నదిలో నిక్షిప్తము చేయమని గౌతమునికి సూచించెను. గౌతముడట్లు గావించెను.

ఇంతలో అవతలి తీరమున నొక పొడగరి కనిపించెను. అతడు ఆపాదమస్తకము ఉన్ని వస్త్రములు ధరించి యుండెను. ముఖము విశాలముగను, చామన చాయగను గోచరించినది. అతడొక చిన్ననావను నదిలోనికి తోసి తెడ్డువేయుచు గబగబ ఈవలి ఒడ్డుకు వచ్చెను. నావకు లంగరు వేసి, తీరమున నున్న గౌతమునికి, వృద్ధునికి వంగి మూడుసార్లు నమస్కరించెను. గౌతముని నావలోనికి ఆహ్వానించెను. గౌతము డాలోచించుచు నావనెక్కెను. వృద్ధుడు వదలిన బాణమునకు ప్రతిస్పందనయే ఈ నావికుని ఆగమము గాబోలని భావించెను. నావ కదలినది. గౌతముడు వెనుదిరిగి వృద్ధునకు వీడ్కోలు తెలుపవలెనని భావించెను. వృద్ధుడచట లేడు! అంతలోనే అదృశ్యుడయ్యెను! గౌతముడు ఆ దిక్కునకు వంగి నమస్కారము చేసెను. ముందుకు సాగెను.

నావికుడుగూడ మౌనధారియే, గౌతము డొకసారి తనకు మార్గము చూపిన అంగరక్షకునకు, వృద్ధునకు హృదయమున నమస్క

రించుకొనెను. కొలది క్షణములలోనే నావ ఆవలిగట్టు చేరెను. ఇరువురును నావను విసర్జించిరి. ఎదురుగా రెండు గుఱ్ఱములు సిద్ధముగ నున్నవి. ఇద్దరును గుఱ్ఱముల నధిష్ఠించిరి. పర్వత శిఖరము నొకదానిని అధిరోహించిరి. అప్పటికి సూర్యు డస్తమించెను. చంద్రుని కాంతిలో రాత్రియంతయు పర్వత మావలివైపునకు అవరోహణము గావించిరి. ఆవలివైపు గల పల్లపు ప్రాంతములో గల నొక ఆశ్రమమును చూపి, గుఱ్ఱములను గొని అపరిచితవ్యక్తి గౌతమునికి నమస్కరించి నిష్క్రమించెను. గౌతముడు చేరవలసిన స్థానమును చేరెను. సత్య దర్శనమున కదియే గౌతముని ఆశ్రమము. దారి చూపిన వారందరికి నమస్కరించి గౌతము డాశ్రమము చేరెను. తపస్సు గావించెను.

పెద్దల అనుగ్రహమున తపస్సు సిద్ధించినది. తిరిగి వచ్చి వారణాసి విహార ప్రాంతములయందు సత్యబోధన గావించెను. కుశీ నగరమున దేహత్యాగము చేసెను.



**58**

# బుద్ధ - మైత్రేయులు

గౌతమబుద్ధుడు జన్మించిన ఏడు సంవత్సరములకు మైత్రేయి దేహము ధరించినది. గౌతమబుద్ధునకు పదునాలుగు సంవత్సర ములు వచ్చుసరికి రాజపురోహితులు శుద్ధోదన మహారాజుతో ఇట్లని పలికిరి.

“మహారాజా! రాజకుమారునకు పదునాలుగు సంవత్సర ములు వచ్చినవి. నిశితముగ, లో దృష్టితో అతనిని పరిశీలించినపుడు మాకు అతనియందు అవతార చిహ్నములు కనిపించుచున్నవి. అవగాహనయే అతని శిరస్త్రాణముగా గోచరించుచున్నది. రక్షణయే అతని బాహవులుగా గోచరించుచున్నవి. ప్రచోదనమే అతని ముఖ వర్చస్సుగా భాసించు చున్నది.”

ఆ సమయమున గౌతముని తల్లి మాయాదేవి అచటికి వచ్చి “దయ, ప్రేమ, అహింస నా కుమారుని విజ్ఞానమునకు భుజకీర్తులు. దేవతా సమూహములే అతని బృంద సభ్యులు” అని పలికినది.

అదే సమయమున కమండలధారియగు ఒక మహర్షి అచటి కేతెంచి యిట్లనెను. "రాజపురోహితులు, మాతృమూర్తి గౌతముని యెడల పలికిన పలుకులు సత్యములు. ఇతనికి సన్నిహితుడగు మిత్రుని ఆవశ్యకత యున్నది. మహాత్ముడగు నాగరాజుని కుమార్తె గౌతమున కన్నివిధములుగా సహకార మందించగలదు. మహా రాజుల అంగీకారమున్నచో నేనామెను తోడ్కొని రాగలను."

మహారాజు మహర్షి ఆకస్మిక ఆగమనమునకు, అతడు పలికిన పలుకులకు అత్యాశ్చర్యము పొంది యిట్లనెను.

"నాగరాజు మహా మహిమాన్వితుడు. ఋషిపుంగవులచే సన్మానింపబడువాడు. ఆయన కుమార్తె మైత్రి నా కుమారునికి దక్కుట సంభవమా?"

"అంతయునూ సంభవమే. మహారాజు ఆజ్ఞయే మైత్రిని సమకూర్చ గలదు."

శుద్ధోదన మహారాజు మరల యోచించి మహర్షితో యిట్లని పలికెను. "నాగరాజు కుమార్తె వైశిష్ట్యమేమి? ఆమె నామమేమి?"

మహర్షి : "నాగరాజు కుమార్తె నామము మైత్రేయి. ఆమెకిపు డేడు సంవత్సరములు. పుట్టినది మొదలు నేటివరకు ఆమె ప్రదర్శించిన దివ్యజ్ఞానము ఋషులను సైతము అబ్బుర పరచినది. ఆమె జ్ఞానఖని అని ఋషుల అభిప్రాయము."

శుద్ధోదనుడు : అయినచో ఆమెను శీఘ్రముగ గొనిరండు. ఆమెను చూచటకు నేనత్యంత కుతూహలముగ నున్నాను.

మహర్షి అట్లే అని పలికి వెడలిపోయెను.

మరునా డుదయముననే ఏడేండ్ల బాలికతో మహర్షి మరల రాజకుటుంబమును దర్శించెను. మైత్రేయిని చూచిన శుద్ధోదన మహారాజు ముగ్ధుడయ్యెను. బాలిక అనుపమానమగు సౌందర్యవతి. ఆపాదమస్తక మామెరూపము మిక్కిలి సుకుమారముగ తోచెను. ముఖవర్చస్సు చీకట్లను పారద్రోలునట్లుగా తోచినవి. భ్రూమధ్యమున విచ్చిన తెల్లని మొగ్గవలె స్పష్టాస్పష్టముగ నొక తేజస్సు గోచరించు చున్నది. మెడనుండి పాదములవరకు తెల్లని వస్త్రములు ధరించి యున్నది. ధనుర్బాణములు ధరించియున్నది. నడుమునకు బిగించిన వడ్డాణమునకు చురకత్తి యొకటి వ్రేలాడుచున్నది. శిరోజములు నలుదిశల చీకట్లు విరజిమ్ముచున్నట్లు తోచినవి. మైత్రేయి రూపము ముగ్ధమనోహరమై శుద్ధోదనుని ఆకర్షించినది.

శుద్ధోదను డా ప్యాయతతో బాలిక నుద్దేశించి యిట్లు పలికెను.

“మైత్రేయి! దూరముగా గోచరించుచున్న నెమలిని చూడుము. అది పరుగులెత్తు చున్నది. దాని కంఠము క్షణమునకొక తీరుగ నాట్యము చేయుచున్నది. ముఖమటునిటు క్షణకాలములో త్రిప్పుచు నున్నది. నీ ధనస్సును గైకొని ఆ నెమలి కన్నును కొట్టుము. నీ నిశితత్వమునకు, ఏకాగ్రదృష్టికి ఇది నే నేర్పరచు పరీక్ష.”

మైత్రేయి : “మహారాజా! క్షమింపుడు. నా ధనుర్బాణములతో జీవులను హింసించుటకు, వాని ప్రాణములను తీయుటకు నేను సమ్మతింపను. ఇంతకుమించిన వేగవంతమైన అచేతనమగు ఏ వస్తువునైననూ నేను ఛేదించి మిమ్ములను సంతృప్తిపరచగలదానను.”

శుద్ధోదనుడు, మాయాదేవి, గౌతముడు, రాజపురోహితుడు మైత్రేయి పలుకుల యందలి ధీరత్వము, సంకల్పమందలి స్థిరత్వ మును గుర్తించి, ఆనంద పడినారు. గౌతమునికి మైత్రేయితో మైత్రికి రాజు సమ్మతించినాడు.

గౌతముడు, మైత్రేయి గౌతముని ఆకస్మిక నిష్క్రమణ వరకు ప్రాణమిత్రులవలె మెలగిరి. గౌతమునకు మైత్రేయిని మించిన సన్నిహితులు వేరు. తలిదండ్రులకంటెను, తన భార్యకంటెను కూడ మైత్రేయి యందు గౌతముడు అత్యంత ప్రేమాదరములను కలిగి యుండెడివాడు. వారి సన్నిహితత్వము స్నేహమునకు పరిపూర్ణ నిర్వచనమై మిగిలినది. గౌతముడు మైత్రేయిని అనేక సందర్భము లలో, “ఓ తేజశ్విని! ఓ స్థిర సంకల్పి! ఓ నాగు! ఓ తపస్విని! ఓ యోద్ధా!” అని సంబోధించు చుండెడివాడు. మైత్రేయి మిత్రత్వముతో ప్రతిస్పందించుచు గౌతమునితో సృష్టి విజ్ఞానపరమగు విషయములు చర్చించుచు, గౌతముని హృదయమున జ్ఞాన కవాటములను తెరుచుచు నుండెడిది. జ్ఞానాగ్ని, జఠరాగ్నివలె దహించుచుండగా గౌతముడు ఆత్మాన్వేషణమున రతిగొనెను. అన్వేషణమునకు కూడ మార్గమును చూపినది మైత్రేయియే!

ఆత్మాన్వేషణము మార్గమున జనిన గౌతముడు బుద్ధుడై తిరిగి వచ్చినపుడు కూడ అతనిని సాదరముగ నాహ్వానించి, ప్రబోధమునకై తోడ్పడినది కూడా మైత్రేయియే. గౌతమబుద్ధుని మరియు అతని ప్రబోధనలను పరిరక్షించి, వ్యాప్తి గావించిన హితురా లాయెయే.

మైత్రేయి బుద్ధునకు అదృశ్య పరిరక్షకురాలు. మైత్రేయి బుద్ధునకు అప్రకటిత అమాత్య. సామాన్యులనుండి బుద్ధుడందించిన జ్ఞానము పరిరక్షించుచు సామాన్యులలో ఒకతిగ మెలిగిన పుణ్య మూర్తి.

కుశీ నగరమున బుద్ధుడు దేహత్యాగము గావించు సమయ మున మైత్రేయి బుద్ధుని ఏకాంతమున కలసినది. అపుడు బుద్ధు డిట్లనెను.

"సఖీ! మైత్రేయి! నీ ఏడేండ్ల ప్రాయము నుండి నన్ను పరి రక్షించితివి. నా మార్గమున నీవాసాంతము సహాయ మందించుచునే యుంటివి. ప్రపంచమునకు నిన్నెరుక పరచనీయ కూడదని నాపై ఆంక్షను విధించితివి. నిన్ను మించిన మిత్రులు విశ్వమునందు లేరు. దేహత్యాగ సమయమున కూడ నాకు తోడ్పడుటకై యేతించిన నీ మిత్ర వాత్సల్యమును ఏమని వర్ణించగలను. నీవే నా భవిష్యత్తు. నేను నీ గతము. నీ నుండి నే నందించిన అహింసా మార్గము ముందు తరములలో ప్రేమ- జ్ఞానమార్గములుగా వికసించవలెనని నా ఆకాంక్ష. అష్టదిక్కులు, పంచభూతములు సాక్షిగా నేనిపుడు పల్కుచున్నాను. భవిష్యత్కాలము మైత్రేయ యుగమై నిలచు గాక!

మైత్రేయుడు అన్ని దేశములను, జాతులను వెలుగు మార్గమున నడిపించుగాక! మైత్రేయుడు జగద్గురువై భూమిని, భూమి జీవులను ఉద్ధరించుగాక! ఈ నా వాక్యము సత్యమై మూడు లోకముల స్థిరపడుగాక !”

బుద్ధు డీవిధముగ పలుకగా, అష్టదిక్కులు, నవగ్రహములు, పంచభూతములు, ఇంద్రాది దేవతలు నిశ్చలులై విని, నిశ్చేష్టులై నిలచిరి. గౌతమబుద్ధుడు తుది శ్వాసను విడచెను.

మైత్రేయి అతని హృదయముపై తన దక్షిణ హస్తము నుంచి బుద్ధునికి చల్లదనము కలిగించెను.

పై సత్యము హిమాలయమునకు ఉత్తర ప్రాంతములోగల ఆశ్రమములో నిక్షిప్తము చేయబడి యున్నది. మైత్రేయుడు జగద్గురువై భూమి జీవులకు నలుదశల భక్తి, జ్ఞాన, యోగ, వైరాగ్యములను పంచుచునే యున్నాడు. అతడే మైత్రేయి బుద్ధుడు. మిత్రత్వమే మైత్రేయుని సంపద.

# 59

## నైష్ఠికుని మరణము

నైష్ఠికు డొకడు 84 సం॥ల వయస్సు కలిగియుండెను. అతనికి ఉపనయనము జరిగిన 7వ సం॥ము నుండి నిష్ఠతో సంప్రదాయబద్ధుడై దైవారాధనము గావించెను. సంఘమున అంటక, ముట్టక జీవించుచు నుండెడివాడు. అశుచి, అజ్ఞానము, అవిద్యల యెడల ద్వేషము కలిగి యుండెడివాడు. ఆర్యుల యెడల గౌరవము. మ్లేచ్ఛులు, హీనజాతుల యందు నిర్లక్ష్యముతో జీవించు చుండెడి వాడు. తగు మాత్రము ధన సముపార్జనము చేయుచు కుటుంబ మును పోషించి కృతకృత్యుడయ్యెను.

అతడు తన 84వ జన్మదిన సందర్భమున సహస్ర చంద్ర దర్శనోత్సవమును కూడ గావించెను. ఆనాడు రాత్రి పరుండగ ఆలోచనలు పరంపరలై వచ్చినవి. 77 సం॥లు నిష్ఠగ దైవారాధనము గావించితిని. తన కీనాటికిని దైవదర్శనము కాలేదు. తన నిష్ఠ మడి, ఆచారము విషయములలో ఎన్నడునూ లోటు చేయలేదు. కర్తవ్య నిర్వహణము నిర్వివాదముగ నిర్వర్తించినాడు. కష్ట నష్టము

లను తగుమాత్రము భరించినాడు. దైవముపై విశ్వాస ముంచినాడు. ఎందులకో దైవము తనయందు ఉదాసీనుడై యున్నాడు. తన కేఅనుభూతియు లేదు. దర్శనము కూడ లేదు. తాను తన జీవన విధానము సమగ్రమా? అసమగ్రమా? ఇట్టి ఆలోచనలతో అర్ధరాత్రము వరకు నిద్రపట్టలేదు.

నైష్ఠికునకు తెల్లవారుజామున స్వప్న మొకటి కలిగినది. అందొక దివ్యపురుషుడు దర్శనమిచ్చి యిట్లు పలికెను. "నైష్ఠికుడా! సంఘమున సామాన్యజీవుల కన్న, నిన్ను నీవు వేరుగ గుర్తించితివి. దీనులను, హీనులను చూచుట, తాకుట, వినుట నీ శుచికి భంగ మని భావించితివి. కాని అట్టివారి నుండి ధాన్యము, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులు కొనుటకు సందేహింప లేదు. చెప్పులు కుట్టి యిచ్చువాడు నీ దృష్టిలో మాలవాడు, అంటరానివాడు. కాని అతడు కుట్టిన చెప్పులు మాత్రము నిత్యము ధరించి తిరుగుదువు. ఇట్లే నీవు సంఘమున ఎందరితోనో ప్రవర్తించితివి. నీవు కట్టు బట్ట, తిను తిండి, వాడు వస్తువులు, నీ క్షురకర్మ ఇత్యాదులన్నియు ఎవరి సహాయమున నీవు నిర్వర్తించితివో వారందరి యెడల నీకు నిరసన భావము. దైవమున కట్లు కాదు. దైవము నీ యందెట్లున్నాడో అట్లే వారియందును వున్నాడు.

"నీవు దైవమును విశ్వసించుచున్నా ననుకొనుచున్నావు. కాని నీ నిర్వచనముకన్న దైవము అత్యధికమై యున్నాడు. నీ నిరసన భావము వలన నీవు నిర్వచించుకొన్న దైవము కూడ నీ కగుపడుట

కిష్టపడుట లేదు. నీ పొలమును పండించు రైతు, నీ పశు సంపదను రక్షించి పోషించు పాలేరు, నీకు క్షుర కర్మలను నిర్వర్తించు మంగలి, నీకు నిత్యావసర వస్తువులు సమకూర్చు జీవు లందరి యందును గల దైవమును చూచినచో నీ విశ్వాసము పరిపూర్ణమగును. నీవు నిర్ణయించుకొను తప్పు ఒప్పులలో భగవంతు డిమడడు. భగవంతుని యందు విశ్వాసము కన్న ప్రేమ ముఖ్యమని గుర్తెరుగుము. అందరియం దతడున్నాడు గనుక అందరియందు దర్శించి అతనిని ప్రేమించు. అపుడే దర్శనము సాధ్యము. మరియొక మార్గము లేదు. స్వప్నమున బ్రాహ్మణుడు దివ్య పురుషునకు నమస్కరించెను.

మరునాడుదయము నైష్ఠికుడు మరణించెను. మరుజన్మ యందు సమగ్రమగు యోగమార్గమును దివ్యపురుషుని ఆశీర్వ చనముగ పొందెను.



# 60

## కరదీపిక

**నా**రద మహర్షి లోక సంచారము చేయుచు, భూలోక మందలి యొక ఆశ్రమమున కొంత తడవు విశ్రాంతి గొనెను. అతడు ఆశ్రమవాసుల నాశీర్వదించి, మరల సంచారమునకై సిద్ధమగుచుండగా ఆశ్రమవాసులు ఆయన చుట్టునూ చేరి “స్వామీ! మాయను దాటుటకు మార్గము తెలుపుడు” అని వేడుకొనిరి.

నారదుడు నవ్వుచు యిట్లనెను. “ఉన్నది దైవమే. దానిని మీరు మరచినపుడు మీకు మిగులునది మాయ. దైవమును చూచిన మాయలేదు. మాయను చూచినచో దైవము లేదు. ఈ విషయమున మీకొక కథ తెలుపుదును.

పూర్వకాలమున హిమాలయపు ఉత్తర ప్రాంతములలో ఒక బ్రహ్మరాక్షసిని గూర్చి ప్రజలు భయపడుచుండెడివారు. ఆ రాక్షసి పేరు చెప్పినంతనే పంచప్రాణములు ఒక్కసారిగ క్షణమాత్రము పోయి వచ్చుచుండెడివి. అందరికిని రాక్షసిభయమే. ఆ సమయమున

ఆ ప్రాంతమునకు బ్రహ్మర్షి యొకరేతెంచిరి. ప్రజలందరు బ్రహ్మర్షి చుట్టును చేరి రాక్షసిని సంహరించు ఉపాయమును కోరిరి. బ్రహ్మర్షి ముహూర్తకాలము ధ్యానము గావించి మందహాసముతో నిట్లు పలికెను.

"మీలో ధైర్య సాహసములుగల యువకుడొకడు ముందుకు వచ్చినచో నే నతని కొక దివ్యకరదీపిక నిచ్చెదను. ఆ కరదీపికను చూసినంతనే రాక్షసి మఱణించును. కాని కరదీపికను వదలినచో రాక్షసి భక్షించును."

బ్రహ్మర్షి యిట్లు పలుకగనే స్ఫురద్రూపియగు యువకుడొకడు కరదీపిక నందుకొనుటకు ముందుకు వచ్చెను. బ్రహ్మర్షి సంతోష ముగ కరదీపిక నొకటి సృష్టించి అతని కిచ్చెను. యువకుడు ధైర్యముగా కరదీపిక నందుకొని బ్రహ్మరాక్షసికై వెదకెను. అతని వెంట వేయిమంది అనుచరులు కూడ బయలుదేరిరి. అందరునూ బ్రహ్మరాక్షసి కొరకై వెదకిరి. కుగ్రామములు, అరణ్యములు, పర్వత శ్రేణులతో సహా, సమస్త ప్రాంతము సంచరించిరి. ముప్పది సంవత్సరములు గడచినవి. సంహరించుటకు బ్రహ్మరాక్షసి కనపడ లేదు. యువకుడు వృద్ధుడైపోయనే గాని అతడు కరదీపికను వదలనూ లేదు, బ్రహ్మరాక్షసి కనబడనూ లేదు. దశాబ్దముల శోధనలో అలసిన యువకునకు బ్రాహ్మీముహూర్తమున అంతర్వాణి యిట్లని పలికినది. "నిజమునకు బ్రహ్మరాక్షసి లేదు. కరదీపిక యున్నంతకాలమది యుండదు." స్వప్నము నుండి మేల్కాంచిన

వృద్ధయువకుడు మహదానందముతో మేల్కాంచి బ్రహ్మర్షికడకేగెను. ఇట్లని పల్కెను. "కరదీపిక యున్నంతకాలము బ్రహ్మరాక్షసి యుండదు. కరదీపిక యారినచో బ్రహ్మరాక్షసి వచ్చును. ఇపుడేమి చేయవలెను?"

బ్రహ్మర్షి యిట్లనెను : "నీ కిచ్చిన కరదీపిక ఆరునది కాదు. దానితో నీవు ఎన్ని కరదీపములైననూ ఏర్పరుచవచ్చును. రాక్షసి భయముగల వారందరికిని ఈ దీపికల నందించుము. "

యువకు డుత్సాహముతో కరదీపికలను వ్యాప్తిగావించి దేశమున బ్రహ్మరాక్షసి భయమును పారద్రోలెను."

పై విధముగ కథను తెలిపి నారదుడు అంతర్ధానమయ్యెను. ఆశ్రమవాసు లందరును నారదుని కథను మననము చేయుచు అందలి రహస్యమును గ్రహించిరి. మాయను దాటిరి.



## OTHER BOOKS THROUGH

# MASTER K. PARVATHI KUMAR

*The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.*

**BOOKLETS :**

| | | |
|---|---|---|
| 1. | LORD MAITREYA -The World Teacher | E/G/S/F |
| 2. | THE WHITE LOTUS | E/G/S |
| 3. | WISDOM BUDS | E/G/S |
| 4. | SPIRITUALISM, BUSINESS & MANAGEMENT | E/G/S |
| 5. | THE PATH OF SYNTHESIS | E |
| 6. | THE ETHERIC BODY | E/G/S |
| 7. | MARIA MAGDALENA | E/G/S |
| 8. | TIME THE KEY | E/G/S |
| 9. | LISTENING TO THE INVISIBLE MASTER | E/G/S/F/H |
| 10. | GOOD FRIDAY | E/G/S/F/H |
| 11. | BHRIKTA RAHITA TARAKA RAJAYOGAMU | T/K |
| 12. | MARRIAGE - A SACRAMENT | E |
| 13. | MASTER C.V.V. YOGAMU-KARMARAHITYAMU | T |

**BOOKS :**

| | | |
|---|---|---|
| 14. | MITHILA –A New Age Syllabus | E/G/S |
| 15. | THE AQUARIAN MASTER | E/G/S |
| 16. | SOUND –The Key & its Application | E/G/S |
| 17. | ASHRAM LEAVES | E/G/S |
| 18. | SANKHYA –The Sacred Doctrine | E/G/S |
| 19. | VENUS –The Path to Immortality | E/G/S |
| 20. | THEOSOPHICAL MOVEMENT | E/G/S |
| 21. | SHIRDI SAY SAYINGS | E/G/S |

| | | |
|---|---|---|
| 22. | SPIRITUALITY IN DAILY LIFE | S |
| 23. | THE MASTERS OF WISDOM | S |
| 24. | MEDITATION & GAYATRI | S |
| 25. | WISDOM TEACHINGS OF VIDURA | E/G/S |
| 26. | ON HEALING | E/G/S |
| 27. | SPIRITUAL FUSION OF EAST & WEST | E |
| 28. | SRI SASTRY GARU | E/G/S/F/T |
| 29. | THE AQUARIAN CROSS | E/G/S |
| 30. | HERCULES –The Man & the Symbol | E/G/S |
| 31. | MANTRAMS –Their Significance & Practice | E/G/S |
| 32. | SRI DATTATREYA | E/G/S/T/HI |
| 33. | SATURN –The Path to Systematised Growth | E/S |
| 34. | JUPITER –The Path of Expansion | E/S |
| 35. | MASTER E.K. –The New Age Teacher | E/G/S |
| 36. | AMANASAKUDU | T/K |
| 37. | VRUTRASURA RAHASYAM | T |
| 38. | THE DOCTRINE OF ETHICS | E |
| 39. | DHANAKAMUNI KATHA | T |
| 40. | ANTARDARSANA DHYANAMULU | T |
| 41. | THE SPLENDOR OF SEVEN HILLS | E/T/Hi |
| 42. | DOCTRINE OF ETERNAL PRESENCE | E |
| 43. | ASANGUDU | T |
| 44. | SARASWATHI - THE WORD | E |
| 45. | MANA MASTERU GARU | T |
| 46. | GEETOPANISHAD | T |
| 47. | SRI LALITHA | T |
| 48. | POOJA VIDHANA PRASASTYAMU | T |
| 49. | GAYATRI MANTRA PRASASTYAMU | T |
| 50. | Katha Deepika | T |